


జ్యోతి

1964 జనవరి · 60 న.పై


బాబూమూవీస్
మూగమనసులు
దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు
నిర్మాత సి.సుందరం
శ్రీ ఫిలింస్ విడుదల


లలితమైన ప్రేమగాథకు
లలిత లలితమైన
రూపకల్పన!!
శ్రీ శంభు ఫిలింస్
పూజాఫలము
నిర్మాత. దగ్గుబాటి లక్ష్మీనారాయణ చౌదరి
దర్శకత్వం బి.యన్.రెడ్డి
నవయుగా

తొలిమాట

మీరు చూస్తున్నది జ్యోతి పన్నెండో సంచిక. అంటే జ్యోతికి ఏడాది వెళ్ళి రెండో యేడు వస్తోందన్నమాట.

గడచిన యేడాది అంతా మీలాగానే మాకూ హుషారుగా ఇట్టే గడిచిపోయింది. పత్రికా నిర్వాహణలో మామూలుగా వచ్చే చిట్టి చిట్టి చికాకులూ, చీదరలూ మాకూ వచ్చినా, మీ సహకార సానుభూతులతో అన్నిటిని అనాయాసంగా అధిగమించగలిగాం.

...

కావుననో పాఠక మహాశయా! కొత్త సంవత్సరాదికి, సంక్రాంతికి కలిపి జమిలిగా మా శుభాభినందన లందుకోండి.

ఇక ముందుకూడా జ్యోతిని మీ మా అభిరుచులు కలబోసి కొత్త చవులతో, కొత్త ఛవులతో, అన్ని అందచందాలతో అందించగలమని ఆశిస్తున్నాం.

చందాలంటే జ్ఞాపకం వచ్చింది. మీరు చం... సారీ... ఏం లేదు లెండి...

సచిత్ర మాసపత్రిక
బకింగ్‌హామ్‌పేట, విజయవాడ-2.

మేనేజింగ్ ఎడిటరు : వి. వి. రాఘవయ్య
విడిప్రతి వెల : 60 న.పై. — ఏడాది చందా : ఏడు రూపాయలే
సంపుటి 2 జనవరి 1964 సంచిక 1

పాఠక మహాశయా! ఈ నెల

కథా-కమామీషూ

ఉత్తరాయణం	...	7
సంక్రాంతి సుందరి – దాశరథి	...	9
రాజకీయవార్తావరణం	...	10
కార్టూన్లు	...	14
మానినీమానసం – ఎన్. ఆర్. నంది	...	18
కూనలమ్మ పదాలు – ఆరుద్ర	...	32
గిరీశం లెక్చర్లు – ముళ్ళపూడి వెంకటరమణ	...	34
భగవంతం కోసం – త్రిపుర	...	39
పంచపదులు – శ్రీశ్రీ	...	45
అగ్నిపుష్పం – కల్యాణసుందరీ జగన్నాథ్	...	49
పన్‌చాంగం – పఠాభి	...	62
సరసమైన ధరలు – బుచ్చిబాబు	...	64
వనమాల – మల్లాది రామకృష్ణశాస్త్రి	...	65
నిత్యానందంగారి సాంసారిక విజయాలు – సోమంచి యజ్ఞన్నశాస్త్రి		89
మానసోల్లాసమ్ – వి. ఎ. కె. రంగారావు	...	98
స్వరలహరి – పి. బి. శ్రీనివాస్	...	100
చైత్రయాత్ర	...	105

క వ ర్ట్యా ను

సంక్రాంతి ముగ్గులా ముద్దులొలుకు నారి

జ్యోతిలా అందాలు చిందే వయారి

తెలుగు తార కుమారి కృష్ణకుమారి

ముఖచిత్ర సుందరి సార్, ఈసారి.
(తవాకి తెలిదా యేంవిటి ?)

సంపాదక వర్గం :
నండూరి రామమోహనరావు, ముళ్ళపూడి వెంకటరమణ,
బాపు, వి. ఎ. కె. రంగారావు, రావి కొండలరావు.

Edited and Published by V. V. Raghavaiah for Jyoti Publications
and Printed by him at Thrinadh Art Printers
Buckinghampet post, Vijayawada - 2.

ఉత్తరాయణం

డిసెంబర్ జ్యోతి శోభాయమానంగా వుంది. అట్టమీది బొమ్మ "వాసకసజ్జిక" చాలా సుందరంగా వుందనడం అతిశయోక్తి కాదు. ఈ విధంగానే ప్రతినెల అట్టమీది బొమ్మను వేస్తే బావుంటుందని నానమ్మకం. శ్రీశ్రీ పంచపదులు, సరికొత్త పాతకథ, కెనెడీ జీవితఘట్టం. "బాత్ ఏక్ రాత్ కీ" మొదలైనవి కలసి ఈ సంచిక కెంతో శోభను కూర్చాయి.

జి. లక్ష్మారెడ్డి, కల్వకుర్తి.

"కెనెడీ జీవితంలోని ఒక ఘట్టం" చాలా బావుంది. అంత గొప్ప మనిషి జీవితంలోని ఇంత గొప్ప ఘట్టాన్ని ప్రచురించి నందుకు ఎడిటర్లకు నా అభినందనాలు.

గడ్డం శిరోమణీ ప్రసాద్,
విజయవాడ.

శ్రీశ్రీ గారి "పంచపదులు" మమ్మల్ని మంత్రముగ్ధుల్ని చేస్తున్నాయి. మల్లాదివారి సీరియల్ సంతోషదాయకంగా వుంది.

ముంగండ సత్యనారాయణరావు,
లక్కవరం.

హలో! జ్యోతీ! యవ్వనం సడలిపో తోంది నీలో. ఏమిటీకారణం? కృష్ణసంచి కతో నీ తిరోగమనం మొదలైంది. 'పెద్ద కవులూ, పెద్ద రచయితలు పెద్ద భావాలను నిరంతరం వెలువరచ లేదు. పైకొస్తున్న కుర్రవాళ్ళలో కూడా పెద్దభావాలుంటాయి. వాటిని చూడుమరి. డిటెక్టివ్ కథలమీద మోజు తగ్గినా మనవాళ్ళకి టేస్టు తగ్గలేదు. ప్రతి నెల ఒక డిటెక్టివ్‌కథ ప్రచురించు...

సి. పరమానందం, ఖమ్మం.

డిసెంబర్ సంచికలో పి. టి. 109 బోటు కాక్ పిట్‌లో ల్యూటినెంట్ కెనెడీ అని ముద్రింపబడింది. లెఫ్టినెంట్ అని వుండాలి. రంధ్రాన్వేషణ అనుకోకండి!

జి. వి. రత్నం, విశాఖపట్నం.

అది అమెరికన్ ఉచ్చారణ లెండి.

ప్రపంచంలో అన్నిటికన్న అందమైనది, అర్థంచేసుకోవడం కష్టమైనది ఏది? తకరివాదిల్లామ

అ. ప్రసాదరావు, మద్రాసు.

ముఖచిత్రం "వాసక సజ్జిక" అత్యంత ఆకర్షణీయంగా ఉంది. 'ఘటన' అనే కథ, వేసిన కథలన్నింటిలోకి చాలబాగుంది, కాని ఆరుద్రగారి బాతాఖానీ తక్కువగా ఉండటంవల్ల ఈ నెల జ్యోతి చప్పగా ఉంది.

గుండుమళ్ళ వెంకటరామారావు,
శ్రీకాకుళం.

సంగీత సమ్రాట్టు అశ్వత్థామ గారి పరిచయం, సామ్రాట్టు మల్లాది రామకృష్ణశాస్త్రి గారి సీరియల్ నవల మీవరసలో సరసంగా కన్పించాయి. మనసుకుల్లాసం కల్పించాయి. అశ్వత్థామగారి సంగీత మాధుర్యం ప్రతిఫలించేలా వ్రాసిన పి. బి. గారి వ్యాసం ఒక కళారాధకుని తపస్సును వివరించే కథానికలా ఉంది. అంత కష్టపరంపర నెదుర్కొని

ఆయన సాధించిన సంగీత విద్వత్తును ప్రస్తుతం మనవారెంతగా ఉపయోగించుకొంటున్నారో గమనిస్తే....ఎందుకు లెండి. ఆ వ్యాసంలో శ్రీనివాస్‌గారు "సతీ సులోచన" అశ్వత్థామగారిదని వ్రేర్కొన్నారు. కాని దాని సంగీతకర్త శ్రీ టి. వి. రాజు గారని గమనించాలి.

వి. సుందరామశాస్త్రి, హైదరాబాద్.

'అశ్వత్థామ' పై వ్యాసంలో అన్ని వ్రాసి ముఖ్యమైనది మరచారని తెలియజేయుటకు విచారించుచున్నాను. రామినీడుగారి 'కలిమి లేములు' చిత్రమునకు కట్టిన చక్కని సంగీతమునుగూర్చి ఒక్కముక్క వ్రాయక పోవటం ఆశ్చర్యం. అందులో వారు కట్టిన బాణీలు ఏ ఆంధ్రుడు మరువలేడు.

ఎ. విష్ణుకుమార్, ఛత్రపురం.

డిశంబర్ 'జ్యోతి' ముఖచిత్రం అత్యంతాకర్షణీయంగా వుంది. శ్రీశ్రీ గారి పంచ పదులు, బాత్ ఏక్ రాత్ కీ చాలా బాగున్నాయి. రచయితలకు ధన్యవాదములు. ఈ చలికాలంలో మా చలినీ ఆంధకారాన్నీ తొలగించి, వెచ్చదనం వెలుగులను ప్రసాదించే మీ 'జ్యోతి' (మా) కి మెనీ మెనీ ధ్యాంక్స్. కథలు మంచి మంచివి వేస్తూ ఆనందం కలుగజేస్తున్నారు.

జి. యస్. కె. సాయిబాబా, అనకాపల్లి.

శ్రీ శ్రీ గారి పంచ పదులు
బాపు గారి కార్టూనులు.
కుటుంబరావు కథలు.
ప్రతి జ్యోతీ సంచికలో
ఉండాలండీ సంపాదకులు !

వడిశా నరసింహులు, కొనిరెడ్డిపల్లె.



సంక్రాంతి సుందరి

— దాశరథి

బంతిపువ్వుల లేతనవ్వులతో
సంక్రాంతి సుందరి సాగి వచ్చింది
తెలుగు పల్లెలు నిద్ర లేచాయి
వెలుగులో కనువిప్పి చూచాయి
కొత్త అందం నృత్యమాడింది
సరికొత్త బంధం మదిని మెదిలింది
తిండి దొరకని పేదవాడైనా
నిండుగా భోంచేసి త్రేన్చేడు
వీధి తిరుగు భికారి వాడైనా
వింతగాను కుబేరు డైనాడు
పొలములో తిరుగాడు చిన్నారి
అల వరూధిని లాగ కనపడెను

కలహములు కనరావు లోకంలో
వలపులే కొల్లలుగ పండేను
పంటచేలో వింత సోయగము
ఇంటిలో వాల్గంటి సంబరము
ఏమి యెరుగని కన్నెపిల్లలకు
ఏదో వెచ్చదనం మనస్సులలో;
గొబ్బిదేవత అడుగుపెట్టగనే
ఉబ్బిపోయెను లేత హృదయాలు
ముసలిదైన జగత్తు ఫాలములో
కొసలుదేరెను కొత్త యౌవనము
అందచందాలొలుకు జవ్వనులు
అందుకొనిరి పూల బాణములు
మనసులో క్రొంగ్రొత్త గాయాలు
తీయతీయని వలపు వేదనలు
కొప్పులోగల బంతి పువ్వులకే
కొత్త అందం వచ్చె నీ నాడు
శత్రువను వాడెవడు కనరాడు
మిత్రుడే హృదయాన మెరిసేడు
కాంతికురిసే నేటి సంక్రాంతి
సర్వ దిశలను నింపినది కాంతి.

రాజకీయ వాతావరణం

మొన్న ఢిల్లీలో జరిగిన పార్లమెంటు సభలలో ముఖ్య చర్చనీయాంశం మూడవ పంచవర్ష ప్రణాళిక "మధ్యకాల సమీక్ష" ప్రణాళిక ప్రారంభించిన రెండేండ్లకు జరిగింది.

ప్రణాళికా లక్ష్యాలు అనుకున్నవి. అనుకున్నట్లు సిద్ధించలేదు. ప్రతి రంగంలోనూ అసంతృప్తి కనిపిస్తోంది. గత రెండేండ్లలో ఇన్ని కోట్లరూపాయలు, ఇన్ని రంగాలలో ఖర్చుపెట్టినా, జాతీయాదాయం అయిదు శాతం మాత్రమే పెరిగింది.

తృతీయ ప్రణాళిక ఇంత కుంటుపడుతూ నడవటానికి కారణం అనేకమంది అనేక విధాల వివరించారు: పార్లమెంటులో వారం రోజులపాటు జరిగింది ఈ అంశం మీద చర్చ.

దీనికి ముఖ్యకారణం ద్రవ్యలోపమా, అనుకుంటే అది యెంతమాత్రం కాదనేది అంకెల వివరాలు చూస్తే తెలిపోయింది. కేంద్రంవేసే పన్నులద్వారా, ప్రణాళికా వినియోగం కోసం పదకొండువందల కోట్ల రూపాయలు వసూలు అవుతుందని ఆదిలో అంచనా. అయితే ఈ రెండేండ్లలో వేసిన అదనపుపన్నుల వసూళ్ళుఇత్తే పందొమ్మిది వందలకోట్ల రూపాయలు వసూలు అవుతుందని ఖచ్చితంగా తేలిపోయింది. ఇక ముందు పన్నులు వెయ్యగూడదనే సిద్ధాంతం వేరేలేదు కూడా.

రాష్ట్రాలు, కేంద్రం కలుపుకుని, అదనపు పన్నులవల్ల పదిహేడు వందల పది కోట్ల రూపాయలు ప్రణాళిక వినియోగంకోసం సంపాదిస్తామని, మొదట్లో అంచనా వేసుకుంటే ఇప్పటివరకు రాష్ట్రాలలో నూ కేంద్రంద్వారా ప్రవేశపెట్టిన పన్నుల వసూళ్ళే ఇరవైనాలుగు వందల కోట్ల రూపాయల ధనాన్ని తెచ్చి పడవేస్తాయి.

వీటికి తోడు అనేక రూపాలతో విదేశ సహాయం వస్తూనేవుంది.

ఇన్ని వున్నా యెందుకు ప్రణాళికా లక్ష్యాలు అనుకున్న విధంగా సాధించుకోలేక పోతున్నాము అన్నదే అందరినీ ఈనాడు వేధిస్తున్న ప్రధాన సమస్య.

మరో విషయం మనం గమనించాలి. ఖర్చు పెట్టటానికి కేటాయించిన మొత్తాలు, కేటాయింపులకు తగినట్లుగా కాకుండా, తక్కువగా ఖర్చు అవుతున్నాయి. ఉదాహరణకు, ఈ అత్యవసర పరిస్థితులలోనే, ఈ సంవత్సరం రక్షణకోసం కేటాయించిన యెనిమిది వందల కోట్ల రూపాయలు, పూర్తిగా ఖర్చు పెట్టగలమనేది మనవారికి నమ్మకం లేదు.

అలాగే ఇతర రంగాలలో, అనుకున్న ఖర్చుకన్న, యెంతో తక్కువగా డబ్బు ఖర్చు అవుతోంది.

ఒకవైపు వసూళ్ళు యెక్కువగా వున్నాయి. ఖర్చువైపుకూడా చాలా తక్కువే జరుగుతోంది. ప్రణాళికా లక్ష్యాలు సిద్ధించుట లేదు. కారణం?

వ్యవసాయరంగంలో ప్రధానంగా లక్ష్యాలు దెబ్బతినటానికి కారణం, "ప్రకృతి చేసే బీభత్సాలవల్లనే పంటలు దెబ్బతినటం" అంటారు. అయినా దేశం అంతటా అన్ని సంవత్సరాల్లో పంటలు పోలేదుగా?

అట్లాగే, పారిశ్రామికరంగంలో ప్రణాళికలో గడచిన మొదటి రెండేండ్లకూ, పదకొండు శాతం వుత్పత్తి పెరుగుతుందని ఆదిలో అంచనా వేసుకుంటే ఇప్పటికి కనిపిస్తున్న పెరుగుదల ఎనిమిది శాతం.

ఈ విషయాలన్నీ పార్లమెంటులో పూర్తిగా చర్చించటం జరిగింది. ప్రతివాళ్ల ఎవరికి తోచిన కారణాలు వాళ్ళు చెప్పుకున్నారు.

చిత్రం యెక్కడంటే-ఇవన్నీ ఆర్థిక సమస్యలు. వీటిని ఆర్థిక దృక్పథంతోనే చర్చించాలి. కాని, వీటిని చర్చించినది రాజకీయ నాయకులు కావటం మూలంగా, చర్చల సందర్భంలో రాజకీయాలను మరచి మాట్లాడలేక పోయారు వారంతా. మన రాజకీయాలచుట్టూరా వీటిని ప్రదక్షిణం చేయించారు. అసలు విషయం దగ్గరకు వెళ్ళటానికి వారికి తీరుబాటు దొరకలేదు.

ప్రణాళికా లక్ష్యాలు ప్రైవేటురంగంలో యెక్కువగా దెబ్బతిన్నాయి. ఆరంగంమీద సరిఅయిన ఆంక్షలు లేకపోవటమే ఇందుకు ముఖ్యకారణం, అని సామ్యవాదం వాదించే వారు అంటుంటే మీరు మాత్రం ఏం పొడి చేశారు, ప్రభుత్వరంగంలో వున్నవన్నీ అవకతవకలు, మరియే ఇతరకారణాలో కావని అందుకు వ్యతిరేకవర్గంవారి వాదన.

ఏదాయితేనేం, తన్ను మాత్రం ముందర నీ కూకారిపోందని, బయటనుంచున్న "వీధిమానిసి" ఆరాటం.

పన్నులు వసూలు చేస్తున్నారు. ఖర్చు పెడుతున్నారు కాని, ఖర్చుపెడుతున్నదంతా పెట్టాల్సిన విధానంలోనే పెడుతున్నారా అని యెవరయిన సమీక్షిస్తున్నారా?

ఒక ప్రయోజన కార్యంకోసం, లేక ఒక ప్రాజెక్టుకోసం, కొంత ధనం మంజూరు అయింది. ఆ మంజూరైన పద్ధతు కాలదోషం పట్టకముందే, దానిని ఖర్చు పెడుతున్నారా అనే విషయం ఎవరైనా గట్టిగా పరిశీలిస్తున్నారా?

అట్లాగే, వ్యవసాయంకోసం, ఎరువులిస్తున్నారు. అప్పులుకూడా మంజూరు చేస్తున్నారు - నిజమే. కాని, వెళ్ళవలసిన చోటుకు "పరపతి సౌకర్యాలు" వెడుతున్నాయా లేదా అని ఎవరైనా నిష్పాక్షికంగా నిగ్గదీసి అడుగుతున్నారా?

కాయితాలమధ్య, గదులలో కూర్చుని, కూడికలు, హెచ్చవేతలు వేసుకుంటే లెక్కలుపెరుగుతున్నాయి. కాని ఆ అంకెలు ప్రత్యక్షంగాచూసుకున్నప్పుడు కనిపించడం లేదు.

ప్రతి వస్తువుకూ ధర పెరుగుతోంది. మార్కెట్టుకే ధర పెరిగిపోతోంది. కాని పెరగకుండా తరిగిపోతున్నదల్లా ఒక్క వ్యక్తుల కొనుగోలు శక్తి మాత్రమే.

అందుకే మూడవ ప్రణాళికా లక్ష్యాలు దెబ్బతిన్నాయి.

ఈ విషయాన్ని గురించి మరింత వివరంగా, రాజకీయాలలో ప్రమేయంలేని యే ఆర్థిక వేత్త నడిగినా చెబుతాడు.

ప్రభుత్వం మాత్రం ఆలోచన చేస్తున్నట్లు కనపడడంలేదు.

ప్రజాస్వామ్య సోషలిజం

మొన్న జయపూర్ కాంగ్రెసులో సోషలిజానికి మరో క్రొత్తరంగు వేశారు. సోషలిజానికి ముందు ప్రజాస్వామ్యాన్ని అడ్డం పెట్టారు.

ఈ ప్రజాస్వామ్య సోషలిజంలో "ప్రజాస్వామ్యం" యెన్ని పాళ్ళుంది. "సోషలిజం" యెన్ని పాళ్ళుంది అనేది రేపు వచ్చే భువనేశ్వర్ కాంగ్రెసు మహాసభలలో కొంతవరకు తేల్చుకుంటారు.

ఇప్పుడు దేశంలో, ముఖ్యంగా కాంగ్రెసులో "లెఫ్టిస్టు" "రైటిస్టు"ల మధ్య జరిగే రాజకీయం మరింత గందరగోళంగా వుంది.

కృష్ణమీనన్, ఒరిస్సా మాజీ ముఖ్యమంత్రి పట్నాయక్ ప్రభృతుల నాయకత్వంలో "లెఫ్టిస్టు" లంతా కలిసి కాంగ్రెసు రథాన్ని యెడమవైపు లాక్కుని వెళ్ళాలని హడావిడి పడుతుంటే, మొరార్జీదేశాయి, పాటిల్ ఆదిగాగల "రైటిస్టు" నాయకులు దానికి కుడివైపునుంచి గాలం వేసి కూర్చున్నారు. అసలు ఆ రథం ఇప్పుడు కదలటలేదు. ఈ గందరగోళంలో, దాని మీద యెక్కిన నెహ్రూగారికి మహా చికాకుగా వుంది.

ఆఫ్రికాకు ఉహురూ

డిశంబరు పన్నెండవ తేదీ ఆఫ్రికా చరిత్రలో మరుపురాని దినం. తూర్పు ఆఫ్రికాలోని కీన్యా ఆనాడు స్వతంత్ర దేశంగా ఆవిర్భవించింది. ఆఫ్రికా ఖండంలో పరాయి పాలననుండి విముక్తి పొందిన 34 వ దేశం కీన్యా.


1925 లో ఆఫ్రికా విముక్తికోసం మొదటి నినాదం, ఆ దేశంలోనే ప్రతిధ్వనించింది. దానిని వినిపించిన శ్రీ జోమో కెన్యటా స్వతంత్ర కీన్యా మొదటి ప్రధాని. నలభై సుదీర్ఘ సంవత్సరాల పోరాటం అనంతరం ఆ దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించింది.

ఎన్నో తెగలు ఆచారాలు కలిగిన 44 ఆదిమ జాతులతోకూడిన దేశం కీన్యా. 2,25,000 చదరపు మైళ్ళ విస్తీర్ణం. 86,00,000 మంది జనాభా. వీరిలో రెండు లక్షలమంది భారతీయులుకూడా వున్నారు. కీన్యాలో ఆదినుంచీ వుంటున్న వారితోపాటు భారతీయులు కూడా. సమాన పౌరస్వత్వం ఇవ్వటానికి నవకీన్యా ప్రధాని నిర్ణయించారు.

ఆంధ్ర రాజకీయాలు

1964 ప్రవేశిస్తూనే రాష్ట్రరాజకీయాలలో ఒకపెద్ద సంరంభం బయలుదేరుతుందా అని పిస్తోంది. ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డి తన బాధ్యతల నన్నిటినీ (ఒక్క జి.ఎ.డి తప్ప) మిగిలిన మంత్రులకు డిశంబరులోనే అప్పజెప్పివేశారు. దానికితోడు, శాసనసభా నాయకత్వంకూడా శ్రీ బ్రహ్మానందరెడ్డికి అప్పజెప్పివేశారు.

జ్యోతి



రాష్ట్రం మొత్తం పర్యటనచేసి, ప్రజలను సన్నిహితులను చేసుకుంటారుట. సమాచార మంత్రిత్వ శాఖనుకూడా శ్రీ బ్రహ్మానందరెడ్డికే అప్పజెప్పి, ప్రజలకు పత్రికలకు ప్రభుత్వంపట్ల పూర్తి సదభిప్రాయం కలుగజెయ్యాలని శ్రీ సంజీవరెడ్డి ఆలోచనలు.

మరో విషయం. 1964 ప్రారంభంలో రాష్ట్రవ్యాప్తంగా గ్రామ గ్రామానా ఎన్నికల సంరంభం జరుగుతుంది. ముఖ్యంగా ప్రభుత్వాన్ని పాలించే పక్షానికి అందులో ఆ పక్షంలోని ఆ ప్రత్యేక వర్గానికి పంచాయితీలలో ప్రాబల్యం చాలా అవసరం. సాధారణ ఎన్నికలకు జరిగినంత సంరంభం జరగవచ్చునని వినికిడి.

మరో విషయం యేమిటంటే ఒకవేళ ఏ పరిస్థితిలోనైనా ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డి మరింత ముఖ్యపదవికి రాష్ట్రం వదలి వెళ్ళవలసివస్తే, రాష్ట్ర అజమాయిషీని, వ్యవహారాలను తన చేతులలోనుంచి జారవదులుకోవటం ఆయనకు ఇష్టంలేదు. అందుకే శ్రీ బ్రహ్మానందరెడ్డిగారికి ఇప్పుడీ యువరాజ్య పట్టాభిషేకం ఆయనచేస్తున్నారు అని కొందరు రాజకీయ వ్యాఖ్యాతల అభిప్రాయం.


ఎవరు ఏమనుకున్నప్పటికీ చరిత్రచెప్పే విషయాలు శ్రీ సంజీవరెడ్డిగారు జాగ్రత్తగా గుర్తుంచుకుంటారు. ఆరోజుల్లో అఖిలభారత కాంగ్రెసు అధ్యక్షపదవికోసం తనకుపిలుపు వచ్చినప్పుడు తన స్థానంలో శ్రీ బ్రహ్మానంద రెడ్డిని కూర్చోపెట్టండని నోరు విడిచి అడిగినా, తన వారనుకున్నవారే ఆనాడు ఖాతరు చెయ్యలేదనే విషయం ఆయన యెప్పుడూ మరచిపోరు.

అంతేకాకుండా "తనఇల్లు" తనరాష్ట్రం తాను సరిదిద్దుకోవటం ప్రధానం. ముఖ్యమంత్రి పదవులలో లేకపోయినా తనమిత్రులు శ్రీ పట్నాయక్, శ్రీ బక్షి గులాం మహ్మద్, యెంత "పకడ్ బంద్"గా వ్యవహారం జరుపుతున్నారో కూడా శ్రీ సంజీవరెడ్డికి తెలుసు.

అందుకే ఈ ముందు జాగ్రత్తలు, తర్ఫీదులు, యేర్పాట్లు.

— అనంతం

కార్ట్యూనులు



ప్రధాని పండిట్ జవహరు
లాల్ నెహ్రూ లోకానికి వెలుతురు
ఐరాసకి సూపర్ సెక్రటరీ జనరలు
ఏ కూటంలోనూ ఆయన కలవరు
దేవుణ్ణయినా గుడ్డిగా కొలవరు

— శ్రీ.శ్రీ



కామరాజ్ అవర్గుళు
కాంగ్రెసు పార్టీకి గవర్నరు
తమిళనాటికి తలైవరు
ప్రధాని పండిట్ జవహరు
లాల్ నెహ్రూ తలపుల బిలువలకి బేరరు


— శ్రీ.శ్రీ

పంచదార తీపి సరుకు
దాని కొరకు చెరకు దొరకు
వరకు పెంచు హెచ్చు ధరకు

బెల్లము నిరుపేద కొరకు
దాని కొరకు చెరకు దొరకు
వరకు పెంచు హెచ్చు ధరకు

పంట చెరకు వంట చెరకు
లాభగ్గున మండు వరకు
పెంచు పెంచు హెచ్చు ధరకు
ధరలు పెరిగి పెరిగి పెరిగి
సామాన్యుడి నడ్డి విరుగు
వరకు పెంచు హెచ్చు ధరకు





అక్కినేని నాగేశ్వరావు
ఎక్కలేని ఎత్తులెన్నో
సాగలేని దూరాలెన్నో,
భారాలెన్నో
ఐనా ఈనాడు
తెలుగు సినిమాకు
నటను చేర్చుదలచేరేవు
నేటికీ నేటికీ
నూరామడనిపించే
హైదరాబాదు

మానినీ మానసం

ఎస్.ఆర్. నంది

నలుగురు స్నేహితుల్ని పోగేసుకొని కిళ్ళీ కొట్టు దగ్గర పిప్పరమ్మెంట్లు చపరిస్తూ చర్చలుసాగిస్తున్న రవణ, ఎదురుగా రిక్షాలో వస్తున్న రింగులమ్మాయిని చూసి — అలానే కళ్ళప్పగించి చూస్తూ వుండిపోయాడు!





అదేసమయంలో కాకతాళీయంగా అటువేపు తిరిగి చూసిన కౌసల్య రమణిచ్చిన పోజుకి ఆశ్చర్యపోతూ 'ఇతనికి ఆడాళ్ళని తేరిపారి చూట్టం కూడా తెలుసా?' అనుకుంది. అనుకుంటూనే నవ్వుకుంది. నవ్వుకొని వూరుకోవాల్సిన నవలామణి మస్తిష్కంలో రిక్షాచక్రభ్రమణంలా భావభ్రమణం ఉద్వేగంతో తారాస్థాయి నందుకుంది.

కిళ్ళీకొట్టుదగ్గర వాళ్ళంతా కలసికట్టుగా తన గురించి ఏమనుకుంటున్నారో- రిక్షా దిగివెళ్ళి- వినాలనిపించింది.

'మీ మరదల్రోయ్' అనొకడూ

'కాబోయే భార్యాలలామ' అనిమరొకడూ జోక్స్ విసుర్తారు!

ఇడియట్స్! రమణ పళ్ళికిలిస్తాడు!.... ఎంతయినా పల్లెఘటం.... ఈనాడు పట్నాలకొచ్చి కాలేజీ చదువులు వెలగబెడ్తేమటుకు మేనర్స్. కల్చర్ వంట బట్టేస్తాయా? పుట్టుకతో రావాలిగాని!

'కుడేపికి తిప్పంటారేంటమ్మగారూ?'

రిక్షావాడి కేకకి ఉలిక్కిపడింది.

'ఉఁ'

పోలీస్‌స్టేషన్ పక్క- వీధిలోకి రిక్షా మళ్ళింది....

స్నానానంతరం నిలువుటద్దం ముందు కూచుని జడ అల్లుకుంటూంటే మళ్ళా రమణ దృష్టే జ్ఞాపకమొచ్చింది!

అబ్బ! ఆడాళ్ళని చూడగానే ఈ మగ మహారాజులకి అంత వికృతదృష్టి ఎలా వచ్చేస్తుందో మరి! వళ్ళంతా కళ్ళుచేసుకొని మరీ శల్యపరీక్షలారంభిస్తారు!

అసలు రవణ తన్నెందుకలా చూశాడు? ఆశ్చర్యమా? పలకరింపా? సాంకేతికార్థాలేమైనా ప్రదర్శిస్తున్నాడా?— 'రానియ్! ఈవాళ అడిగేస్తా' ననుకుంది.

అనుకుంటూండగానే అరిగిన చెప్పుల చప్పుడు వినిపించింది. కౌసల్య గుండెల్లో రాయిపడ్డంత పనైంది. ఆ చప్పుళ్లో ఏవో చిత్రాతి చిత్రమైన గణగణ వుందని ఆమె అనుమానం. కాకపోతే, ఇంతవరకూ నిల దీసి అడగాలనుకున్న ఆవిడకు, తీరాఅతను ఎదురయ్యేసరికి శరీరంలోని రక్తమంతా పాదాల్లోకి పోయి వళ్ళంతా చెమటలు పట్టడమేమిటి?

రవణ ఆ చిరిగిపోయిన చెప్పుల్ని ఈడ్చుకొంటూ ఆమె గది దాటాడు. అలా ప్రొద్దుటా, సాయంకాలం, రాత్రీ — తన చిత్తం వచ్చినపుడల్లా ఆ గది ముందరగానే వెళుతూవుంటాడు; కాని ఎప్పుడూ ఆ గది వేపుగానీ, లోపలకుగానీ చూడడు. ఎందుకో, లోపల ఏముందో అని గానీ, తను ఏం చేస్తున్నానో అన్న ధ్యాసగానీ అతనికి కలగదా? స్వార్థమా ఈ మనిషికి-అనుకునేది.

కాని ఈవాళ తప్పక చూస్తాడనుకుంది. అదే సమయానికి తనూ యథాలాపంగా చూసినట్టు కనురెప్పలెత్తి చూడాలనుకుంది. కాని తను ఆశించినట్టు జరక్కపోయేసరికి తల నరికినట్టే బాధపడింది! ఎంత నిర్లక్ష్యం?

మర్నాడు సాయంకాలంకూడా తను అదే దారిన రిక్షామీద వచ్చింది. అదే కిళ్ళీకొట్టు దగ్గర రవణ మిత్రబృందంతో సహా పిప్పర్మెంట్లు చప్పరిస్తున్నాడు. దగ్గరపడ్డ రిక్షా వేపు సన్నట్లానే కాకతాళీయంగా చూసి ఆశ్చర్యాన్నభినయించాడు.

ఒకనాడు రవణ వాళ్ళు కనిపించలేదు. దూరంనించి కిళ్ళీకొట్టుని రెప్ప వాల్చకుండా చూస్తున్న కౌసల్య దృష్టి చుట్టూ ఇరవై గజాల వ్యాసాన్నీ; టూ-పై-ఆర్ పరిధినీ; పై-ఆర్-స్క్వేర్ వైశాల్యాన్నీ గబగబా వెదికేసింది.

అప్రయత్నంగా నోట్లోనుంచి మాటలు పొడిగా, కంగారుగా రాలాయి:

'కాస్త నిమ్మళంగా పోనియ్'

వన్ఎమ్.పి.హెచ్‌కి తగ్గింది రిక్షావేగం.

కౌసల్య ఆతృత తగ్గలేదు. వీళ్ళంతా ఎక్కడికి పోయారు? మకాం మార్చేసుంటారా? 'ఫూల్స్' అని శపించుకుంది .... ఎందుకలా శపించుకుందో తనకే తెలీదు.

'ఇహ వేగంగా పోనియ్' అంది.

రిక్షా రెగ్యులేటర్ 'ఎత్తాడు'. డీలక్స్‌తో పందెం వేసినట్టు పోతోంది.

కౌసల్య ఉద్వేగం ఉద్విగ్నమయింది. 'ఇడియట్స్' అనుకుంది మళ్ళా. ఆమెకు యేడుపొచ్చినంత పనైంది. రోజూ తననెంతో ఆప్యాయంగా పలకరించేట్టు నిలబడే మిత్రబృందం ఈవేళ తనకి కావాలనే ద్రోహం చేశారనిపించింది.

ఇంటికి వెళ్ళి స్నానం ముగించి డాబా మీద కూచున్నాకకూడా భావోద్వేగం చల్లారలేదు. గోదావరి మీదినించి పరుగుల్తో వస్తున్న పవన కుమారుల కోమలగీతాలు కూడా ఆమెను ఓదార్చలేకపోయాయి.

భోజనాలయ్యాక తన గదిలోకి వెళ్ళి లైటు వేసింది.

ఈవాళ చింకిచెప్పుల చప్పుడు వినిపించినట్టులేదు. రవణ యింకా యింటికి తిరిగి

రాలేదా?.... అనుమానం కలగడం తరవాయి, గప్పునలేచి వంటింటి వేపువెళ్ళింది.

వంటిల్లు పక్కనే రవణ గది గొళ్ళెం పెట్టి వుంది. తీసుకొని లోపలికి వెళ్ళాలనిపించింది.

గుండె భారంగా మారిపోయింది ఈ భావంతో. ఛీ! పరాయివాడి గదిలోకి తను వెళ్ళడమేవిటి?

రవణ పరాయివాడా? స్వయాన తన మేనత్తకొడుకు.... నాన్న దయాదాక్షిణ్యాల మీద ఈ పట్నం చదువులు వెలగబెడుతున్న బికారి; అతని ప్రతి వస్తువుమీద తనకు హక్కుంది.

భుస్సున తలుపు తెరచుకొని లోపలికి వెళ్ళింది. గదంతా చీకటి. స్విచ్‌కోసం కాసేపు కుస్తీపట్టి 'ఆన్' చేసింది.

పదిహేనువాట్ల బల్బ్ ఆవులిస్తూ లేచి గదిని బద్ధకంగా పలకరించింది. ఆ మసక వెల్తుర్లో గది గోడలు భూతాల్లా అగుపించాయి. వంటిల్లు పక్కనే వుందేమో, పొగంతా గదిని కావలించుకొని నిద్రపోతోంది మత్తుగా. ఓ మూలగా ఒక చాపా, ఒక బీసీనాటి తలగడా, దుప్పటీ; కిటికీ ఊచకూ గోడకూ తాడుకట్టి అందుమీద తోరణాల్లా వేలాడే రెండు మూడు పాత గుడ్డలూ, వో మూలగా పుస్తకాలదొంతరా, ఇక్ష్వాకులకాలంనాటి చిన్న ట్రంకుపెట్టీ— రామ రామ యిలాంటి రాతియుగంనాటి 'నాగరికత' జీవితాన్ని ఈ మనిషెలా గడుపుతున్నాడో!

అంతలోనే రవణమీద కౌసల్యకు ఎక్కళ్ళేని జాలి పుట్టుకొచ్చింది. 'పాపం!' అనుకుంది. స్వయాన చెల్లెలికొడుకైనా నాన్నారు అతనికి తనతో సమానంగావుండే గదిని యివ్వకపోతే రవణేంచేయగలడు? పేరసైట్ పాపం! తనగదిలో డన్లప్పిల్లో పరుపులూ, డ్రెస్సింగ్ టేబిల్, గాడ్రెజ్ బీరువాలూ, సీలింగ్ ఫానూ—

తలుపుదగ్గర చప్పుడై వెనక్కి తిరిగి చూసింది. రవణ! వళ్లు చచ్చిపోయినట్టయింది. సంజాయిషీకి స్వరతంత్రులు అస్పష్టధ్వనుల్ని వుచ్చరించబోయేలోపునే. రవణ తలొంచుకొని లోపలికి వెళ్ళిపోయాడు.

చొక్కా బనియను విప్పుకున్నాడు. అప్పటిగానీ స్పృహ రాలేదు. భగవంతుడా, కాస్సేపుంటే ఫాంటూ అండర్వేర్ కూడా తన యెదురుగానే ఒలిచేసుకునేట్టున్నాడు! తడబడే అడుగులతో తనగదిలోకి వెళ్ళిపోయింది.

మర్నాడు సాయంకాలం కాలేజీ నుంచి బయటకు వస్తూంటే రవణ తారసపడ్డాడు. పక్కనేవున్న శారద కౌసల్యను మోచేత్తో పొడుస్తూ,

'మీ బావేవ్' అంది.

శారద యిందులో క్రొత్తగా డిస్కవర్ చేసిందేమీ లేదనుకుంది.

అంతలో ప్రసూన అందుకుంది—

'ఏవిటే ఆ నీరుకావి గుడ్డలూ, బీసీ చెప్పులూ వేసుకునే ఆ అందగాడే నేవిటే నీ కాబోయే రాకుమారుడు?'

చుట్టూవున్నవాళ్ళంతా లేవిడీ చేస్తున్నట్టు ఫక్కినవ్వారు. కౌసల్య తలనరికినట్లు బాధపడింది! ఎక్కళ్ళేని పౌరుషం ముంచుకొచ్చింది. ఏహ్యంతో ఒకసారి రవణ

వేపు చూసింది. ఛీ! సిగ్గులేని మనిషి – అతనికి సిగ్గూ లజ్జా లేకపోతే పోయె. అతనితోపాటు తననికూడా ఆ సీరుకావి గుడ్డల్తో హీనపరుస్తున్నాడు!

ఇంటికి రాగానే కురుక్షేత్రం తయారయింది. ఈ విషయమంతా పూసగుచ్చినట్టు కన్నీళ్ళతో తండ్రికి ఫిర్యాదు చేసింది. శేషాద్రిగారు రవణ రాగానే నరసింహావతారం ఎత్తారు.

'కాలేజీలో చదువులు వెలగబెడుతున్నావ్! ఆ మాత్రం డ్రస్‌మీద శ్రద్ధ వుండక్లర్లేదటయ్యా? కంపుబట్టల్తో క్లాస్‌రూమ్‌లో కూచునేందుకు సిగ్గన్నా వెయ్యదా? బియ్యేలోకి వొచ్చికూడా శుచి శుభ్రతలమీద శ్రద్ధలేకపోతే యిహ నాచదువులు చదివెందుకు?–'

ఈ నిందా వుపన్యాసాన్నంతనీ తలొంచు వినేసి 'సరే. ఇహ లోపలికి వెళ్ళి ఆ పాకీ బట్టలు విడిచేసెయ్' అన్న మంగళ వాక్యంతో. లోపలకు చెప్పుల్ని ఈడ్చుకొంటూ తన గుహలోకి వెళ్ళిపోయాడు రవణ.

ఆ చెప్పుల చప్పుడు కౌసల్య హృదిలో గణగణలాడింది. కడుపులో మరింత వికారం పుట్టుకొచ్చింది.

తన గదిలోకిపోయి ఆ రాత్రి తొమ్మిదింబావు వరకూ ఏడుస్తూనే కూచుంది. ఎవరిమీదో కసి. జాలి; కోపం. ప్రేమ చిత్రాతిచిత్రంగా పెనవేసుకొని మదిలో మెదలనారంభించాయి. రవణ తన పాతగుడ్డల ఎగ్జిబిషన్‌తో తనని కావాలనే ఏడిపిస్తున్నాడనిపించింది. అలాంటి మనిషిని తను తెలిసి ఎలా క్షమించగలదు?


మనస్సులోని ఏడుపు నంతనీ ఏడ్చేసి. గుండె తేలికపడ్డాక హృదయంలో తార్కిక జ్ఞానం వుదయించ నారంభించింది.

పాపం! చినిగిన బట్టలూ. సీరుకావి గుడ్డలూ వేసుకున్నంతలో రవణ తనపట్ల అమానుషంగా ప్రవర్తించినట్టా లెఖ్ఖ? ఎదుటవాళ్ళ పేదరికాన్నో. బలహీనతనో. లోపాన్నో ఆసరాగా తీసుకొని అవహేళనలు చేస్తూ తమ అల్పత్వాన్ని ప్రదర్శించుకుంటే అందుకు ఆ వ్యక్తినెందుకు శిక్షించాలి!

రవణ మాసిన మాసికల గుడ్డలు వేసుకోవడాన్ని తను ఏనాడూ అంతగా పట్టించుకోలేదు. కాని ఈవేళ వీళ్ళంతా కావాలని ఏడిపించేసరికి రోజూ చూసే ఆ మురికిబట్టలే ఆమెకు ఆగ్రహావేశాలను కలిగించాయి. రవణమీద తనకు కలిగిన కోపాన్ని. కసినీ తీర్చుకోవాలని కాదు నాన్నారితో ఫిర్యాదు చేయడం. స్నేహితురాండ్ర అపహాస్యాల నుంచి తనను తాను ఓదార్చుకోవాలనే!

కాని చిత్రం! నాన్నారు రవణమీద అంత యుద్ధం చేశారేగాని. సరే. రేపు బజారుకి పోయి కొత్తగుడ్డలు కొనుక్కోమన్నా అన్లేదేం? అలా అన్నంతలో తను చేతిసాయం చేయాల్సి వొస్తుందేమోనన్న భయమేమో ఆయనకు!

అత్తయ్యను చిన్నప్పుడెప్పుడోచూసింది. ఒకానొకప్పుడు బాగా బతికినవాళ్ళేనట. కాని అంతా ఓ కలలా కరిగిపోయి చివరికి 'చిప్పా - జోలీ' స్థితికొచ్చేసి నాలుగు వేళ్ళూ నోట్లోకి పోవడమే ఓ బ్రహ్మప్రళయంలా రోజులు గడుపుకొస్తున్నారట!



రవణ అప్పటికే స్కూల్ ఫైనల్ ప్యాసయి ఆ ఊళ్ళోనే ఓ జమీందార్లాంటి పెదకాపుదగ్గర గుమాస్తాగా చేరి నాలుగు రాళ్ళు తెచ్చుకునేవాడట! అంతల్లో నాన్నారు ఏదో పనిమీద ఆ వూరెళ్ళడం. రవణ స్కూల్‌ఫైనల్ మార్కులు చూసి. అతన్నేదో వుద్ధరించేసేట్టు కాలేజీ చదువులు చదివిస్తానని యిక్కడకు తీసుకురావడం జరిగింది.

తీసుకురావడం వరకే తన బాధ్యతగా యెంచుకున్నారేమోగాని. తర్వాత రవణ నిత్యావసరాలకు ఏవిధంగానూ. ఎప్పుడూ తనకు తెలిసినంతవరకూ - సహాయం చెయ్యలేదు....

....తలచుకొనే కొద్దీ రవణమీద జాలే హెచ్చుకాజొచ్చింది,

మర్నాడు. బ్యాంకులో తన ఎకౌంట్‌లోనుంచి అరవై రూపాయలు తీసుకొని యింటికొచ్చింది. సాయంకాలం ఈపైకం ఎలా అయినా రవణ కందించాలనుకుంది. అది అందించేప్పుడు నాలుగు మాటలని మరీ యివ్వాలనుకుంది.

తీరా అతను ఏదో పనిమీద డాబామీదికొచ్చినప్పుడు, ఒంటరిగా వుండికూడా. అతన్ని పలకరించలేకపోయింది. పని ముగించుకొని అతను కిందికి దిగిపోతూండగా వూపిరంతా బిగబెట్టుకొని పిలచింది!

'....రవణా....'

రవణ ఆగాడు.

తర్వాత ఏం మాటాడాలో కౌసల్యకు అంతుచిక్కలేదు. అతను ప్రశ్నార్థంగా చూశాడు. ఏదో ఒకటి మాటాడాలి.

మెల్లగా తడబడే అడుగుల్తో అతన్ని సమీపించింది. లకచీవాట్లు పెట్టి పైకం యివ్వాలనుకున్న వేల అబలైపోయి చేతి లోని కవర్ని అతనికందించింది.

ఏవిటన్నట్టు చూశాడు రవణ.

'డబ్బు.... నీ బట్టలకూ....'

వాక్యం పూర్తికాకుండానే, కవరుజేబులో కుక్కుకొని కిందికి దిగిపోయాడు.

కౌసల్యకు మనస్సు చివుక్కుమంది. కనీసం 'థ్యాంక్స్' అనన్నా అనతేదేం? సిగ్గా? నిర్లక్ష్యమా? అసలా డబ్బు నిచ్చింది ఎవరనన్నా అనలేదేం? ఇదేం మనిషి?

వారం దినాలక్కూడా రవణ కొత్త బట్టలు వేసుకున్న జాడగానీ కొత్తబట్టలు కొనుక్కున్న ఛాయలుగానీ కనిపించలేదు. రోజూ అడగా లనుకుంటూనే వాయిదా వేసేసేది.

ఒకరోజున కాలేజీకి వెడుతుండగా పోస్ట్‌మాన్ కార్డొకటి అందించిపోయాడు. రవణ అడ్రసుంది. : సభ్యతకు వ్యతిరేకం అనుకుంటూనే కార్డంతా ఒక్కదూకులో చదివేసింది; రవణ వాళ్ళమ్మ వ్రాసింది: అతను పంపిన అరవైరూపాయలు అందినట్టు. కొడుకుని దీవిస్తూ వ్రాసింది.

కౌసల్యకు అరికాలిమంట నెత్తికెక్కింది. బట్టలు కొనుక్కోమని డబ్బుయిస్తే. ఈ మనిషి ధర్మాలు చేస్తున్నాడా? కాస్తయినా బుద్ధీ, జ్ఞానం వున్నవాడైతే పరాయివాళ్ళు యిచ్చిన డబ్బుని యితరులకు పంపించుకుంటాడా? ఛీఛీ! .... ఈవాళ ఏమైనాసరే చీవాట్లు వేయాలనుకుంది.

సాయంకాలం కాలేజీనుంచి త్వరగా వచ్చేసి వరండాలో కూచుంది. ఈ సారి అతని మీద దాక్షిణ్యం చూపదలుచుకోలేదు. ఇంట్లోకి వచ్చేవాణ్ణి వస్తున్నట్టే ఛడామడా అనేస్తే, ఆ కేకలకు నాన్నారూ, అమ్మా బయటకు రావడం, విషయమంతా వాళ్ళకు చెప్పి వాళ్ళచేతకూడా నాలుగు మాటలనిపించి అతనికి బుద్ధొచ్చేట్టు చెయ్యాలి.

రవణ సరిగ్గా ఆరు గంటలకు ఇంటికి చేరాడు. కుంటుకుంటూ యింట్లోకివచ్చాడు.

అంతలోనే శేషాద్రిగారు గదిలోంచి బయటకు వస్తూ కుంటుతున్న మేనల్లుణ్ణి చూసి _

'అదేం?' అన్నారు.

'మేకు గుచ్చుకుంది.'

'చెప్పులు వేసుకెళ్ళలేదా?'

'చిరిగిపోయాయి'_అని క్లుప్తంగా అనేసి తన గుహలోకి పోబోయాడు.

కౌసల్యకు వళ్ళు మండుకొచ్చింది:

'కొత్తచెప్పులు కొనుక్కుంటే ఈ తిప్పలుండేవి కాదుగా....'

రవణ వో క్షణం ఆగి మళ్ళా ముందుకు సాగిపోయాడు.

తెల్లవారేసరికి రవణ కాలు యింతలావున వాచిపోయింది. కాలుతీసి కాలు తియ్యడమే వో బ్రహ్మాండంలా కాలేజీకి కుంటుకుంటూ బయలుదేరాడు.

సగం దార్లో రిక్షాలో ఎదురైన కౌసల్య ఈ కుంటివాణ్ణి చూచి మరింత అసహ్యించుకొంది. మంచిపనైందని మనసులో శపించుకొని _ శపించుకున్నందుకు ఆ తర్వాత బాధపడింది.

జ్యోతి

సాయంకాలమయేసరికి రవణకి కాలు వాపుతోబాటు టెంపరేచర్ కూడా వచ్చింది. ఈ తెచ్చిపెట్టుకున్న తద్దినానికి శేషాద్రిగారు నాలుగైదుసార్లు దెప్పిపొడిచారు.

దెప్పినంతలో జ్వరాలు తగ్గి పుండు మాస్తుందా అంది కౌసల్య. మనస్సులోని సానుభూతి నంతనీ పైకి కనబరిస్తే యింట్లో వాళ్ళందరూ తనని చిత్రంగా చూడొచ్చు ననే భయం కౌసల్యకు లేకపోలేదు. ఆ నాలుగైదు దినాలూ కాలేజీకి వెళ్ళిందేగాని మనస్సుమాత్రం రవణ గదిలోనే విడిచి పెట్టేసేది. ఇంటికి వచ్చీరాగానే చిన్న చెల్లాయిని—

'రవణ కెలా వుందే యిప్పుడు?' అని అడిగేది ఆతృతగా - సమాధానం అననుకూలంగా రాగూడదని వేయి దేవుళ్ళకు మొక్కుకుంటూనే.

వారం దినాలకు ఇరవైలక్షల పెన్సిలిన్ తోనూ, పాతిక రూపాయల ఖర్చుతోనూ జ్వరం పూర్తిగా తగ్గింది. గాయంమాత్రం కొద్దిగా వుంది.

ఆ వాళ సాయంకాలం వరండాలో కూచుని పుస్తకం చదువుకుంటున్న రవణని చూడగానే కౌసల్యకు ప్రాణంలేని వచ్చినట్టనిపించింది. 'హమ్మయ్య' అనుకుంది.

సరిగ్గా అదే సమయంలో రవణ తలెత్తి చూడటం, కౌసల్య హృదయపూర్వకంగా చిరునవ్వు నవ్వడం, రవణ కుర్చీలోంచి లేచిపోయి మెల్లగా తన గుహలోకిపోవడం ఒక్క క్షణంలో జరిగాయి.

కౌసల్య ఆనందం, ఆతృత, ఉల్లాసం - చప్పున చప్పబడిపోయి భూమిలోకి కూరుకుపోయినట్టు బాధపడింది.

తనని చూస్తే చాలు, రవణ కెందుకింత నిర్లక్ష్యభావం? తనేం చేసింది? ఎప్పటికప్పుడు అతని బాగోగుల గురించి ఆరాట పడే తన నెందుకిలా బాధిస్తాడు? అంత పెడసరమా మనిషికి?

గదిలోకిపోయి రెండు లావుల ఉత్తరం రాసింది. రాసినదాన్ని రెండు మూడు సార్లు పునర్విమర్శతో చూసుకుంది.

ఉత్తరాన్ని మడిచి పెద్ద కవర్లో పెట్టి రవణ గుహవేపు వెళ్ళింది.

చాపమీద పడుకొనివున్నాడు. ద్వారం దగ్గర చప్పుడువిని తలెత్తిచూశాడు. కౌసల్య చేతిలోని కవర్ని వొత్తిపారి అతనిమీదికి గిరవాటేసి, గబగబ అడుగులేసుకొంటూ వెళ్ళిపోయింది.

నీలిదీపం వెలిగించి గదిలో ఈజీఛైర్‌లో పడుకుంది. నిద్ర రావటంలేదు. ఏమైనా ఈవాళ తెల్లార్లూ మెలకువగా వుండాలనుకుంది.

ఉత్తరాన్ని చదువుకున్నాక రవణకు సిగ్గూ జ్ఞానదృష్టి అలవడుతుందని, దాంతో అతను తారెత్తిపోయి తనముందు మోకరిల్లి క్షమాభిక్ష వేడుకుంటాడని భావించింది. ఆ భావనతోనే కళ్ళు మూతలు పడిపోతున్నా బలవంతంగా రెప్పలు తెరచుకొని రెండింటివరకూ మెలకువగా వుంది. ఎక్కడే మూల చిన్న చప్పుడు వినిపించినా రవణే

● ఒక రామకృష్ణగారు వూరికి వెళుతూవుండగా, ఆయనభార్యను పొరుగింటావిడ అడిగింది. "ఐతే మరి మీవారొచ్చేదాకా మీరేం చేస్తారు ఒక్కరూ?"

"ఏం చేస్తాను - వారొచ్చేదాకా రామా కృష్ణా అంటూ కూచుంటాను"

వస్తున్నట్టూ. ఎక్కడే అలికిడి తగిలినా రవణే క్షమాపణ వేడుకుంటున్నట్టూ వూహించుకొనేది .... రెండింటివరకూ ఎలకల్నీ-పిల్లినీ తిట్టుకొంటూ — తర్వాత యెలా నిద్రపోయిందో తనకే తెలీదు.

నిద్రలో చంపుకు తిన్నాడు రవణ. క్షమించమంటూ కాళ్ళు పట్టుకుంటే సత్యభామలా అతని తలమీద తన్నినట్టూ, తన కాళ్ళ కెక్కడ నొప్పితగిలిందో అన్నట్టు కాళ్ళు రవణ పట్టడమూ, అయినప్పటికీ తాను క్షమించకపోవడం... తెల్లవారే సమయానికి ఈ కలాపం క్లయిమాక్స్‌కి వచ్చి- రవణ విసుగెత్తిపోయి తనని బలంగా కావలించుకొని ముద్దుపెట్టుకున్నట్టూ.

కంగారుపడి లేచింది. లేచిన అయిదు నిమిషాలవరకూ- ఆ స్వాప్నిక పరిష్వంగం తనలో కలిగించిన అనుభూతిని నెమరువేసుకుంటూ స్తబ్ధంగా వుండిపోయింది.

బద్ధకంగా వొళ్ళు విరుచుకొని లేవబోయేసరికి కీళ్ళనుంచీ, కాళ్ళనుంచీ నొప్పులు మొదలయ్యాయి. కళ్లమంటలు; కడుపులో తిప్పడం; వాంతి అయ్యేట్టు ముందుకుతూలి తమాయించుకుంది.

రమణ కాని తను నిద్రపోయాక యిటువేపు వచ్చి చూశాడేమో? ఉత్తరం లాంటిదేదయినా సమాధానంగా గాని వొదిలిపెట్టి వెళ్ళాడేమో! గుండెలమీద మొట్టమొదటిసారిగా వెదికి చూసుకొంది. అలా వెతుక్కుంటూనే సిగ్గుపడింది; తన పిచ్చిగాని, ఉత్తరాన్ని తన గుండెలమీద పెట్టగలిగేంత ధైర్యముందీ రవణకు?

రవణను తనుగాని ప్రేమిస్తున్నదేమో అనిపించింది ఎందుకో! లక్ష అగ్నిపర్వతాలు బద్దలైనంత కల్లోలం జరిగింది మనస్సులో....ఆ సంక్షోభం నుంచి తప్పించుకునేందుకు ఆవాళ మేటినీకి ప్రసూన, శకుంతలతో కలసి ఏదో పిక్చరుకి వెళ్ళింది.

చిత్రం చూస్తున్నంతసేపూ తలనొప్పి బాధనూ: కౌసల్య చీకాకుని కనిపెట్టి—

'అలా వున్నావేమిటే' అనడిగింది శకుంతల

ఏం లేదని చెప్పేలోపునే ప్రసూన అందుకుంది 'విరహతాపమేమో!'

'ఎవరోయ్ ఆ అభాగ్యచక్రవర్తి!'

'ఉన్నాడుగా అపర పిసినిగొట్టేశ్వరుడు: రమణరావ్—'

కౌసల్యకు చిరాకేసింది. మనుష్యుల్ని గాయపరచడమే వీళ్ళకు ఆనందంలాగుంది! నేరకపోయి వీళ్ళతో కలసి పిక్చరు కొచ్చాననుకుంది!....వాళ్ళ హాస్యాలింకా తారస్థాయికి పోవడంతో యిహ భరించలేక యింటికి పోవాలని సీట్లోనుంచి గప్పున లేవడం ఇంటర్‌వెల్ అయి హాల్లో లైట్లు గప్పున వెలగడం ఒకేసారి జరిగాయి.

శకుంతల కెవ్వున కేకపెట్టింది! 'అదుగోనేవ్ మీ రవణరావ్ కింద పదణాల క్లాసులో వున్నాడు!' అంది బాల్కనీవించి కిందికి చూస్తూ.

చూడగూడదనుకుంటూనే కిందికిచూసింది కౌసల్య. నిజంగానే రవణ! ప్రసూనవూరుకోలేదు.

'అదేమిటే బావగార్ని పదణాల థర్డ్ క్లాసులో కూచోబెట్టేశావ్?'

'డబ్బు లివ్వలేదట్టుంది, పాపం!'

'ఇప్పట్నుంచే కంట్రోల్ చేసేసుకుంటున్నావేమిటే?'

ఇలా సాగిన వెక్కిరింతలు కౌసల్య పిచ్చికేకతో తక్కున ఆగిపోయాయి. ఆశ్చర్యాన్నభినయిస్తున్న స్నేహితురాండ్రను ఆ స్థితిలోనే వొదిలేసి గిర్రున తిరిగిపోయి యింటికి రిక్షా చేయించుకొని వెళ్ళిపోయింది.

వరండాలో కూచుని వున్న తండ్రిని చూడగానే దుఃఖాన్ని ఆపుకోలేకపోయింది. కారణం తెలీని శేషాద్రిగారు ఆమెను వూరడించడానికి శత ప్రయత్నాలు చేసి అసలు విషయాన్ని తెలుసుకున్నాక వుగ్రరూపాన్ని దాల్చాడు.

నిన్న మొన్నటివరకూ కాలు సెప్టిక్కని ఇంత చేతి చమురొదిలించాడు. అప్పుడేసినిమాలకు కుంటి కాలీడ్చుకుంటూ తయారయాడూ!' ముక్కుమీద వేలేసుకున్నంత పని చేశారాయన.

'అక్కడికి మనకేదో గతిలేనట్టు నా ఫ్రెండ్స్ ముందర పదణాలక్లాసులోకూచుని నన్ను నలుగుర్లో నూ సిగ్గుపరచాడు...' అంది కౌసల్య వెక్కి వెక్కి ఏడుస్తూ. చివరకు తన మనసులోని బాధనంతట్నీ వెళ్ళగక్కింది. 'ఇహ ఈ యింట్లో అతనన్నా వుండాలి. నేనన్నా వుండాలి.. నిర్ణయించుకోండి! ఎవరు మీకు ముఖ్యమో' అన్నట్టు తండ్రివేపొక చూపు విసిరింది.

కూతురువేపు ఆశ్చర్యంగా చూశారు శేషాద్రిగారు!

'సరే అతన్ని యింటికిరానీయ్, అడిగి.'

'అడగడాలు, కడగడాలు అనవసరం నాన్నా! ఇప్పటికే అతన్ని చాలవరకు క్షమించగలిగాను.' అంటూ తను రవణకిచ్చిన అరవైరూపాయల విషయం, ఆ డబ్బుని అతను వాళ్ళమ్మకు పంపించుకున్న వైనం వివరంగా చెప్పి అతనిమీద శ్రోతకు ఏహ్యం, కోపం కలిగేట్టు చేయగలిగింది.

రవణ యింటికి చేరుకునేసరికి సరిగ్గా ఏడున్నర అయింది.

'ఎక్కణ్ణుంచి రావడం?' -దాదాపు అరిచినంత పని చేశారు శేషాద్రిగారు.

రవణకు ఈ పొలికేక ఆశ్చర్యాన్ని కలిగించింది. వింతగా మామగారివేపు చూడ మొదలుపెట్టాడు. అతని వెనకాలవున్న కౌసల్యముఖం చూచేసరికి ఏదో చిత్రమే జరిగివుండొచ్చనుకున్నాడు.

'నిన్నే. ఏం మాటాడవ్?'

'పిక్చరు కెళ్ళాను'

'పరీక్ష లెప్పట్నుంచి?'

పరీక్షలకూ పిక్చరుకీ లంకె పెట్టడంతో- కౌసల్యవల్ల ఏదో దుర్బోధ జరిగివుండవచ్చనుకున్నాడు. తను ఫస్ట్ క్లాసులో పాసయేవాడని తెలిసుండి గూడా ఆయనీ ప్రశ్న వేయడంలో అంతరార్థం మరొకటేదో అయివుండొచ్చు.

'నీకు ఈమధ్య చదువులమీదా, పుస్తకాల మీదా ధ్యానవుండటంలేదు. అమాత్రం దానికి వేనకువేలు గుమ్మరిస్తూ నిన్నిలా ఎందుకు చదివించాలో అర్థంకావటం లేదు. ఇహనుంచి నువ్వా చదువులు చదవనూ వద్దు. మా యింట్లో వుండనూ అవసరం లేదు. ఈ పరీక్షేదో అయిపోయాక నీ దారి నువ్వు చూచుకో—'

● ఎయిర్ కండీషన్డ్ ఆఫీసుల్లో పనిచేసేవాళ్ళు "చెమటోడ్చి పని చేస్తున్నాం" అని చెప్పుకోడానికిలేదు!

నెత్తిన పిడుగు పడ్డట్టు సంభ్రమాశ్చర్యాలతో కళ్ళప్పగించి చూస్తూ నిలబడిపోయాడు. ఇంత పెద్ద శిక్ష విధించడానికి తను చేసిన నేరం సినిమాకు వెళ్ళడమే అన్నదాన్ని అతని మనస్సు అంగీకరించడం లేదు.

'ఈపరీక్ష అయిపోయే వరకూ కాదు. తక్షణమే వెళ్ళిపోవాలి!' అని అరచింది కౌసల్య. శేషాద్రి గారు ఆమె వేపు చూశారు.

రవణకు విషయం అర్థమయింది. ప్రోత్సాహం కౌసల్యది; పరికరం శేషాద్రి. 'అవును: వుంటే అతనన్నా వుండాలి; లేదా నన్ను బయటకు పంపించేసెయ్యండి'.

ఇంత కఠోరమైన శపథం పట్టడానికి కౌసల్యకు కారణాలు ఏవైనా కావచ్చు. వాటిని తెలుసుకోవాలనుకోవడం. తర్కించుకోవాలనుకోవడం అవివేకం. నాలుగేళ్ళుగా తన మీద నిష్కారణమైన పంతాలని చూపిస్తూ. కనిపిస్తే చాలు కసురుకునే కౌసల్య చివరికోనాడు ఇలాంటి స్థితిని తెచ్చిపెడుతుందని అతను ముందుగానే వూహించుకున్నాడు. అందుకు సిద్ధంగానే వున్నాడు. కాని ఆ పరిస్థితి యింత చిన్న విషయం మీద ప్రాప్తమవుతుందని వూహించలేకపోయాడు.

ఒక నిట్టూర్పే అంగీకారంగా లోపలికి వెళ్ళబోయాడు.

ఆ నిట్టూర్పుకి కౌసల్య మరింత కసిగా అరచింది :

'ఇప్పుడే తక్షణం యిల్లువిడచి వెళ్ళాలి' అడ్డు చెప్పబోయిన తండ్రిని విదుల్చుకొని —'మీరు మధ్యకు రాకండి—' అని గదిలోకి పోయి పరుపుమీద వాలిపోయింది.

అరగంటలో. రవణ తన 'లగేజీ' నంతటినీ సర్దేసుకున్నవార్తని చిన్నతమ్ముడు మోసుకొచ్చాడు.

మంచం మీదనుంచి చివాల్న లేచి పరుగు నడకల్తో ద్వారం దగ్గరకు వచ్చింది. నిజంగా రవణ వెళ్ళిపోతున్నాడా? అతని గది వేపు చూసింది. అలికిడి లేదు. వెళ్ళిపోయాడేమో! కడుపులోని దుఃఖం మరింత ఉవ్వెత్తుగా వచ్చిపడింది. కాదు! రవణ వెళ్ళిపోకూడదు.... ఈ కురుక్షేత్రానికంతకూ తనే కారణం.... ఇహ ఆలస్యం చేయకూడదు. కళ్ళు తుడుచుకొని రెండడుగులు ముందుకి వేసింది. రమణ గదిలోనుంచి బయటకు వచ్చి డాబామీదికివెళ్లాడు.

ఇదే సమయమనుకొని అతని వెనకాలే గబగబ వెళ్ళింది.

డాబామీద ఎండబెట్టిన తువాలు తీసుకొని రవణ కిందికి దిగబోయాడు. మెట్లమీద ఎదురైన కౌసల్యను చూడగానే అతను ఛప్పున చలించిపోనూలేదు; ఆశ్చర్యపడనూ లేదు. జేబులోనుంచి రెండు కవర్లు తీసి ఆమె దగ్గరగా వచ్చి అందించాడు.

కవర్లు రెండూ కౌసల్య చూసుకుంది. ఒకటి రాత్రి తను అతనికి వ్రాసిన కవరు. రెండోది -

'మీరు నన్ను బట్టలు కొనుక్కోమని యిచ్చిన అరవై రూపాయలు', అన్నాడు. రవణ క్లుప్తంగా.

రాత్రి తను వ్రాసిన కవరు విప్పి చదువుకున్నట్టులేదు—

'అసలు చదువుకోలేదు' అన్నాడు రవణ మెల్లగా 'అందులో ఏమిటి వ్రాసి వుంటుందో నాకు తెలిసినపుడు, తీసి చదువు



కోవడం అనవసర మనిపించింది.' అని వో క్షణమాగి—

'నా స్థితికి జాలిపడి మీరుయిచ్చిన అరవైరూపాయలకు ఆవాళ కృతజ్ఞతను తెలపలేదు. కారణం: ఎప్పుడో వొకప్పుడు యిదేపైకాన్ని తిరిగియివ్వాల్సి వుంటుందని వూహించుకున్నాను.... బహుశః ఈ వూహలో నా తప్పువుంటే నన్ను క్షమించండి—'

కౌసల్య రెండు కళ్ళనిండా అశ్రువులు నిలిచాయి. ఇక ఆపుకోలేని స్థితిలో అవి స్రవంతిలా వక్షస్థలి మీదికి స్రవించాయి.

'నన్ను 'మీ' రని పిలిచి యింకానన్ను యేడిపించకు రవణా—' అంది కౌసల్య—స్వతంత్రుల్ని చుట్టుముట్టిన కన్నీళ్ళని విదిలించుకొంటూ.

ఆమె బేలతనానికి రవణ వేదాంత ధోరణిలో నవ్వుకొని వుండొచ్చు.

'ఏవిధంగా సంబోధించమన్నా నాకు అభ్యంతరం లేదు. ఎంత కాదనుకున్నా కౌసల్య ఎవరని ఎవరన్నా అడిగితే మా అమ్మ అన్నగారి కూతురనుకుంటామేగాని. నన్ను పురుగుని ఛీదరించుకున్నట్టు అసహ్యించుకొనే శ్రీమంతురాలని అనగలనా?'

రవణ చెప్పుతున్నాడని కౌసల్య మరింత కుళ్ళికుళ్ళి ఏడ్చింది.

'నన్ను క్షమించు రవణా'

'ఎందుకు'

'దీనికంతకూ నేనే కారణం'

'ఆ విషయం నాకు తెలుసు.'

'విన్నావా?'

'ఊహించాను.'

కిందికి వెళ్ళిపోబోయాడు. కౌసల్య చప్పున అతనిచేతిని పట్టుకుంది. పట్టుకున్న మనిషి తనవాడన్న భావం అప్పుడే కలిగింది.

అదే పిడికిలిని అతనిబుజాలమీదుగాపోనిచ్చి అతని ముఖంలో ముఖంపెట్టి - క్షమించానన్నవరకూ విడవను అనాలన్న పిరికి పట్టుదల వచ్చింది.

రవణ. తనముంజేతిని 'కావలించుకున్న' కౌసల్య కోమల హస్తాన్ని విమర్శనా పూర్వకంగా చూశాడు. ఈ అబలకు యింత కోపంతోపాటు. అంత బేలతనాన్నికూడా ప్రసాదించిన సృష్టిశక్తిని కసిదీరా శపించుకున్నాడు!

'నువ్వెక్కడ తప్పు చేశావో తెలుసుకోకుండా మరో తప్పు చేయడానికి సాహసిస్తున్నావ్ కౌసల్యా'

ఛప్పున చెయ్యి దించేసుకుంది.

'నన్ను వెళ్ళనీయ్.'

'వీల్లేదు'

'ఆ హక్కు నీకు ఎప్పుడో పోయింది.'

'అది పొందేందుకే క్షమించమంటున్నా రవణా'

'అభిమాన మనేది నాకూకూడా కొద్దిగా వుంది.'

'దాంతోపాటు వివేకం కూడా వుంది నీకు.'

'నీకు లేదా?'

మౌనంగా తలూపింది— చర్చలుతగ్గించే భావంతో.

'అయినప్పుడు నన్ను క్షమించమని అడగడంలో అర్థంలేదు.' అని ముందుకి సాగాడు.

కౌసల్య రెండు చేతుల్లోనూ ముఖం దాచుకుని బోరుమంది. రవణ హృదయంలో వో తృటిపాటి భావసంచలనం బయలుదేరింది. ఇప్పుడు తనామెను క్షమించి ఏమిచెయ్యటం?

ఆగి వెనక్కి వచ్చాడు.

'ఇలా యేడవడం ఎవరో సంస్కారం లేని వాళ్ళు చేయాల్సినవని' అన్నాడు సగం అధికారయుక్తంగా.

'నాకు నిజంగానే సంస్కారం లేదు.' అనుకుంది. అనుకున్న నగ్నసత్యాన్ని పైకి కూడా అనాలనుకుంది. కాని రవణ మాటల్తో ఆమె నిశ్శబ్దమయింది.

'ఒక విషయం దాచకుండా చెబుతావా?'

ఏవిఁటన్నట్టు చూసింది.

'నువ్వు నన్ను ప్రేమించటంలేదుకదూ?'- ప్రశ్నను కావాలనే నెగిటివ్ లో వేశాడు ఆమె రియాక్షన్ని కనిపెట్టాలని.

కౌసల్య చప్పున తలెత్తి చూసింది. సమాధానాన్ని గుండెల్లో మూలమూలలా వెతుక్కోనారంభించింది.

'అమ్మ నా చిన్నతనంలో అంటూండేది: 'శేషాద్రి అన్నయ్య కూతుర్ని వీడికిచ్చి పెళ్ళిచెయ్యా'లని. కాని ఈ శేషాద్రిగారెవరో, ఆయన కూతురెలా వుంటుందో నాకప్పుడు తెలీదు. తెలుసుకోవాలనే తాపత్రయం కలిగిన్నాటికి అమ్మ ఆమాట అనటం మానేసింది. మాకా తాహతూ, హోదా పోయాయని తెలుసుకున్ననాటి నుంచి మీగురించే మరచిపోయాను.

ఒకనాడు మావఁయ్య వచ్చారు. నన్ను పట్నం తీసుకవెడతామన్నపుడు నాకు మొట్టమొదటిసారిగా కనిపించింది కాలేజీ కాదు; డిగ్రీకాదు: షోకులుకాదు: పట్నం షికార్లు కాదు - ఒక చిన్న అమ్మాయి జ్ఞాపకమొచ్చింది. పేరేవిఁటో తెలుసా? కౌసల్యట.

'ఆ కౌసల్య చుట్టూ జీవితాలూ, ఆనందాలూ, సంతోషాలూ అల్లుకోనారంభించాను, ఆమెతో కలసి సరదాగా కాలేజీకి పోవడాన్నీ, కలసి సినిమాలకు పోవడాన్నీ, కలసి ఇంట్లో ఒకే టేబిలుముందు కూచుని చదువుకోడాన్నీ- ఇంకా ఇంకా ఎన్నోఎన్నో తియ్యగా వూహించుకొన్నాను.

'ఇక్కడికొచ్చాను. నేను వూహించుకొన్న కౌసల్య ఆ కౌసల్య కాదనిన్నీ, నన్ను అనుక్షణం అసహ్యించుకొంటూ దూరంగా పోతున్నదనిన్నీ, నామీద చాడీలు చెప్పియితరుల దృష్టిలో ఇడియట్గా నన్ను మార్చిపారేసిందనిన్నీ తెలుసుకున్నాక నేను పడిన బాధ, దుఃఖం - కౌసల్యా నీకు చెబితే అర్థంకాదు; నువ్వు అర్థంచేసుకోలేవు. ఈబాధ ఒకనాడు కాదు; రెండ్రోజులు కాదు - నాలుగేళ్ళు భరించి భరించి ఎంత పిచ్చివాణ్ణయిపోయానో నీకు తెలీదు. ఒక పల్లెటూరి అమాయక ప్రాణిని, అర్భకుణ్ణి - నా అమాయకత్వానికి నవ్వుతూ, నా 'అజ్ఞానాని'కి అపహాస్యాలుచేస్తూ, ఉడికిస్తూ రెచ్చగొట్టే మాటలాడినపుడు - నాక్కావాలనుకున్న, నేను వూహించుకున్న అందమైన సుందరాంగి ఎందుకు నానుంచి యింత దూరంగా పోతోందో అర్థంగాక నేను పడిన ఈ నాలుగేళ్ళ యమయాతన - కౌసల్యా - నువ్వు వింటే గుండాగి చచ్చిపోతావ్! నన్ను వెలివేసినట్టు ఈయింట్లో అందరూ విడిగా చూస్తున్నప్పుడూ, నా ఒక్కడికే విస్తట్లో (మిగిలిపోయిన వంటకాలు) వడ్డిస్తున్నప్పుడూ నేను పడిన బాధ పగవాడికి కూడా వద్దు. ఈ బాధనుంచి మోక్షణం బయటపడాలని, ప్రపంచంలోకి ఒకఘడియపోతే - దాన్నికూడా నేను చెయ్యరాని నేరంగానే పరిగణించేదానవ్. కాలికి మేకు గుచ్చుకున్న బాధకంటే, దానికి లక్షలై పోతున్నట్టు యింట్లోవాళ్ళనే మాటలు ములుకుల్లా గుచ్చుకొనేవి. ఆవారం పదిరోజులు ఈ దెప్పులబాధనుంచి కాస్త శలవు పుచ్చుకొనేందుకు యీవాళ సినిమాకు వెడితే పర్యవసానం యిది-!'

కోటికోట్ల సంవత్సరాలుగా భూగర్భంలో కళపెళ మరుగుతున్న లావా వొక్కసారిగా అదను చూసుకొని జ్వాలాముఖి ముఖద్వారం గుండా విజృంభించినట్టు రవణ విజృంభించడంతో కౌసల్య ఖిన్నవదనయై సిగ్గు: సంక్షోభాలతో మరింత కుదించుకపోయింది.

'అమ్మకు పంపించిన అరవైరూపాయలూ నువ్వునాకు యిచ్చినవే అనుకున్నావ్. కాని ఈ మూడునాలుగేళ్ళ నుంచి కూడా అమ్మకు నేను నెలనెలా అలా పదిపాతికా పంపిస్తూనే వున్నాను. సాయంకాలమప్పుడు రెండు ప్రైవేట్లు చెప్పుకొంటూ ఆ డబ్బు సంపాయించి వాళ్ళకు పంపిస్తున్నట్టు మీకు చెప్పకపోవడం నా తప్పే. కాని చెప్పడంవల్ల మరో సమస్య తలెత్తుతుంది. దాన్ని మీరు మోసమన్నా ఫర్వాలేదు.

అని ఒకనిట్టూర్పు విడిచి మళ్లాఅన్నాడు.

'ఒకళ్ళమీద అధికారం చెలాయించాలన్న మానసిక వక్రత్వాన్ని నువ్వు దినదినం వృద్ధిచేసుకుంటున్నావ్ కౌసల్యా. అందుకు డబ్బు బాగా మద్దత్తు నిచ్చింది. నీ మనస్సులో ఎక్కడో నామీద ఎవరూ మార్చలేని నిష్కళంకమైన ప్రేమ వుంది. దాన్ని బైటికి నీమటుకు నువ్వు చెప్పుకోడానికి అహం అడ్డొచ్చేది. ఇక్కడే నువ్వో రకమైన అడ్డగోడల్ని సృష్టించుకున్నావ్. నేనుపక్కపల్లె ఘటాన్నని నాబాహ్యావతారాన్ని చూసి అసహ్యించుకోవారంభించావ్. ఓ శుభముహూర్తాన నన్ను టెర్లిన్ షర్టుల్లో, ట్రాపికల్ పాంటుల్లో చూసుకోవాలని అరవై రూపాయలు యిచ్చావ్. దానికి కూడా నేను తలవొంచక పోవడంతో నీ అతిశయానికి హద్దులు తెగి నన్ను 'చిత్రవధ' చేయడానికి నిశ్చయించుకున్నావ్...ఈడబ్బు సృష్టించిన కృతకవాతావరణంలోంచీ డబ్బులేని నన్ను చూసి నీతోసమానంగా నేనురాలేకపోతున్నానని జాలిపడి, ఆజాలిని కోపంగామార్చుకొని నన్నుహింసించేదానవ్,..అలాటి బలహీనత గల స్త్రీని, ఏకారణం చూపించి నన్నుస్వీకరించమంటావ్ కౌసల్యా,?'అన్నాడు రవణ.

నిశ్శబ్దం!

ఆకసం నించి ఒక ఉల్క రాలిపడింది. మిణుకు మంటున్న నక్షత్రాలు ఒకసారి కళ్ళు మిటకరించి దాబా మీది రెండు ప్రాణుల్ని రెప్పవాల్చకుండా చూడనారంభించాయి. కోపమొచ్చి కోయిలమ్మ ఆవులించి, ఆలాపించింది. గోదావరి గోలపెట్టి ఘీంకరించింది. దూరాన రైలుబండి బ్రిడ్జిమీద కూతకూసింది.

రవణ వుపన్యాసంలో అర్థంలేదనిగానీ, వున్నా తను గ్రహించలేకపోయాననిగానీ, కౌసల్య వూహించుకోలేదు. ఊహించేందుకు ఆమె మస్తిష్కం తిరస్కరించింది. ఆమెకు చేతనైనదల్లా ఒక్కటే: కుప్పలా రవణ కాళ్ళమీద పడిపోయి అశ్రువులతో అభిషేకంచేసి అస్పష్టంగా: 'క్ష....మి....ం....చ....ం....డి....' అంది.

రవణ అక్కణ్ణుంచి కదిలిపోయినపుడు ఆ పాదధూళి కౌసల్య తలమీద వేసుకుంది-

● ● ●

రవణ, ఆ వెళ్ళడం తిన్నగా స్నేహితులింటికి ఇక్ష్వాకులనాటి ట్రంకుతోనూ, టీసీ బెడ్డింగ్తోనూ వెళ్ళిపోయాడు,

కథంతా విన్న మిత్రబృందం సామూహికంగా రవణ్ణి 'ఇడియట్, ఫూల్, జంగ్లీ, అడివిమృగం' అని తెలిసిన భాషల్లోనీ, తెలియని తిట్లుకూడా తిట్టేశారు.

అన్నింటినీ శిరసావహించిన రవణ మెల్లగా:


'అమ్మకు ఉత్తరం యిప్పుడే వ్రాసి పోస్టు చేశాను: పరీక్షలయిన వెంటనే ముహూర్తం నిశ్చయించడానికి మావఁయ్యదగ్గరకు రమ్మనమని' అన్నాడు చిరునవ్వుతో. ☐☐☐

కూనలమ్మ పదాలు
ఆరుద్ర



ప్రజల కాదనలేను
పదము లాపగ లేను
మరల పాడెద నేను
ఓ కూనలమ్మా!


ఆపరేషను శిక్ష
ఆయుధమ్ముల భిక్ష
పక్కవాడికి కక్ష
ఓ కూనలమ్మా!



కొత్త పెండ్లము వండు
గొడ్డుకారము మెండు
తీపియను హస్బెండు
ఓ కూనలమ్మా!

పాత బిరుదముకన్న
పదవియే కద మిన్న
హల్యాము చాచెను మొన్న
ఓ కూనలమ్మా!

జ్యోతి




గుండెలో శూలమ్మ
గొంతులో శల్యమ్మ
కూళతో స్నేహమ్మ
ఓ కూనలమ్మా!



పిరికి ఎలుకల జంట
పిల్లి మెడలో గంట
వెళ్ళికట్టిన దంట
ఓ కూనలమ్మా!

నరుడు మదిలో దొంగ
నాల్క బూతుల బుంగ
కడుగజాలదు గంగ
ఓ కూనలమ్మా!



పంగనామము లేల
భస్మ పుండ్రము లేల
భక్తి నిజమగు వేళ
ఓ కూనలమ్మా!




మగువ బుగ్గల సిగ్గు
మండు చుండెడి బొగ్గు
వలపు వెచ్చని రగ్గు
ఓ కూనలమ్మా!

కొత్తమీద జుగుప్స
కొలది ప్రాతకు పిప్స
విశ్వనాథకు లిప్స
ఓ కూనలమ్మా!

గిరీశం లెక్చర్సు

ది మోస్ట్ బర్నింగ్ ప్రాబ్లెమ్ ఆఫ్ టుడే టుమారో అండ్ ఫరెవర్



లేక హౌటుగెట్ సిగార్స్

ముళ్ళపూడి వెంకటరమణ


హలో మై డియర్ వెంకటేశం. ఏవిటలా పేపరుచాటున తలదాచేసుకున్నావ్....నీకూ్కూడా నాలాగే "లోన్ వుల్వ్‌స్"- అనగా అప్పులవాళ్ళబాధ వుందా....లేపోతే మీనాన్న పరగడుపునే చద్దివణ్ణం కన్న పెందలాడే చివాట్లు పెట్టాడా?.... లేపోతే కొంపదీసి ఒకవేళ న్యూసే చదివేస్తున్నావా? నిజవేఁ! మైగాడ్! దిస్-ఐతింక్-ఈజ్ ది ఎండాఫాల్ పొలిటిక్స్.... ఇలా అడ్డమైన వాడూ పేపర్సు చదివేసి పాలిటిక్స్ ఒంటబట్టించేసుకోబట్టే కంట్రీ ఈస్థితికివచ్చింది. మినిష్టర్లు నానా అవస్థా పడుతున్నారు.పాలిటక్సంటే ఏ పదిమంది చేతులోనో ఉండి గుంభనగా ఏడవాలితప్ప ఇలా బజారు కెక్కిపోతే ఇంకెలాగంట.... దేశం మేలు కోరేవాళ్ళ- రెస్పాన్సిబుల్ సిటిజెన్స్‌చెయ్యవలసిన పనేనా ఇది? ఇవన్నీ చదివెయ్యడమూను- అదేమిటి ఇదేమిటి అంటూ అడ్డదిడ్డమైన ప్రశ్నలు వెయ్యటం, విమర్శలు చెయ్యటం అవతల జనాన్ని తికమక పెట్టటం....వాటీజ్‌దిస్? డెమాక్రసీ?....

మొన్న శ్రీ చీఫ్ మినిస్టరు గారన్నట్టు విమర్శలంటే- ఏదో మర్డీ ఓ డెమోక్రసీ గాబట్టి- ముచ్చటగా ఎప్పుడేనా ఓసారి "అదిగో మీరల్లా అనడం బావులేదూ. ఇలా చెయ్యడం బావులేదూ. కూడదని గాదు స్మండీ. నావూహ చెప్పా అపైన మీఇష్టం" అని వూరుకోవాలి. అంతదప్ప అదేపట్టుకు వేళ్లాడి యాగీచేస్తే ఎలా? ఎలాగంట?....

అసలీ పాలిటిక్సంటే నీకేం తెలుసునని. గట్టిగా అడిగితే మీనాన్న దగ్గరో మస్కా వేసి సిగార్సుకో రూపాయి పుట్టించ లేవు. నువ్వా ఇవి చదివి మాటాడ్డవేనా అని. ఏదీ చూతాం. ఘంటాయి చదువుతున్నావుగదా. వాటీజ్ ది బర్నింగ్ ప్రాబ్లెమాఫ్ దిడే?.... ధరలా? మతాచాలా?- ప్రణాళికలా - కట్నాలా? కాకరకాయలా? ఉద్యోగాలా? జీవితాలా? ధర్మమా? కాబినెట్ పాలిటిక్సా? ఎలక్షను సన్నాహాలా? చెప్పవాయ్ చెప్పు! షెట్ మాన్....

మైగాడ్! ఇన్నట్ట....డౌన్‌రైట్ ఇన్సల్టు. గిరీశం దగ్గిర ఇంతకాలం తర్ఫీదయ్యుండి ఈనాటి ప్రాబ్లెం గెస్ చెయ్యలేకపోవడవేఁవిటోయ్....నోట్‌బుక్ తీసిరాసుకో. ఈనాటికి ఈక్షణానికి-నోనోస్ట్రియికిటాఫ్.కొౠటెయ్.... ఈనాడేమిటి. టుడే టుమారో ఎండ్ ఫరెవర్ మనకి బర్నింగ్‌ప్రాబ్లెం ఏవిటి. సి-గా-ర్స్.... చుట్టలు. చుట్టల్ని మనం వేళపట్టున కాల్చేదారి లేపోతే అవిమన్ని కాల్చుకుతినేస్తాయ్. చర్చిలుగారి సీక్రెటాఫ్ సక్సెసేవిటి.... సిగార్స్....వరయూర్ సిగార్స్....అవి నోట్లో లేపోతే ఆయనసలు మాట్లాడడు. నాస్తుటెవరెడ్....ముందు లోపలికెళ్ళి మీ మావఁ పంచాంగప్పొదిలో పొగాకుపాయోటి పట్రాచెప్తా....ఐ విల్ ఎడ్యుకేట్ యూ ఆన్ పాలిటిక్స్ ఓవరె పఫ్ అఫ్ స్మోక్....

వాట్! జేబులోనే ఉందా....నాకోసం దాచావా....నా స్పెన్స్ ... నోనో....వండ్రఫుల్. మైడియర్ వెంకటేశం. దిసీజ్పాలిటిక్స్. నువ్వు నిల్చున్న పళంగా లీడరు గిరీకి సెలక్టయి పోవచ్చునోయ్ ...ఏఁవిఁ



ట్రాటజిక్‌గారిప్లయిచ్చావు... ఒక్కమాటలో ఇటు నువ్వు చుట్టదాచుకున్న నైనం రుజూ కాకుండా తప్పించుకున్నావ్; అటు గురువు గారినే పల్టీ కొట్టించావ్. సెబాష్. బట్ ఫర్‌మీ. అయామ్ ఆల్మోస్ట్ ప్రౌడాఫ్‌యూ.

నౌ ఫర్ ది లెసన్స్. అసలు పాలిటిక్సనగా నేమి. ఎట్టివాడు పొలిటీషియన్? పాలిటిక్స్ ఈజ్‌ది ఆర్టాఫ్ గెసింగ్ ది పాసిబుల్ అన్నాడు శాస్త్రకారుడు. ఎండ్ నోయింగ్ ది ఇంపాసిబుల్ అన్నది నాపేరు చెప్పి రాసుకో. అనగా ఉదాహరణకి బర్త రఫు ఖాయమని తెలుకోవడం; అందుకో గంట ముందే ఆ పదవిని త్యాగం చేసవతల పారెయ్యడం. అందువల్ల పైటెర్మ్‌కి మనకోసీటు ఖరారని ఊహ చేసుకోవడం. పొజీషన్‌లో లేకపోవడమే అపొజిషన్ అని గుర్తుంచుకోవడం. స్థానచలనాలను బట్టి విమర్శలు అటుదిటూ ఇటుదటూ ఫిరాయించడం....

డామిట్....ఏమిటోయ్ ఈ చుట్ట? స్టుపిడ్ టుబాకో....ఇది నిజంగానే బర్నింగ్ ప్రాబ్లెంలా వుందే....ఇప్పటికా, రగ్గిపుల్లలు తగులడ్డాయి. అరంగుళం కాలలేదు....ఇది కాదుపని. ఇలారా....దగ్గిర్రా రా....చురకెట్టను లేవోయ్....ఏడీ....పంచ్చదార ధరెంతో్చ చెప్పు....అబ్బ!! డామిట్! చుట్టతోపాటు మొహంకూడా భగ్గుమనేది కాస్తుంటే. మరీ అంత మండిపోతూందోయ్. ధరా....అలాటపుడు కాస్త నెమ్మదిగాచెప్పాలి— ఇదిగో ఇగే ఆర్టాఫ్‌గెసింగ్. ది పాసిబుల్ అనగా యిదే. పంచదార ధరలంతగా మండుతూంటే ఏ పప్పో బియ్యమో చెప్పాలి....అపంతకన్ననా! అన్నీ అలా మండితే. ప్రాణం అంటే సరిపోయేది....

కారు చవగ్గదా ...ధరలన్నీ యింతలా మండిపోతూవుంటే వాటిని చల్లార్చే గవర్నమెంటు కాపేరు తీసేసి ఫైరుసర్వీస్ అనగా అగ్నిమాపకదళం అని పేరుపెట్టడం న్యాయం కదూ....అంటే ది ఫైర్‌సర్వీస్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ఆప్ మద్యప్రదేష్....

ఏవిటీ? మద్యప్రదేష్ అన్నానా. ఛ ఛ నేను ధ్య అనిఖచ్చితంగా అన్నాను. అచ్చుతప్పేమో చూడు. లేకపోతే సెన్సారువాళ్ళెవరేనా ఓదానికో టనుకుని ధ వత్తు కొట్టేశారంటావా....నో నో ధ వత్తులో సెక్సేముంటుంది?....మద్యం అబ్జెక్షన్ అయుంటుంది. దీనికి ఇదమిత్థంగా చెప్పలేమనుకో. వాళ్ళు ఎప్పుడేది కత్తిరిస్తారన్నది. డిపెండ్సాన్ ఇంటర్ ప్రెటేషన్!.... పిక్చరు టు పిక్చరుంటుంది. సేమ్‌సీన్ సేమ్ డైలాగు ఒకసారి తప్పించుకుంటుంది. మరో దాంటో శిక్షపొందుతుంది....

ఏవిటి? సమానతా? సమానతేవిటి నాన్సెన్స్. ఇదేం డెమాక్రసీ అనుకున్నావా. ఆసలు సమానత దేంటో ఉందని- జీవితావసర వస్తువుల ధరలన్నీ సమానంగా మండుతున్నాయిటోయ్? కొన్ని హెచ్చుగా మండటం లేదూ? చూడు, మొన్నటి దాకా బెల్లం, ఖండసారి ధరలు బాగా మండుతున్నాయనే గదా చక్కెర ధరలు ఎగసం దోశారు? పంటచెర కంతా అయిపోతుందని దాన్నిటు మళ్ళించడానికి పంచదార చెరకూ, పంచదారకూ ధరలు పెంచారట, రేపు బెల్లం ఖండసారీ గోల పెట్టవూ- మమ్మల్ని కూడా పెంచమని? మరిలా అయితే సమానతేనాటికి కుదురుతుందని. ఇలా దీనికోసం అదీ, దానికోసం ఇదీ అంటూ అసమానతని పెంచటంలే? అసలీ ఇకనమిక్సే ఒక పప్పుల తక్కెడ. ఇందులో పొలిటికల్ ప్రాగ్సు వినోదక్రీడలారంభిస్తే మనక్కాలక్షేపానికి లోటేమిటి. కాలక్షేపమనేకాదు. వెనకోసారి నేనే అన్నట్టు ఇలాటిలోపాలుంటేగాని, విమర్శలెలా- ఉద్యమాలెలా- ప్రోగ్రెసాఫ్ సివిజేషనెలా.

అలాగే స్కూలు టీచర్లు (పూర్ క్రీచర్లు- కేవలం అంత్యప్రాస మోజుకొద్దీ అన్నాను. నాయకులు కోప్పడకుండెదరుగాక) చూడు గవర్నమెంటు స్కూళ్ళ టీచర్లకి ఉచితంగా మందులిస్తున్నారట. ఎయిడెడ్ స్కూళ్ళ వాళ్ళకివ్వడం లేదట. ఏదీ? వేరీజ్ యువర్ సమానత? టీచర్లంటే అంతా ఒకటేగా. అందరికీ కంఠశోషేగా. అందరివీ అవే జీ(వి)తాలుగా. ఏ వొక్కరికీ అజీర్ణంచేసే ప్రమాదం లేకుండా ప్రభుత్వం కట్టుదిట్టం చేసినా- మిగతా జబ్బులకలాటివి లేవుగా. మరి ఏ వొక్కరికీ ధర్మాసుపత్రి వైద్యం చేయించుకునే తాహతుండదుగదా. ప్రైవేటు డాక్టరు వైద్యాలయినా- ఇచ్చుకోడం అంత సులువుగాదు గదా. మరి ఏవిటీ అసమానత? ఏం? గవర్నమెంటు స్కూలు జబ్బులు బాధపెట్టవనా? ఆమాట ప్రభువులుకూడాఅనరే. ఎయిడెడ్ స్కూలు జీతపు రూపాయికి నూటపదహారు నయాపైసల చిల్లరివ్వాలని జీ.వో. లేవీ వున్నట్టు లేవే! మరి వైద్యసదుపాయాలకీ అసమానతేల? నువ్వు కేవలం సెన్సారు వాళ్ళనే వేలెత్తి చూపిస్తే ఎలా? వీళ్ళననవేం?

అఁ....కమాన్ అలాదారికిరా. ఎగ్జాక్ట్‌లీ. దటీజ్ నేర్ ప్రోగ్రెస్ కమ్మిన్.... ఆంధ్రదేశంలో గవర్నమెంటు స్కూళ్ల కన్న ఎయిడెడ్ స్కూళ్ళసంఖ్య చాలా ఎక్కువ. అందరికీ ఉచితవైద్యం అంటే జరిగేపని కాదు, అగికిటుకు. ఏదో కొసిని మందికన్నా చెయ్యకపోతే మనం ఏమి ప్రోగెసుసాధిస్తున్నట్టూ? రేపు వావిలాలకేం రిప్లయిస్తాం! 'శ్టాటిట్రిక్సు' ఏం రాయిస్తాం! ఇంక మనవంతా సమానత అంటూ రభస చేస్తే అందరికీ ఉచితవైద్యం లేకుండా రద్దు చేసి సాపుచేస్తారు. అదీ ఓ పాయంటే ననుకో. టీచర్లలో అసంతృప్తి ప్రబలకుండా చేసే దృష్ట్యా ఈప్రతిపాదన ప్రభుత్వాలోచనలో ఉందని విన్నాను....

అంచేత చెప్పొచ్చేదేవిటంటే సెన్సారు వాళ్ళ నాడిపోసుకోకు. వాళ్ళుచేసే మేళ్లు గుంటడివి నీకేం తెలుసు. కథలల్లేవాళ్ళం డైరెక్షన్లు ప్రొడక్షన్లు చేసేవాళ్ళం మమ్మల్నడుగు. కథలల్లడం ఈనాడెంత సులువైపోయిందని? నువ్వు బెంగాలెళ్ళు బొంబాయెళ్ళు బెంగుళూరెళ్ళు ఎక్కణ్ణించేం తెచ్చినా మన కథ మూసలోనే పోసేస్తాం. ఏకాస్త మారినా, అందులో అబద్ధం గురించి, అవినీతిగురించి మాట పలుకొచ్చినా సెన్సారొప్పుకోరన్న భయం వంక చూపి పాతకథలే హాయిగా వాడుతున్నాం గదా. అసలు పెద్దబాలశిక్షకి బంగారు ప్రేములుగదటోయ్ మన తెలుగు పిక్చర్లు. అందులోనూ అబద్ధమాడరాదూ అన్న వాక్యాన్ని చూపిస్తామా? అమ్మో! జనం చెడిపోరూ? నిజము పల్కుము అన్నదే చూపిస్తాం. మనకథల్లో జనం అందరూ మంచివాళ్లే. అంతా త్యాగమూర్తులే. పరాయి దేశీయులు చూసినా - ఓహో ఇండియా సారవంతమైనదే కాదు సత్యవంతమైనది కూడాను అనుకోవాలా! అవన్నీ అలా వుంచు. అసలు కొత్తకథల ప్రాబ్లెం లేకుండా పోయిందంటే అది ఎవరిచలవ? ఏదీ నువ్వు, పెళ్ళికాని పిల్ల కట్టుదప్పి చెడిపోయిందని చెప్పుచూదాం. ఒప్పుకోరు. ఎవడో లంచాలు పట్టి తన బతుకు తన కుటుంబం బతుకూ నాశనం చేశాడను. ఒప్పుకోరు. ప్రొహిబిషన్ అధ్వాన్నంగా ఉంది, కల్తీ సరుకువల్ల జనం ఆరోగ్యం మరింత చెడుతుంది, గుంట వెధవలుకూడా తాగడం గొప్పదనుకుంటున్నారు అనిచెప్పు. ఒప్పుకోరు. నగ్నసత్యాలు ఏవీ ఒప్పుకోరు, అన్నిటికీ ఖద్దరు నీతిబట్టలు చుట్టబెట్టాలి చేతనైతే ఈ అబద్ధాలకీ - ఈ దేశంల్లో కన్నెపిల్లలు మోసపోవటంలేదు. కట్నాల వల్ల కుటుంబాలు దెబ్బతినటంలేదు, మద్యపాన నిషేధం జనాన్ని తప్పుదారిలోపెట్టటం లేదు, లంచాలు ఎవరూ తీసుకోరు వగైరా అసత్యాలకు నువ్వు అందమైన నైలాన్

● ఒకానొక సభలో ఒక మంత్రిగారు ఎక్కువసేపు మాట్లాడారు. ఆ ఉపన్యాసం ప్రచురిస్తూ ఒక పత్రిక "మంత్రిగారు అధిక ప్రసంగము చేసినారు" అని రాసింది!

కారు చవగ్గదా ...ధరలన్నీ యింతలా మండిపోతూవుంటే వాటిని చల్లార్చే గవర్నమెంటు కాపేరు తీసేసి ఫైరుసర్వీస్ అనగా అగ్నిమాపకదళం అని పేరుపెట్టడం న్యాయం కదూ....అంటే ది ఫైర్‌సర్వీస్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ఆఫ్ మద్యప్రదేశ్....

ఏవిటీ? మద్యప్రదేశ్ అన్నానా. ఛ ఛ నేను ధ్య అనిఖచ్చితంగా అన్నాను. అచ్చుతప్పేమో చూడు. లేకపోతే సెన్సారువాళ్ళవరేనా ఓదానికో టనుకుని ధ వత్తు కొట్టేశారంటావా....నో నో ధ వత్తులో సెక్సేముంటుంది?....మద్యం అబ్జెక్షన్ అయింటుంది. దీనికి ఇదమిత్థంగా చెప్పలేమనుకో. వాళ్ళు ఎప్పుడేది కత్తిరిస్తారన్నది- డిపెండ్సాన్ ఇంటర్ ప్రెటేషన్!.... పిక్చరు టు పిక్చరుంటుంది. సేమ్‌సీన్ సేమ్ డైలాగు ఒకసారి తప్పించుకుంటుంది. మరో దాంటో శిక్షపొందుతుంది....

ఏవిటి? సమానతా? సమానతేవిటి నాన్సెన్స్. ఇదేం డెమాక్రసీ అనుకున్నావా. అసలు సమానత దేంటో ఉందని- జీవితావసర వస్తువుల ధరలన్నీ సమానంగా మండుతున్నాయిటోయ్? కొన్ని హెచ్చుగా మండటం లేదూ? చూడు, మొన్నటి దాకా బెల్లం, ఖండసారి ధరలు బాగా మండుతున్నాయనే గదా చక్కెర ధరలు ఎగసం దోశారు? పంటచెరకంతా అయిపోతుందని దాన్నిటు మళ్ళించడానికి పంచదార చెరకూ, పంచదారకూ ధరలు పెంచారట. రేపు బెల్లం ఖండసారీ గోల పెట్టవూ- మమ్మల్ని కూడా పెంచమని? మరిలా అయితే సమానతేనాటికి కుదురుతుందని. ఇలా దీనికోసం అదీ, దానికోసం ఇదీ అంటూ అసమానతని పెంచటంలే? అసలీ ఇకనమిక్సే ఓ కప్పల తక్కెడ. ఇందులో పొలిటికల్ ఫ్రాగ్స్ వినోదక్రీడలారంభిస్తే మనకాలక్షేపానికి లోటేమిటి. కాలక్షేపమనే కాదు. వెనకోసారి నేనే అన్నట్టు ఇలాటిలోపాలుంటేగాని, విమర్శలెలా- ఉద్యమాలెలా- ప్రోగ్రెసాఫ్ సివిజేషనెలా.

అలాగే స్కూలు టీచర్లు (పూర్‌క్రీచర్లు- కేవలం అంత్యప్రాస మోజుకొద్దీ అన్నాను. నాయకులు కోప్పడకుండెదరుగాక) చూడు గవర్నమెంటు స్కూళ్ళ టీచర్లకి ఉచితంగా మందులిస్తున్నారట. ఎయిడెడ్ స్కూళ్ళ వాళ్ళకివ్వడం లేదట. ఏదీ? వేరీజ్‌యువర్ సమానత? టీచర్లంటే అంతా ఒకటేగా. అందరికీ కంఠశోషేగా. అందరివీ అవే జీ(వి)తాలుగా. ఏ వొక్కరికీ అజీర్ణంచేసే ప్రమాదం లేకుండా ప్రభుత్వం కట్టుదిట్టం చేసినా- మిగతా జబ్బుల కలాటివి లేవుగా. మరి ఏ వొక్కరికీ ధర్మాసుపత్రి వైద్యం చేయించుకునే తాహతుండదుగదా. ప్రైవేటు డాక్టరు వైద్యాలయినా- ఇచ్చుకోడం అంత సులువుగాదు గదా. మరి ఏవిటీ అసమానత? ఏం? గవర్నమెంటు స్కూలు జబ్బులు బాధపెట్టవనా? అమాట ప్రభువులుకూడాఅనరే. ఎయిడెడ్ స్కూలు జీతపు రూపాయికి నూటపదహారు నయాపైసల చిల్లరివ్వాలని జీ.వో. లేవీ వున్నట్టు లేవే! మరి వైద్యసదుపాయాలకీ అసమానతేల? నువ్వు కేవలం సెన్సారు వాళ్ళనే వేలెత్తి చూపిస్తే ఎలా? వీళ్ళననవేం?

ఆఁ....కమాన్ అలాదారికిరా. ఎగ్జాక్ట్‌లీ. దటీజ్ నేర్ ప్రోగ్రెస్ కమ్మిన్.... ఆంధ్రదేశంలో గవర్నమెంటు స్కూళ్ల కన్న ఎయిడెడ్ స్కూళ్ళసంఖ్య చాలా ఎక్కువ. అందరికీ ఉచితవైద్యం అంటే జరిగేపని కాదు, అనీకిటుకు. ఏదో కాసిని మంచికన్నా చెయ్యకపోతే మనం ఏమి ప్రోగెసుసాధిస్తున్నట్టూ? రేపు వావిలాలకేం రిప్లయిస్తాం! 'శాటిట్రిక్స్' ఏం రాయిస్తాం! ఇంక మనవంతా సమానత అంటూ రభస చేస్తే అందరికీ ఉచితవైద్యం లేకుండా రద్దు చేసి సాపుచేస్తారు. అదీ ఓ పాయంటే ననుకో. టీచర్లలో అసంతృప్తి ప్రబలకుండా చేసే దృష్ట్యా ఈప్రతిపాదన ప్రభుత్వాలోచనలో ఉందని విన్నాను....


అంచేత చెప్పొచ్చేదేవిటంటే సెన్సారువాళ్ళ నాడిపోసుకోకు. వాళ్ళుచేసే మేళ్లగుంటడివి నీకేం తెలుసు. కథలల్లేవాళ్ళం డైరెక్షన్లు ప్రొడక్షన్లు చేసేవాళ్ళం మమ్మల్నడుగు. కథలల్లడం ఈనాడెంత సులువైపోయిందని? నువ్వు బెంగాలెళ్ళ బొంబాయెళ్ళ బెంగుళూరెళ్ళ ఎక్కణ్ణించేం తెచ్చినా మన కథ మూసలో నేపోసేస్తాం. ఏకాస్త మారినా, అందులో అబద్ధం గురించి, అవినీతిగురించి మాట పలుకొచ్చినా సెన్సారొప్పుకోరన్న భయం వంక చూపి పాతకథలే హాయిగా వాడుతున్నాం గదా. అసలు పెద్దబాలశిక్షకి బంగారు ప్రేములుగదటోయ్ మన తెలుగు పిక్చర్లు. అందులోనూ అబద్ధమాడరాదూ అన్న వాక్యాన్ని చూపిస్తామా? అమ్మో! జనం చెడిపోరూ? నిజము పల్కుము అన్నదే చూపిస్తాం. మనకథల్లో జనం అందరూ మంచివాళ్ళే. అంతా త్యాగమూర్తులే. పరాయి దేశీయులు చూసినా - ఓహో ఇండియా సారవంతమైనదే కాదు సత్యవంతమైనది కూడాను అనుకోవాలా! అవన్నీ అలా వుంచు. అసలు కొత్తకథల ప్రాబ్లెం లేకుండా పోయిందంటే అది ఎవరి చలవ? ఏదీ నువ్వు, పెళ్ళికాని పిల్ల కట్టు దప్పి చెడిపోయిందని చెప్పుచూదాం. ఒప్పుకోరు. ఎవడో లంచాలు పట్టి తన బతుకు తన కుటుంబం బతుకూ నాశనం చేశాడను. ఒప్పుకోరు. ప్రొహిబిషన్ అధ్వాన్నంగా ఉంది, కల్తీ సరుకువల్ల జనం ఆరోగ్యం మరింత చెడుతుంది, గుంట వెధవలుకూడా తాగడం గొప్పదనుకుంటున్నారు అనిచెప్పు. ఒప్పుకోరు. నగ్నసత్యాలు ఏవీ ఒప్పుకోరు, అన్నిటికీ ఖద్దరు నీతిబట్టలు చుట్టబెట్టాలి చేతనైతే ఈ అబద్ధాలకీ - ఈ దేశంలో కన్నెపిల్లలు మోసపోవటంలేదు. కట్నాలవల్ల కుటుంబాలు దెబ్బతినటంలేదు, మద్యపాన నిషేధం జనాన్ని తప్పుదారిలోపెట్టటంలేదు, లంచాలు ఎవరూ తీసుకోరు వగైరా అసత్యాలకు నువ్వు అందమైన నైలాన్

● ఒకానొక సభలో ఒక మంత్రిగారు ఎక్కువసేపు మాట్లాడారు. ఆ ఉపన్యాసం ప్రచురిస్తూ ఒక పత్రిక "మంత్రిగారు అధిక ప్రసంగము చేసినారు" అని రాసింది!

చీరలు కట్టి డాన్సు చేయించు. నిన్నుమెచ్చుకుంటారు. ఇప్పుడీ సమస్యలన్నిటి గురించి నువ్వు పౌరుడుగా బాధ్యతగల కళాకారుడుగా చర్చించి నీ అభిప్రాయాలు చెప్పాలనుకో. బుర్రకెంత శ్రమ. ఎంత అవస్థ. పైగా రిస్కీయ్. ఎందుకూ జనాని కలవాటైన కథలే సెన్సారు పక్షంగా ఉండేకథలేతీసుకో. ఆ బాపతు మాటలే పాటలే -, వీలైతే అవే. రాసుకో.

ఇంతకీ ఇందులో అసలు కిటుకుచెప్పనా. సెన్సారువాళ్ళు సాహిత్యం మీద. మిగతా క్లాసురకం లలితకళలమీద పడి వాటిని కంట్రోలుచేసి పారేసే ప్రమాదం ఉందన్న భయం పట్టుకుంది గవర్నమెంటుకి. సంగీత సాహిత్యాల పీక నొక్కేస్తే ప్రపంచ రంగంలో మన కసలున్న అబోరుకూడా దక్కదు. సినిమాలో మనం జానపదం తీసుకున్నా ఎవడికీ బెంగలేదు. అందికని ఈ సినిమాని సెన్సారు కత్తెరకెరచేసి-ఏదీ-అదన్నమాట సంగతి. అందికే నోయ్ చెకోవ్ అన్నట్టు కాల్లో ముల్లుగుచ్చుకుంటే కంటో గుచ్చుకోలేదని ఆనందించాలి. ఒక్క పన్ను రాలితే (టాక్సుకాదు) 32 రాలి పడలేదని పొంగిపోవాలి. దటీజ్ లైఫ్. అంతేగాని వాళ్ళనాడిపోసుకుంటే లాభమేవిటి. కంఠశోష. ఎవరన్నా వింటారా ఏవన్నానా?

□□□





నాలుగూ నలభయి ఆరు. ఇక్కడే ఉండమన్నాడు. నలభయి ఆరు నిమిషాలయిపోయింది నియమితకాలం దాటి. భగవంతం యింకా రాలేదు. వస్తాడా యీరోజు? అసలు ఎప్పుడేనా వస్తాడా?

సిగరెట్ వెలిగించేను. నల్లగా మాడుతూ మండుతూంది వర్జీనియా. ఏడో నంబరు బస్ బాగా బలిసిన ఊరకుక్కలాగ దూరం నుంచి వస్తూంది. స్టాప్‌దగ్గర ఆగి ఒక డజను మందిని పోసింది— సాధారణంగా చెట్టు కనిపిస్తే చేసేపని—మళ్ళీ ముందుకు పోయింది. భగవంతం లేడు ఆ గ్రూప్‌లో.

లెప్పర్‌గేంగ్ ఒకటి పాటలు పాడుతూ రోడ్‌కి అడ్డంగా పోతూంది. చేపలనిపట్టే వలలాగ. కాని లాభంలేదు. "చిల్లర డబ్బు ల్లేవు."

తరువాత బస్‌లో వస్తాడా? పదమూడో నంబర్లో అట్నుంచి వస్తాడా?

ఎదురుగా. రూపంపొందిన న్యూమోనియా లాంటి యిల్లు. తడిగా ఊపిరితిత్తుల్ని డెస్పరేట్‌గా సూర్యరశ్మిలోకి పైకి లాగి ఎండవేద్దామన్న ఊహతో దగ్గుతున్నట్లు. గోడలమీద సర్రియలిస్ట్ తడి మచ్చలు. చారలు. గోడవెనక. గాలిలో నీళ్ళని దులుపుకుంటూ పచ్చగా ఆశాకిరణంలా అరటిచెట్టు. ధైర్యంగా అమాయకంగా. పిచ్చిది.

భగవంతం చెప్పకుండావస్తాడు. ముందు చెప్పినా. ఎట్నుంచి వస్తాడో తెలీదు. ఎట్నుంచి వస్తాడో తెలిసినా, అనుకున్న

హైమ్‌కి రాడు....వచ్చినా అతనితో ఏమిటి మాట్లాడ్డం !

రోడ్ మీద పొట్టిగా, నల్లగా అంతర్ముఖా లతో పీత నడక ఆలోచనలతో ఖైదీల్లాగ, దూరంగా మూగ సముద్రం అర్థం లేని ఘోష పెట్టోంది. సగం కాల్చిపారేసిన పీకలమీద వర్షం పడి, మెత్తగా, ముద్దగా బైల్ రంగులో....


లేంప్‌పోస్ట్‌కి ఆనుకుని కోట్‌పాకెట్ లోంచి పాత ఉత్తరం తీసేను. పదిహేనేళ్ళ క్రితం భగవంతం రాసిన ఉత్తరం. తుప్పు రంగు.... "నీ భయాలూ, అనుమానాలూ నాకు తెలుసు. భరించలేననుకుంటే, ఇక లాభం లేదనుకుంటే, పరుగెత్తుకురా, వాళ్ళని వదిలేసి. నాయింటిద్వారం ఎప్పుడూ తెరుచుకునే ఉంటుంది...." పాపం ! లోకం మార్పులకి దూరంగా వుండి పాతబడి పోయాడు భగవంతం.

ఈ హోటల్లోకి వెళ్ళి కూర్చుని నిరీక్షిస్తాను. కిటికీలోంచి రోడ్ కనిపిస్తుంది. ఎట్నుంచి వస్తాడో ?


ఈ హోటలు చూడండి. దీన్ని చూస్తే నాకురోత. దీనిమేనేజర్‌నిచూస్తే అసహ్యం. దీనిలోని వెయిటర్స్‌ని చూస్తే భయం, అనుమానం. గాజుపెంకులు రుద్దినట్లుంటుంది మేనేజర్ ముఖం. దాన్నిచూస్తే అసహ్యం. ఇందులోకివచ్చి, వీడు చేయించి పెట్టే చెత్తని మెక్కి మెల్లమెల్లగా కప్పల్ని తిన్న పాముల్లా పైకి పోయే జనాన్ని చూస్తే అసహ్యం.

ఈపుట్టే అసహ్యం అంటే నాకు ఎంతో యిష్టం, ప్రేమ. ఈ అసహ్యం తెరలు తెరలుగా వస్తూంటే మూడోపెగ్ జిన్‌తో వచ్చే నెర్వస్ ఎనర్జీ దేహంలో వ్యాపిస్తున్నట్లుంటుంది. ఇక్కడ యీమూల టేబుల్ దగ్గర కూర్చుంటాను కిటికీలోంచి రోడ్ మీద ట్రాఫిక్ కనిపిస్తుంది. లోపల యీ పురుగులు మాట్లాడే మాటలు వినిపిస్తాయి.

భగవంతంపేరులోనేఉంది సనాతనత్వం. పాతపక్కీ. పిలకలు, కిర్రుచెప్పులు, చెవులకి కుండలాలూ, ఆరవేసిన అంగవస్త్రాలూ వినిపిస్తాయి, కనిపిస్తాయి యీ పేర్లో. నేను అతనికోసం యీ హోటల్లో కూర్చుని నిరీక్షించడం – ఒక పెద్ద పేరడాక్స్.



బోలెడంత కట్నం పోసినా, ప్రతితండ్రీ కన్యాదానమే ఎందుకు చేస్తాడు? అల్లుణ్ణి కొనుక్కున్నామంటే సేల్సుటాక్సు కట్టాలి.



"మనకి యిండిపెండెన్సేమిటి. మనం శుద్ధ వెధవలం. మనకి కేరక్టరొకటా. ఉత్త పకీరుజాతి మనది...."

"మనిషి గుండులా గుంటాడు. ఆసనాలు వేస్తాడు. కాని బ్రహ్మ కాన్‌స్టిపేషన్...."

"నా డెస్టినీలైన్‌లో అన్నీ బ్రేక్స్...."

"నయాపైసా అప్పు పుట్ట...."

"పని చేస్తూ ఆవులింతలు. ఏం ఉద్యోగమో...."

"మా బుజ్జిగాడికి గొంగళిపురుగులు కనిపిస్తే చాలు. చేత్తోనే అలా నలిపే...."

"మిడ్‌ఫీల్డ్‌లో రిఫరీని పట్టుకు తన్నేరుట...."

"చూసుకోలేదుట. గన్ క్లీన్ చేస్తూంటే తూటా గుండెలోంచి...."

"మావాడి ముణుకు ఎందుకు విరిగిందో. ధనాధిపతి దశకూడానూ...."

"పిచ్చెత్తింపట. కత్తిపీటతో పెళ్లాన్నీ. పిల్లల్నీ నరికి...."

"నా ప్రమోషనెందుకు ఆగిపోయిందో శనిగాడు గాబోలు."

కాఫీతెచ్చాడు వెయిటర్. కాఫీ! ఇది కాఫీకాదు. ఉత్తగోధుమరంగువేడి. అడదామనుకున్న తిట్లు తలచుట్టూ యీగల్లాగ మూగేయి.

"నీపేరేమిటన్నాను. తెగించి. ఏదో మహా రహస్యం తెలుసుకోబోతున్నట్లు ముఖంపెట్టి.

"ఉన్నితన్."

ఉన్నితన్. ఉన్నిథన్ ! కొబ్బరితోటలు. మెల్లగా బేక్‌వాటర్స్‌లో బరువుగా పోయే పడవలు....వెళ్ళిపోడం.... నల్లటి, వంకల జుత్తుల మెరుపులు, లవంగాలు, ఏలకులు, కొప్రా....సుగంధం !....

"పో." అన్నాను.

"ఆ. ? అన్నాడు.

"ఇవాళ ఏ దో తేలిపోవాలి. నేనో, అతనో. దీని కర్థంలేదు. లోపలికిపోయి ఆలోచించు. ఈ కాఫీకి ఎంత అర్థం లేదో ఉన్నిథన్ ఉనికికీ అంత అర్థంలేదు. జై ఫటాఫట్."

ఉన్నిథన్ మోకాళ్ళదాకా మడిచిన లుంగీని మళ్ళీ సద్దుకుంటూ, భారత దేశం లోని వింతలూ, విశేషాలూ అన్నీ చూసేశా ననుకున్న తన తెలివితక్కువతనాన్ని మళయాళంలో తిట్టుకుంటూ వెనక్కి తిరిగి పోయాడు.

....భగవంతంరాలేదు. బస్సుల్లోరాలేదు. రిక్షామీదరాడు. నడవడు....

"ఫిట్లు గాబోలు. రెండు వాల్ఫ్ఛలు పొయ్యండి. నురగలు కక్కేస్తున్నాడు". రోడ్డుమీద మూగినజనం. తమాషా. కాసీ ఖర్చులేకుండా చూడొచ్చు. ఏదో మజా, కాలక్షేపం. ఒళ్ళు జలదరిస్తుంది, దేవుడు మేలుచేశాడు కాని, లేకపోతే మనమూ అలాగే. అమ్మో! అదో థ్రిల్.

ఉక్క. చమట. పురుగులు.

అప్పుడప్పుడు ఉప్పగా గాలి.

జిడ్డు.

వేడి.

పైని అలసిన సాయంకాలపు ఆకాశంలో ఎఱ్ఱగా కిల్లీ ఉమ్ముతూ సాగిపోతూన్నాడు సూర్యభగవాన్.

కాలుమడిచి గోడని ఆనుకుని గోళ్ళ లోని మట్టిని పైకి లాగుతున్నాడు ఉన్నిథన్. ప్రేమగా పిలిచేను! ఉన్నీ! పిలుస్తూ వచ్చాడు. ఇంకో కప్ కాఫీ తెమ్మన్నాను. ప్రతిమాలుతున్న స్వరంలో. కలలో అసందర్భంగా కనిపించి. కరిగి పోయిన ఏదో తునకలాగ వెళ్ళిపోయాడు హోటల్ వెనక రౌరవంలోకి.


భగవంతంకోసం ఎంత కాలం యీ యాతన. యీ పరీక్షణ? ఎన్నిగంటలు? ఎన్నేళ్ళు?

'ఈ మనఃఫలకాన్ని, కాన్షస్‌నెస్‌ని పరిశుద్ధం చేసి....' అని అనుకుంటుంటే లోపలి లోపలి లోతుల్లోంచి నవ్వు ఉప్పెనగా వచ్చి, ఎడమచెయ్యి రిస్ట్‌మీద గట్టిగా గిల్లుకున్నాను. సైన్ అది. 'డ్రామాలుమాని, వేషాలు తీసేసి ఆలోచించు' అని వార్నింగ్ సైన్.

రౌరవంలోంచి మెఫిస్టోఫిలిస్ లాగ వస్తున్నాడు. పొగలు కక్కుతున్న కాఫీ పట్టుకుని, దగ్గరగా వచ్చి, టేబుల్‌మీద కాఫీ కప్‌పెట్టి, బెదురుతూ, తిరిగిపోబోయే ఉన్నిథన్ కళ్ళల్లోకి చూస్తూ, కళ్ళతో బలవంతంగా ఆపి, "నువ్వు లేవు. నువ్వు ఉత్త మాయ. నీకు ఉనికిలేదు. హ్యూమ్ చదివేవా? లాక్ ఏమన్నాడో తెలుసా? కాంట్? కీర్క్‌గార్డ్? నువ్వు వున్నావని నే ననుకుంట్లూ, నీతో మాట్లాడుతున్నానని నువ్వు అనుకుంటుంటే, అలా అనుకుంటున్నావని నేననుకుం—"

ఉన్నిథన్ లుంగీ దక్షిణపుగాలిలో ఎగిరే తెరచాపలాగ....'అయ్యో!'.

కుడికన్ను ఓరగాపెట్టి ముక్కు అంచుమీంచి చూస్తే, న్యూమోనియా ఇంటి ఎడమ చివర కిటికీ మూడో ఊచనించి గీతమొదలు పెట్టి రోడ్‌మీంచి కోసుకుంటూ వచ్చి



మేనేజర్ బట్టతలని రాసుకుంటూ యీ టేబిల్‌మీద ఉన్నిథన్ పెట్టి వెళ్ళిపోయిన కప్‌లో మెరిసే పొంగులో మిళితం అయిపోతుంది.

టేబుల్‌మీద కాఫీ. కాఫీ! ఇది కాఫీ కాదు. ఉత్తవేడిగా ఉన్న గోధుమరంగు.

పదమూడో నంబరు వచ్చి ఆగింది. ఆగి ఒక మార్కోవిచ్ ముఖాన్ని, యూలిసెస్‌లాగ వెడల్పుగా వున్న ముఖాన్ని, ఒక టెరిలిన్ కవచాన్ని, ఒక స్టెతస్కోప్‌నీ, ఒక అజ్ఞాతంలో వున్న అర్జునుణ్ణీ దింపింది. భగవంతం లేడు. అట్నుంచి ఏడో నంబర్లో వస్తాడా?

ఉన్ని మేనేజర్ చెవిలో చెప్తున్నాడేదో. మేనేజర్ వెనక్కి తిప్పేడు ముఖాన్ని— గాజుపెంకులు రుద్దినముఖం. బరువైన కళ్ళ రెప్పలకింద రెండు బలిసిన కుక్కలు— రోడ్‌మీద అడ్డంగా, బద్ధకంగా, అవులిస్తూ పడుకొన్న రెండు పోతుల్లాంటి కుక్కలు మెల్లగా గుఱ్ఱుమంటున్నాయి. కళ్ళుమూస్తే పెద్ద గబ్బిలాల రెక్కలు. కుక్కల్ని నా వైపు ఉసిగొల్పేడు.

అదే క్షణం. ఇదే గొప్ప రివెలేషన్. చుట్టూ మెరుపులు విచ్చుకత్తుల్లా తళతళమని ఎవరో దూస్తూ ఉంటే, ఉరుములు రాక్షస రథాల్లా ఉరుకులు పెడ్తుంటే, దర్శనమిచ్చిన దయాళువు వరాలు కోరుకోమంటుంటే.... ప్రపంచపు అరిటిపండుని ఎవరో వొలిచి చేతులో పెట్టూఉంటే....

క్షణమాత్రపు రివెలేషన్. కుక్కల్ని గబ్బిలాల రెక్కలతో మూసేశాడు మేనేజర్.

ఇంక జాగుచేస్తే లాభంలేదు. మువ్వు. లేచి వెళ్లేను కౌంటర్ దగ్గరకి.

"ఇదిగో. ముందే యిచ్చేస్తున్నాను నాలుగుకప్పుల కాఫీకి డబ్బు. ఏం భయం లేదు. మెంటల్ హాస్పిటల్ కి ఫోన్ చెయ్యండి కావలిస్తే. ఎవరూ అక్కడ్నుంచి తప్పిపోయి రాలేదు. అంతా భద్రంగాఉంది అక్కడ. ఉన్నిథన్ నా లాంగ్ లాస్ట్ ఫ్రెండ్. మీ కళ్ళల్లో పెంచుతున్నవి అల్ఫెషన్లా. దేల్మేషన్లా. దేకొషుండ్లా !"

తిరిగి వచ్చేశాను టేబుల్ దగ్గరకి - జవాబెందుకు నాకూ ?

నిటారుగా, నీటుగా నిలబడ్డ కొబ్బరిచెట్ల దారులో. తిక్కగా. సినికల్ గా. పంక్చుయేషన్ మార్కులన్నీ ఒకేచోట జలిమిలి అయిపోయినట్లు. ఎనిమిది వంకర్లతో పెరిగే యింట్రోవర్ట్ కొబ్బరిచెట్టులానిలబడున్నాడు ఉన్నిథన్ గోడ నానుకుని.

"సెమికోలన్. ఎక్స్ క్లమేషన్ మార్కులూ విడదీసి. ఇక్కడకు వస్తావా ఉన్నీ." వచ్చాడు. "మూడోకప్ తీసుకురా, ప్లీజ్."

ఒక్కొక్కమార్కూ అలా నేలమీద జల్లుతూ వెళ్ళేడు లోపలికి హెమింగ్ వే వాక్యంలాగ - నీట్ గా. బ్రిస్క్ గా. ఓవర్ టోన్స్ ఏవీ లేకుండా.

భగవంతం వస్తుంటే ఏక్సిడెంటేదేనా అయి ఎముకలేవేనా విరిగి....?

పసితనపు నూనూగుకి. పెద్దతనపు గడుసుతనం. చలాకీకి మధ్య తటపటాయిస్తున్న నలుగురిస్టూడెంట్ల గేంగ్ వచ్చింది లోపలికి తుప్పుకుంటూ.

టేబుల్ చుట్టూ చదరంగా వుంచినకుర్చీ లనిరకరకాల కోణాల్లోకి తిప్పి. జారబడుతూ కాళ్ళు మెలికలుగా తిప్పుతూ. జాపుతూ కూర్చున్నారు.

ఉన్నిథన్ మూడో కాఫీ తెచ్చాడు. కాఫీ ! అది కాఫీకాదు. ఉత్త వేడిరంగు గోధుమ ఊహ.

....బెంజి గాడేఁవిటి చెప్పేడురా ఇవాళ?

....సరస్వతిలో టోపీ కర్టిస్. ఎలిజబెత్ టేలర్....

సుజాత అలాగ పతివ్రతలాగ క్లాసులో కూర్చుంటుందిగాని దానికి ఇద్దరు లవర్సురా బాబూ....

....ఉత్త డుస్కీ మాటలాడకోయ్....

భగవంతం రాడు గాబోలు. పది లెక్ఖ పెట్టి లేచాను. పైకివెళ్తూ. యీపై మాటల దగ్గర ఆగి అన్నాను విషాద స్వరంలో: అన్నీ కలిపేయండి. ఒకదానికొకటి గొలుసు లాగ కలిపి ఆలోచించండి. అర్థమయిపోతుంది. ఆతరువాత అంతా సులభమే.


కౌంటర్ దగ్గరచేరి. "మూడే తాగేను. నాలుక్కిచ్చేను. అదే లోకన్యాయం. మిగతాది పర్గటోరియోలో మనమిద్దరం కలుసుకున్నపుడు యిద్దురుగాని. టైంలేదు. ఉన్నిథన్ కి కూడా చెప్పండి. బై. బై." అని పైకి వచ్చేశాను.

ఆకాశంలో నక్షత్రపుజల్లు. భగవంతం రాడు. అట్నుంచి ఏడోనంబర్లోనూ రాడు. ఇట్నుంచి పదమూడో నంబర్లోనూ రాడు. నా పిచ్చిగాని. □□□

జ్యోతి

శ్రీశ్రీ పంచపదులు

ప్రపంచ తంత్రం



వహావ్వాళ్లో కొంత మంది కాకా
రాయుళ్లున్నారు వాళ్ళు బాకా
బాగా పడతారు కాని అదంతా కా
వలిసింది సాధించుకొనేదాకా
ఆమీద ఇస్తారు ధోకా

గురులఘువులు



మహా మహా
కవులు సహా
రా యెడారి దారుల్లో విహా
రాలు చేస్తున్నా రహా
తమ శిష్యుల్తో సహా

ఉభయశ్రీ

"రెండు శ్రీలు ధరించి
రెండు పెగ్సు బిగించి
వరలు శబ్ద విరించి"
అనుచు మీసెను ద్దంచి
అరుద్ర కవితా విపంచి




శ్రీశ్రీ పంచపదులు

మెదళ్ళకి కళ్ళు



ఆలోచించడం
అంటే ఊకని దంచడం
కాదు ఊహని పెంచడం
వ్యథల్ని చించడం
సుధల్ని పంచడం

ప్రాసోపదేశం



అసమర్థుడి చేతిలో ఆసొనెన్సు
అందించదు సరిగ్గా రిసొనెన్సు
దానికి కావాలెంతో విజిలెన్సు
అందుకే ఛందోరహస్యం తెలిసిన వెటరన్సు
స్ట్రెయిట్ రైమ్‌కే ఇస్తారు ప్రిఫరెన్సు

అల్లసానిజం



ఆరోజుల్లో కవిత్వం
నిరుపహతి స్థలం
కప్పుర విడెం భోజనం
ఊయెలమంచం రసజ్ఞ పాఠకలోకం
దొరికితేనే శక్యం

శ్రీశ్రీ పంచపదులు



R. I. P. for a V. I. P.

అమెరికా ప్రెసిడెంటుకి కూడ
రక్షణ లేదోరి బుల్లోడ
నీయిల్లు ఒక చిల్లి ఓడ
నీ స్వేచ్ఛ సుడిగాలి మేడ
వదిలించుకో ఇంక ద్వేషాల పీడ

నో పార్కింగ్



జో
రుగా పో
వగానే సరికాదురో
సిసలైన అసలైన గమ్యంతో
సూటైన బాటనే గో



Tale with a tail

అనగా అనగా ఒక దొరగారు
ఊళ్ళన్నీ కాళ్ళరిగేట్టు తిరిగారు
ఎండల్లో ఎండి వానల్లో తడిశారు
ప్రస్తుతం వారు కాసుకైనా కొరగారు
అంచేత కొంచెం లెఫ్టుకి జరిగారు

గద్యపద్యచింతామణి




పద్యం
ఎక్కువా లేక గద్యం
ఎక్కువా అనే సమస్య అభేద్యం
ఐనా ఘంటా వాద్యం
గా నేనంటానీరెండూ నాకే నైవేద్యం



ఏ యెండ కా కొడుకు

కుక్కగొడుగు పార్టీల అభిప్రాయాలు
కూడా కావాలి చర్చనీయాలు
అందుకే ఈనాడు రాజకీయాలు
అందరికీ ఉపాదేయాలు
అప్పుడే తేలుతాయి న్యాయాన్యాయాలు



కవిత్వం

ఏనాటికైనా డబ్బు
అదోరకం అబ్బు
రంపు వెధవ జబ్బు
ఉండదా దాన్ని కుదిర్చే మెడిసినల్ సబ్బు
చెండదా దాన్ని కవిగారి కలం నిబ్బు



Slow గన్లు

వింటే తెలుగు భారతమే వినాలి
తింటే పెరుగు గారెలే తినాలి
అంటే అంతా మెచ్చేదే అనాలి
కంటే చెక్కికలలే కనాలి
కొంటే జ్యోతి పత్రికనే కొనాలి



అగ్నిపుష్పం

కళ్యాణ సుందరీ జగన్నాథ్

ఉదయాన్నే సన్నాహాలన్నీ ఆరంభమైనాయి. ఆహ్వానించిన వాళ్ళంతా నెమ్మదిగావచ్చి చేరుతున్నారు.

శివరావుకి మట్టుకి ఏదో వెలితిగానేవుంది. సుభద్రక్కా, అంకయ్యబావ ఇంకా రాలేదు.

ఇందిర ఎప్పటికంటె ఇంకా ముభావం గానే వుంది. ఇంతవరకూ గొల్లెలాగుండే శివరావు ఈవేళ పాపకేం పేరెడతాడో చెప్పడంలేదు. అతని కాపట్టుదల ఉండడం ఆవిడకి అర్థంకాలేదు.

ఆవిడ పట్టుదల స్వభావం విషయం మాత్రం శివరావుకి తనపెళ్ళి అయిన కొద్ది రోజుల్లోనే తెలిసింది.

పెళ్ళికొచ్చిన వారంతా ఎక్కడి వాళ్ళక్కడికి వెళ్ళిపోయాక, కొన్నాళ్ళపాటు ఇల్లుదిద్ది, క్రొత్త కోడలికి కాస్త అలవాటయ్యేవరకూ ఉండి మరీ పోదామని, సుభద్రక్కా అంకయ్యగారూ వుండిపోయారు. ఇందిర తండ్రి కృష్ణమూర్తి గారు, దూరదేశం కలకత్తా తిరిగివెళ్ళిపోవాలిగదా అని, సెలవుకాస్త పొడిగించుకుని మరీవుండిపోయారు. ఇహను వీళ్ళంతా వెళ్ళటం దగ్గర బడ్డ ఒకరోజున సుభద్రక్క అందరికీ కాఫీలూ ఫలహారాలూ వడ్డిస్తూంది. ఇందిర మట్టుకు, తన ప్లేటులో ఫలహారం తినకుండా చేత్తో కెలికి కెలికి పడేసుకుంటూంది. ఇది గమనిస్తున్న శివరావు, "దానికా ఫలహారం సాయించక పోతే మరేం కావాలో అడిగి మరీ చెయ్యక పోయావా అక్కా." అన్నాడు సుభద్రతో. ఇందిర వెంటనే ముఖం ముడుచుకుని ఫలహారం వదిలిపెట్టి విసురుగా వెళ్ళి చెయ్యి కడుక్కుంది.

"నీవు నోరువిప్పి చెప్పకపోతే ఎల్లా తెలుస్తుందమ్మా ఇందిరా, మాకు ?" అంది సుభద్ర.

అసలా మనస్సులో ఏమేమి ఊహలున్నాయో తెలుసుకోడం ఎలా చెప్మా అనుకున్నాడు అంకయ్య.

కృష్ణమూర్తిగారు మాత్రం, సంతృప్తిగా చిరునవ్వుతో "అసలు మా అమ్మాయి ఎవ్వరు ఏది చెప్పినా వినదుగా. దానికే తోచాలి. అప్పుడు చేస్తుంది. దానికి బుద్ధి పుడితేనే మాటలయినా ఆడుతుంది. ఏది వద్దన్నామో తప్పకుండా అదనే చేస్తుంది." అన్నాడు "ఇంతెందుకు ? దాని చిన్నప్పుడు, వాళ్ళవ్వగారు బ్రతికివున్న రోజుల్లో, పల్లెటూళ్ళో, ఆడుకుంటూ, ఆడుకుంటూ, క్రింద పడివున్న పెద్ద, ఎర్రటి ఎద్దుమెడ పూస ఒకటి ముక్కులో పెట్టుకుంటూందిట. ఆపూస జారిక్రింద పడిపోతూందిట. వాళ్ళవ్వగారు దూరాన్నించీ చూచి "ఒసేవ్ ఒక్కటి గుద్దుతాను ఆ పూసక్రిందపడెయ్యి. చస్తావ్ !" అని అరచిందట, అంతే ; ఇహ నాపూసని క్రిందపడనివ్వకుండా ముక్కులో పెట్టుకుని లోపలికి తోసుకుంటూందిట. ఆవిడ మళ్లా అరిచింది. దూరాన్ని పనిచేసుకుంటూ. అరిచినకొద్దీ పూసని ఇంకా లోవలికి తోసిందిట, ఇది. ఆవిడపరిగెత్తుకుంటూ వచ్చి అన్నంతపనీచేసిందట. అంటే తల మీద నాలుగుగుద్ది, దీన్ని తుమ్మించి, ఆ పూసని బలాత్కారంగా బయటికి లాగేసిందట." అన్నారు.

ఒక్కక్షణం ఎవ్వరూ మాట్లాడలేదు. సుభద్ర మాత్రం బాధగా "ఏమిపని అమ్మాయ్ అది ? ఇంకా నయం, ఆ పూస అల్లాగే ముక్కుచివరంటా వెళ్ళిపోతే ; ఆపరేషన్ చేయించాల్సివచ్చును. ఇంత చక్కగా వున్న ఈముక్కూ ముఖమూ చెడిపోనుగదా.

అల్లాంటిపనులు తప్పమ్మా" అంది. "తల్లిలేని గారాబం పెంపకం" అన్నారు సుబ్రహ్మణ్యంగారు, శివరావు తండ్రి— మాట సర్దుతూ.

కాని, సుబ్రహ్మణ్యం గారికి లోపల మాత్రం ఒకప్రక్క బాధగానే వుంటూంది పెళ్ళిలోనుంచే. గొప్ప ఇంటిసంబంధమనీ, బాలాఏళ్ళక్రితమే, వ్యాపారవిషయంలో కృష్ణమూర్తిగారి సహాయం కావలసి, సంబంధం మాట ఇచ్చినందువల్లనూ కోరిచేశాడు ఈ పెళ్ళి. అయినా, కాళ్ళకి మ్రొక్కమంటే, పెళ్ళికూతురు మ్రొక్కలేదు. నించునే వుండిపోయింది. వంగనే లేదు. పెద్దలూ పేరంటాళ్ళూ ముఖముఖాలు చూచుకున్నారు. మామగారి ముఖం చిన్నబోయింది. ఎవర్ని ఏమంటే ఏం లాభం ? చేసుకున్నమ్మకి చేసుకున్నంత అనుకున్నారందరూ.

సరి, అది ఆనాటి మాట.

ఇప్పుడు ఈ శుభకార్యం నడవాలే. అక్కా బావ దగ్గరలేకుండా, తనకూతురికి నామకరణం చెయ్యబుద్ధి కావటంలేదు, శివరావుకి. కాని చెయ్యాలి.

మధ్యాహ్నం తిరిగేటప్పటికి పాపకి పేరెట్టేశారు. వచ్చినవాళ్ళంతా శుభం అని వెళ్ళారు.

తరువాత శివరావు వచ్చేపోయే బండ్లు చూస్తూ గోడకి జారగిలబడి బయటరుగు మీద కూచున్నాడు.

శుభమూ అశుభమూకూడా, సుభద్రక్క అంకయ్యబావా లేకుండా ఈ ఇంట ఎన్నడూ జరగలేదు. ఆఖరుకి, మనస్సు నిలవక వాళ్ళకోసం నిన్నసాయింత్రం ఒక



తాను నిన్న జోస్యం చెప్పిన దేదీ ఇవాళ ఎందుకు జరగలేదో రేపు తెలుసుకో గలిగినవాడే రాజకీయ వేత్త.

తంతి ఇచ్చేశాడు శివరావు. సావకాశంగా ఉత్తరంవ్రాసి ఉన్నట్టయితే వాళ్లెప్పుడో వచ్చివుందురు. అంతా వాళ్ళచేతులమీదనే అవును. అయితే వ్రాయడంపడలే. వ్రాసే పరిస్థితులూ కాకపోయినాయి. ఇన్నాళ్ళూ వాళ్ళకి వ్రాయకుండా వుండడం తప్పే ! కాని దానికి కారణం ? లేకపోలేదు.

ఎంత గాథ వుంది.

పెళ్ళికివచ్చిన సుభద్ర వెళ్ళేటప్పుడు "ఒరేయ్, మావూరు నీకేదైనా పని తగిలితే ఇద్దరూ రండిరా. మాదగ్గర ఓ నాలుగు రోజులు వుండివస్తురుగాని" అంది. ఆమాటకి ఇందిర ఎవ్వరూ లేనపుడు "మీ అక్క పిల్చారుగా. ఇంక మేమెందుకు ? వెళ్ళరాదూ. నెత్తినిపెట్టుకుని చూస్తారు" అంది శివరావును, దెప్పిపొడుస్తూ.

కొన్నాళ్ళయ్యాక, శివరావు "ఇదిగో ఇందిరా, నా పెళ్ళికి ఎంతోమంది నా స్నేహి

తులు సదంపతులుగా వచ్చారు. వాళ్ళల్లో కొంతమంది కొద్దోగొప్పో చదువుకున్నవాళ్లే అవును. ఆనాడు నిన్నెంతో కలుపుగోలు తనంగా చూచారు. నువ్వే మాట్లాడలేదుగాని; అంటే నీకు క్రొత్తగదూ మరి. అంచేత నువ్వూ వాళ్ళతో కలవలేక పోయావులే. అయినా నీమీద ఎంత ప్రేమో చూడువాళ్లకి. ఎన్నెన్నో బహుమతులిచ్చారో నీకున్నూ" అంటూంటేనే మధ్యనందుకుని "మేమిమ్మన్నామా? మేమేమంత లేనివాళ్ళం కాదులెండి." అంది తిరస్కారంగా. శివరావు ఖిన్నుడైపోయాడు. అయినా నిభాయించుకుని "అదికాదు, ఇందిరా. మనం తిరిగి మర్యాదకి వాళ్ళిళ్ళకి వెళ్ళి చూడాలిగా. అందుకని. బట్టలు కట్టుకో. ఇద్దరమూ వెళదాం రేపు ఆదివారం" అన్నాడు.

"మేమేమీ చదువుకున్నవాళ్ళం కాము. సింగారించుకుని. మొగాళ్లతో బుజాలుతగుల్చుకుంటూ ఊరేగడానికి. నేనురాను" అంటూ కూచున్నచోటునించీ లేచిపోయింది. శివరావు మనస్సు క్రుంగిపోయింది. ఏ కొరతా లేకుండా, ఏ బాధా తగలకుండా, బాధ్యతాయుతంగా భార్యని చూచుకుందామంటే. ఎప్పటికప్పుడు ఎదురుదెబ్బలే తగుల్తూన్నాయి.

"నీకేమన్నా ఇది మూర్ఖమా? లేక ప్రపంచంలో ఎవరన్నా గిట్టదా?" ఈప్రశ్న పైకి అనే ధైర్యం లేకపోయిందతనికి.

అయితే అమ్మలక్కలు కొంతమంది మాత్రం "ఆపెళ్ళిలో ఏదో గర్వమనుకున్నాంగాని సిగ్గలేపుంది. గిళ్ళమన్న మాట వినిపిస్తోందేమో చూశావూ, సుబ్రహ్మణ్యంగారింట్లోనుంచీ. నోట్లో నాలికలేదుగదా వాళ్ళ కోడలికి. నల్లవనదు తెల్లననదు. తన ఇల్లేమో తానేమో. మనకీ వున్నారుగా కోడళ్ళు. వాళ్ళ వికవికలూ పకపకలూ! వాళ్ళగందరగోళమే వాళ్ళది. ఊఁ అంటే కయ్యానికి కాలుదువ్వుతారు". అనుకుంటూండే వాళ్ళు.


ఒకనాడు శివరావు "నాన్నగారికి ఎప్పుడెప్పుడు ఏమేమికావాలో అందిస్తూండు సుమా, మందులూ అవీ సరిగ్గా ఇయ్యి" అన్నాడు ఆఫీసు కెళ్ళుతూ.

"మీకూ మీవాళ్ళకీ పనిమనిషికావాలని పెళ్లాడారని నాకు తెలియదు" అంది ముఖం ముడుచుకుని, ఇందిర.

దీనితో గొత్తె కరచినవాడిలా ఆశ్చర్యపడ్డాడు శివరావు. తన ఆర్థికస్థితిఅంతా తెలిసేగా పెళ్ళిచేశారు. మరుగుఏమీలేదే.

ఆ రోజంతా అతనికి ఆఫీసులో పని తోచలేదు, సాయంత్రం ఇంటికి రాబుద్ధి కాలేదు వెంటనే. మనస్సు శాంతి కోసం అల్లాడుతూంది. కాళ్ళ, అప్రయత్నంగా. చిన్నతనంపించీ, తల్లిపోయిన తరువాతా, కాలేజీ సెలవులకి వచ్చినప్పుడూ, ఒంటరిగా కాసేపు ప్రశాంతిగాగడిపే కాలవ ఒడ్డుకి, ఈడ్చుకొచ్చినాయి. అక్కడ గడ్డి మీద చతికిలబడ్డాడు. చుట్టూ పచ్చటి పొలాలూ, అక్కడక్కడాగట్టుమీద చెట్లూ, కనుచూపుమేర చుట్టూ అంతా నిశ్శబ్దం. తన శ్వాస తనకే వినిపిస్తోంది.

నిట్టూరుస్తూ తనముందర కాలవకేసి చూస్తూ వుండిపోయాడు. ఇది మంచి నీటి కాలవ. కాస్తపైగా ఎర్రకాలువ దీనితో కలిసింది. రెండు కాలువలూ కలసి ఒకటిగా ప్రవహిస్తోంది. అందువల్లనే కాబోలు ఈ



కాలువ పొడుగునా, ఒక ప్రక్క ఒక రంగూ రెండోప్రక్క మరో రంగుతో, కాలువమధ్య గీత గీసినట్టూ, రెండు రంగులతో నీళ్ళు కలవకుండానే. వేరు వేరుగా ఒకే కాలువగా ప్రవహిస్తూన్నాయి. ఇల్లా ఎక్కడికో వెళ్ళిపోతూంది ఈ కాలువ. తన జీవితమూ అంతేననిపించింది, శివరావుకి. అసలే శూన్యమైన తన చీకటి బ్రతుకులో క్రొత్తబరువుల భారం కనిపించింది. దానితో తన శరీరమే మొయ్యలేని బరువుగా తోచింది. నిస్సారంగా ఆకాశంకేసి చూస్తూ, తలక్రింద రెండు చేతులూ ముడుచుకుని, వెల్లికిలగా గడ్డిమీద పడుకున్నాడు.

సరిగా ఇదే తీరుగా, ఒక సంవత్సరం క్రితం, తను ఉద్యోగం చేస్తున్న ఊళ్ళో, చిన్న మిద్దెమీద పడుకున్న రాత్రి జ్ఞాపకం వచ్చిందతనికి.

ఎన్ని ఆశలతో ఆ మిద్దెయిల్లు బాడిగకి తీసుకున్నాడో, ఉద్యోగం అవంగానే. ఇప్పుడా ఇంట్లో ఒంటరిగా కాలం వెళ్ళబుచ్చుకుంటున్నాడు. నిద్ర పట్టడంలేదు. నుదిటిమీద చెయ్యి చాచుకుని, ఆలోచనగా, పైకి ఆకాశంకేసి చూస్తూ పండుకున్నాడు. పైన చిన్న లేతమబ్బులు అక్కడక్కడా అలుముకున్నాయి. భోజనం సయించలేదు ఈవేళ మరీని. కాని కడుపులో ఆకలి తెలియటంలేదు. చుట్టూ ప్రపంచమంతా నిద్రలో పండుకుంది. ఆకాశంమీద, లేత వెలిమబ్బు క్రింద, ఒకే ఒక తెల్లటికొంగ, ఒంటరిగా బేక్‌బేక్ మని అరుచుకుంటూ, స్వస్థలానికి ఎగిరిపోతూంది— జపానువారి లేత రంగుల చిత్రం స్ఫురణకితెస్తూ.

పాపం! ఆకొంగ ఏమటి వుంటుంది. తన బృందం అంతా ముందరే వెళ్ళిపోయారు గావును. ఇది ఒంటరిగా వెళుతోంది అనుకున్నాడు శివరావు. ఏం? అక్కడికి

వెళ్ళకపోతే. ఉన్నచోటే ఉండిపోకూడదూ ఆ కొంగ. ఇంతరాత్రిఐన్లా కూడా ఏదో గూడూ పిల్లాజల్లా. తనబృందం కావాలల్లే వుంది. అందుకే ఏదో పడిపోయినట్టూ పోతూంది.

నాన్నగారి ఉత్తరమూ, దాన్ని వెన్నాడుతూ వచ్చిన టెలిగ్రామూ కళ్ళముందు కొచ్చినాయి. ఆయనని కష్టపెట్టడమెందుకు? అవును. ఆయనని కష్టపెట్టి తను సాధించేదేముంది గనుకను? ఇంతకీ నాన్నగారు బాధ పడేస్థితిలో వున్నారా? ఈమధ్య ఆరోగ్యం బాగా క్షీణించి పోతూందాయె. ఆర్థికంగానూ ఇటీవల దెబ్బతింది. తనని కనిపెట్టుకుని ఉండడానికీ, సంసారం దిద్దడానికీ ఒక దిక్కవసరమేగా! తను ఒక్కడేగా ఆ వృద్ధుడికి అండ. తనా ఉద్యోగం చెయ్యవలసిన అవసరం వచ్చె. ఆడ దిక్కవసరం. పవిత్ర ప్రేమకి తాను నోచుకోలేదు. జీవితాన్ని ముంచెత్తిన మధుర స్మృతికి ద్రోహం చెయ్యగలడా? తను నిర్జీవ జీవితం గడపాలి. ఎవ్వరికోరకు? "ప్రేమలో త్యాగం ఉండాలి, త్యాగంలేని ప్రేమ స్వలాభమే అవుతుంది బావా". ఆ దివ్య వాక్కులు, ఇంకా వినబడుతూనే ఉన్నాయి, ఆకాశవాణిలా. త్యాగం చెయ్యనా? చేస్తా. నాన్నగారికోసం. సరే. రేపే బయలుదేరతా. ఆ పెళ్ళికూతురు ఎవ్వరో ఏమో! ఎవ్వరయితే ఏం? ఏరాయి అయినా ఒకటే పళ్ళూడగొట్టుకోడానికి.

ఆ జ్ఞాపకాలన్నీ దిగమింగి కాలువ ఒడ్డు నించీ సందెదీపాలవేళకి ఇల్లు చేరుకున్నాడు శివరావు.

రోజులు గడుస్తున్నాయి.

ఒకనాడు ఇంటికొచ్చేసరికి, సుభద్రక్క నుంచీ ఉత్తరం వచ్చింది. ఎవ్వరో, అతని కంటే ముందే అది చించి చదివారు. ఇందిరకి ఏడవమాసం రాగానే, తనువచ్చి శాయశక్తులా తోడ్పడతానని వ్రాసింది, అక్కగారు.

శివరావు కళ్లు చెమ్మగిల్లినాయి. అక్క దేవతలలో ఎన్నుకోదగినది. అవునుపాపం. ఇందిరకి తల్లిలేదుగా. తల్లిలా సుభద్ర అండగావుంది. ఇందిర అదృష్టవంతురాలు. తనూ భార్యని తల్లిలేనికొరతలేకుండా చూచుకోవాలని నిశ్చయించుకున్నాడు.

ఉత్తరం చేతపట్టుకుని, ఇందిరవద్దకొచ్చి "ఈ ఉత్తరం చదివేవుంటావుగా, ఇందిరా. అక్కని రమ్మని వ్రాద్దామా మరి. నీవే వ్రాయి" అన్నాడు శివరావు. మారుమాటాడకుండా, నించున్నచోటనించీ గిరుక్కున వెనక్కి తిరిగి, చరచరా వెళ్ళిపోయింది ఇందిర. శివరావు నోటనూట రాలేదు. వెనక్కి తిరిగి, తన గదిలోకి వెళ్ళిపోయాడు.

ఇందిర, తాను వివాహమాడిన భార్య. దానిని ప్రేమించకుండా వుండడానికి తనకి హక్కులేదు. పెండ్లాడకనేవుండాలి. పెండ్లాడిన తరువాత ప్రేమించి తీరాలి. ఇందిరని ప్రేమించడానికి ప్రయత్నించి ప్రేమిస్తూనే ఉన్నాడు. లేదనడానికి వీలులేదు కాని అది వేరు. తనువుమరచి నిట్టూర్చినప్పుడు, కళ్ళనిండా నీళ్ళు తొణికిసలాడినపుడు, గొంతుకలో ఏదో స్తంభించిపోయి గుండె గబగబా కొట్టుకున్నప్పుడు, హృదయాంతరాళాలలో, తీర్చి చెప్పలేని, ఒకనిండు

పొంగు, ఆదేదో, అది మాత్రంకాదు. అది పిలుపు కందని ఆ దివ్యమూర్తికే చెందినది. ఆ పిల్లని తల్చుకున్నప్పుడే ఆ అనుభూతి: ఆ ప్రేమకి అతను దాసుడు. దానికీ తన ఈ నిత్యజీవితానికీ సంబంధంలేదు.

ఆ మరునాటి ఉదయాన్న శివరావు బయట కొచ్చేసరికి, వెనక వసారాలో కుంపటి వెలిగిస్తోంది ఇందిర — అతి నిర్లక్ష్యంగా. శివరావుకి గాభరా అయిపోయింది. "అదే! అరెరే! నీకుగాదూ, చెప్పేది? ఎన్నిసార్లు చెప్పను? నిప్పు! నిప్పు భద్రం అన్నానా? ఎన్నిసార్లు? బుద్ధి ఉండాలి!" అసలే పల్చటి చీరలాయె! అయ్యో! దేముడా!" అని కోపంగా, కొట్టొచ్చినట్టూ, గాభరాగా అన్నాడు.

ఇందిరకి ఈ ధోరణి అర్థంకాలేదు. మరీ ఒళ్ళు మండుకొచ్చింది.

"ఏం. పల్చని చీరలు చదువుకున్నవాళ్ళే గాని మాలాంటి మోటుగొడ్లుకట్టుకోకూడదా? మా జాగ్రత మాకు తెలుసు. మీరు మాకు చిన్నపిల్లలకి చెప్పినట్టూ ఏం చెప్పనక్కర్లే" అంది ఈసడింపుగా. శివరావు ముఖం చిన్నపుచ్చుకున్నాడు.

కాస్సేపయ్యాక, కాఫీ తీసుకుని గదిలోకి వెళ్ళింది. శివరావు గదిమధ్య నించుని వున్నాడు, అటు తిరిగి - ఎదురుంగా గోడ నానుకుని వున్న మేజామీదనించీ, గోడకేసి చూస్తూ. ఇందిర మాట్లాడకుండా కాఫీ టేబిలుమీదపెట్టి వస్తూ, అటుగోడప్రక్కగా చూచింది. మేజా ప్రక్కనున్న కిటికీలోనూ ఎవ్వరూ లేరు. గోడమీద టేబిలుకి పైగా ఒక కాలేజీగ్రూప్ ఫొటో తప్ప ఇందిర మనస్సులో ఏబాధా ఏ ఆలోచనా సోకలేదు.



ఒక ఎం. ఎల్. ఏ. గారు ఆరేళ్ళ కొడుకును వెంటబెట్టుకొని బజారు కెళ్ళారు. దుకాణంలో కొనవలసిన వన్నీ కొన్నాక కొట్టువాడు "అబ్బాయి! ఒక పిడికెడు బఠానీలు తీసుకో!" అని కొసరు ఇవ్వబోయాడు. కుర్రాడు 'వద్దు' అని నిరాకరించాడు. "ఫరవా లేదు, తిను బాబూ ఇంద" అని కొట్టువాడే బఠానీలు తీసుకొని కుర్రాడి జేబులో పోశాడు. కుర్రాడు మాట్లాడకుండా పుచ్చుకున్నాడు.

దార్లో "ముందు ఎందు కొద్దన్నావ్?" అని రాజకీయ వేత్త కొడుకుని ప్రశ్నించాడు.

"నాచెయ్యికన్నా వాడిచెయ్యి పెద్దది కదా?" అని చిన్నవాడి పెద్ద కబురు.

కాని, జీవితం ఒక్కొక్కసారి దుర్భరం అని పిస్తోంది. శివరావుకి, ఎన్నాళ్ళో ఎక్కడికో, ఈ తుదిలేని జీవితయాత్ర. ఏదో గతజన్మలో జరిగినట్టున్నది. తను విన్న స్వరమూ, తనుచూచిన చేష్టలూ, దీవెనలా

తనమీదవాలిన చూపూ. అబ్బ! అనుక్షణమూ తన చుట్టూవున్నాయి, ఆస్ఫురణలు. తనలోనే వున్నాయి. తానే ఆ స్ఫురణ. తాను వేరేలేడు.

మరోనాడు తనగదికిటికీలోనించీ, చూస్తూ నిలబడ్డాడు శివరావు— పెరట్లోకి. ఎదురుంగా పెరట్లో, చుట్టూ వెదురుబద్దలుపాతి గూడులాగు కట్టిన, గులాబీపూలచెట్టుకి, చుట్టూవున్న బద్దలన్నీ తీసేసి, చెట్టుక్రింద వాటంతటవ్వే రాలిపడివుండే, ఎర్రగులాబీపూల రేకులన్నీ, శుభ్రంగా తుడిచిపారేశారు ఎవ్వరో. చెట్టుదావురో మంటోంది. శివరావుకి ఒళ్లంతా చెమట్లు పోసినట్లయింది. ఆది అతని ఆరాధ్యదైవం అతనికిచ్చిన ఎర్ర "డామస్క్" గులాబీచెట్టు. అప్పటినించీ తన కూడానేవుంది అది. ఆచెట్టు దగ్గరకి ఎవ్వరూ వెళ్లకుండా ఆచెట్టుని ఎవ్వరూ అంటుకోకుండా ఆ పువ్వులు ఎవ్వరూకొయ్యకుండా ఉండేటందుకే అంత బందోబస్తు చేశాడు.

ఒక్క అడుగులో పెరట్లోకి వచ్చాడు శివరావు. నూతిదగ్గర బట్టలుతుకుతూన్న పనిమనిషిని "ఎవరు ఈ పనిచేశారు? ఆ చెట్టు దగ్గిరికి ఎవ్వరూ వెళ్ళకూడదని నేనెన్నిసార్లుచెప్పాను. ఏం చెప్పు. ఎందుకా పువ్వులన్నీతుడిచిపారేశావు?" అని గబగబా గట్టిగా అరిచాడు. "ఆ ఎదురుబద్దలన్నీ స్థలం మింగేస్తావుండాయని, ఆ చెట్టుకుట్టూ పువ్వులూ ఆకులూ రాలి అడివిలా గుండాది శుబ్బరంగా తుడిశెయ్యిమని అమ్మగారు శెప్పారుండి. ఆమెకి శుబ్బరం లేకపోతే శానా శికాకుపడతారుగదయ్యా. అందుకని." అన్నది భయంగా, పనిమనిషి.

శివరావు కాళ్ళీడ్చుకుంటూ, తనగదిలోకి వచ్చి, మేజావద్ద కుర్చీలో కూలబడ్డాడు. కరుడుగట్టుకుపోయిన స్మృతులన్నీ, ఒక్కసారి దేవుడిముందువేసిన పరిమళధూపాలలా పైకి లేచినాయి.

ఎన్నిసార్లు ఎంత ఆప్యాయంగా తన పెట్టె సర్దిపెట్టేది ఆ ప్రేమమూర్తి. హాస్టలు నించీ ఈ ఊరు వచ్చేటప్పుడూ తిరిగి హాస్టలుకి వెళ్ళేటప్పుడూ తను వాళ్ళింట్లో మకాం లేకుండా వచ్చేవాడేగాదు. కాలేజీలో రోజూ చూస్తూన్నా, తిరిగి సాయంత్రం, పుణ్యక్షేత్ర యాత్రలా వాళ్ళింటికి వెళ్ళేవాడు. ఆఖరిరోజుల్లో నాన్న ఒకసారి వాళ్ళింటి కొచ్చినపుడు, అనుమానం పడ్డట్టుగా వుంది. ఆపిల్లని వాళ్ళ వాళ్ళని ఏదో అన్నట్టుగా వుంది, తను దగ్గరలేనప్పుడు నాన్నగారు. ఆ తరువాతనే, ఆ దేవత శివరావుతో అన్నది "బావా, మేముబీదవాళ్ళం. మీ అంతస్తుకి తూగలేము. నేను మరెవ్వరినీ పెండ్లాడను. ఆడలేను. ఆతలపే అసహ్యం. నిన్నే తల్చుకుంటూ జీవితమంతా గడుపుతాను.మీ నాన్నగారికి మా సంబంధం ఇష్టం లేదు, ఆయన్ని కష్టపెట్టవద్దు. నీవు తప్ప ఎవ్వరూలేరు ఆయనకి. ఆయన ఇష్టం వచ్చిన సంబంధం నీవుసుఖంగా పెండ్లాడు, నీవు సుఖంగావుంటే నాకదేచాలు" అంది వెక్కివెక్కి ఏడుస్తూ. "నీవులేని బ్రతుకుకంటే చావడమేమేలు" అన్నాడు శివరావు ఖచ్చితంగా. "మృత్యువు మృతులకి కాదు బావా, దానిబాధ మిగిలివున్నవాళ్ళకే" అంది ఆ అమ్మాయి.

ఆనాడు నిశ్చయించాడు శివరావు, తన తండ్రిమీద ఆర్థికంగా ఆధారపడకూడదనీ, తను ప్రత్యేకంగా ఏదో ఒక ఉద్యోగంచేసుకుని, తండ్రి సమ్మతించకపోయినా, ఈ పిల్లదానిని పెండ్లాడితీరాలనీ.

ఆ ఉద్యోగంలో చేరడానికి ఊరువెళ్ళేటపుడు మళ్ళీ వాళ్ళింట్లో దిగాడు శివరావు. ఆనాడు ఇచ్చింది ఈ రోజాచెట్టు. అపుడు సరిగ్గా మూరెడు అంటు. బంగారుకలశం లాగా తొట్టిని ఆ వూరుచేర్చుకున్నాడు తనతో కూడా.

ఆలోచనలతో ఆశలతో కాలం గడుపుతున్నాడు శివరావు ఉద్యోగి అయి.

సంవత్సరం గడవవచ్చింది. పెద్ద తొట్టిలో, స్వయంగా నీళ్ళుపోస్తూ పెంచుతున్నాడు గులాబీ మొక్కని.

"ఎల్లుండి నాకు కాన్వకేషను బావా. చక్కని ఆశీర్వాదాలు పంపు" అని ఉత్తరం వచ్చిందతనికి. వరసకి తను బావ కాకపోయినా, ఆపిల్ల అతన్ని ఎప్పుడూ అల్లాగే పిలిచేది.

"ఉద్యోగం క్రొత్తది. నాకు సెలవుదొరకదు. నీకూ చదువు ఏదో పూర్తి అయింది గనుక, మీవాళ్ళనడిగి తొందరలోనే పెండ్లి నిశ్చయిస్తాను. నిన్ను రథంమీద పెట్టి తెచ్చుకుంటాను. నాన్న చచ్చినట్టూ ఒప్పుకోవలసిందే. లేకపోయినా ఇబ్బందిలేదు. నాకేదో కొద్ది జీతపురాళ్ళు వస్తూన్నాయిగా, పెళ్ళయ్యాక నాకంట్లోనించి నిన్ను మరుగు చేసుకోను ఇక ఎన్నడూ. ఇప్పుడు ఒక్కటే నాప్రార్థన. నీ విచ్చిన కానుక, తొలి పువ్వు పూసింది. రేపటికికూడా ఆరేకలు రాలకుండా వుండడానికి ఆ పువ్వుక్రింద వచ్చని ఆకుపెట్టి నుతారంగా అమిర్చాను. అది అట్టపెట్టెలో పెట్టి, నా స్నేహితుడు



ఆవూరు వస్తూంటే, అతనికిచ్చి పంపుతున్నాను, ఉత్తరమూ, పువ్వున్నూ" అని వ్రాశాడు బదులు.

ఆరాత్రి ఎన్నో ఆశలతోనూ, ఊహలతోనూ మరచి నిద్రపోయాడు, శివరావు.

ఆ అమ్మాయి, ఆ ఉత్తరమూ, ఆ ముదురు కుంకుమరంగు గులాబీపువ్వూ కళ్ళకద్దుకుని మేజామీద పెట్టుకుంది. పట్టలేని తృప్తీ సంతోషాలతో. సంతోషంగా ఈవేళ అమ్మకి నాన్నకీ స్వయంగా కాఫీచేసి, ఇద్దామని స్టౌవు వెలిగించింది.

అంతే అనుకోని సంగతి. భయంకరం, చెంగుకి నిప్పంటుకుంది పొరపాటున. ఎల్లాగంటుకుందీ తెలియదు. ఒక్కక్షణంలో హాస్పిటలుకి చేర్చారు. తల్లీదండ్రీ గగ్గోలు పెడుతూ.

టెలిగ్రాము అందగానే, తన తల ఎవ్వరో కొట్టేసినట్టయింది శివరావుకి. ఆ తరువాతది ఒక ప్రణయగాథ.



కొత్తగా విప్లవకవిత్వం వ్రాస్తున్న కవి కుమారు డొకడు తన పద్యాలను శ్రీ శ్రీ కి పంపించి "అయ్యా నా పద్యాలలో ఎక్కువగా నిప్పులు కక్కమంటూరా?" అని అడిగాడు. "అబ్బే! పద్యాలను నిప్పులను తారుమారు చేయండి" అని శ్రీశ్రీ సలహా ఇచ్చాడు.

రెండు మెట్లొక్కసారిగా ఎగిరి పైకొచ్చాడు శివరావు, ఆస్పత్రిలో, రోగి గదిలోనుంచి అప్పుడే బయటకొస్తున్న, వయస్సు మళ్ళిన డాక్టరు శివరావు భుజంమీద చెయ్యివేసి ఆపి, దగ్గరగా లాగుకుంటూ "అదృష్టహీనుడా! ఒకక్షణం ఆలస్యంగా వచ్చావు. ఇప్పుడే మతి ఆఖరుగా ఒక్కసారి వచ్చింది. నీకోసమే అల్లాడింది. నిన్నే మరీ మరీఅడిగింది. ఎవ్వరిదీ ద్రోహంలేదు. కావాలని ఎవ్వరూ హానిచెయ్య లేదు. ఎవరికి వాళ్ళం కావాలని కీడుచేసుకోంకదా! కాని సుఖంకోసం ఎంత ప్రాకులాడినా ఒక్కొక్కసారి దుఃఖం తప్పదు. పూర్వకర్మాను రూపం. ధైర్యంగా వుండు. ముఖం బాగానే వుంది.... తయారుచేసి నర్సుపిలుస్తుంది. నిన్నులోపలికి తీసుకివెళతా" అన్నాడు.

ఈ జ్ఞాపకాలతో శివరావు గుండెలు తల్లడిల్లినాయి. నిలువెల్లా వణికాడు.

మధ్యాహ్నం భోజనానికి, పిలవడానికి ఇందిర గదిలోకి వచ్చింది. ఆ అలికిడికి చటుక్కున వెనక్కి తిరిగాడు, శివరావు. అతని కళ్ళు ఎ ర్ర బ డి వాచివున్నాయి. ఇందిర చూచింది. ఆముఖం బాధకి కారణం ఏమీ తెలియలేదావిడకి. మేజామీద అతని కెదురుగా గోడకి తగిలించివున్న కాలేజీ పటం కంటపడింది. ఒక్కసారి దానికేసి చూసింది. నాలుగైదు వరసలు మగ విద్యార్థులూ, నించునీ, కూచునీ వున్నారు. క్రింద వరసలో కుర్చీలలో మధ్యన కూచుని అయిదుగురు ఆడపిల్లలున్నారు. ఈ పటానికి అర్థం ఏమిటో, ఆవిడకి అర్థంకాలేదు. ఆ పటంలో గుంపుని అంత ఆలోచనగా చూడడం దేనికి? తన కాలేజీ రోజులు అంత మధురమైనవా? ఏమిటో, ఆ పటాన్నిగాని, శివరావు మూగ బాధనిగాని, ఇందిర అంత పట్టించుకోలేదు.

ఇందిరకి ఏడవనెలవచ్చాక సుభద్ర ఉత్తరాలుదగ్గరదగ్గరగానే వస్తూన్నాయి. ఈసారి ఇందిర గట్టిగానే నోరుచేసుకుంది. "ఆవిడ సహాయం మాకేం అక్కర్లే. ఆసుపత్రిలో పురుడు పోసుకోగలను. ఆవిడ మీస్వంత అక్కేం కాదుగా. పెద్దతండ్రికూతురు మీద మీకింత ఆప్యాయత ఎందుకు?"

"నాకు ఆప్యాయత యెక్కువకాదు ఇందిరా. ఆవిడకే ఆపేక్ష యెక్కువ. నిన్ను ఇంతగా ప్రేమిస్తున్న అక్కని, కొంచెమైనా తిరిగి ప్రేమించలేవా!" అన్నాడు.

"ఏంప్రేమో! ప్రేమాచట్టుబండలున్నూ! ఏదో నవలలలో చెప్పినట్టూ. నా చేతగాదీ ప్రేమించటం ఏమిటో" అంది.

"తప్పు. ఇందిరా. నేను కాలేజీకి వెళ్ళేటప్పుడూ, ఆఖరుకి ఇంటికొచ్చేటప్పుడు కూడా, అరిసెలూ, లడ్డూలూ చేసి డబ్బాలలో వేసి చేతికిచ్చేది. తలంటిపోసి ఆదరణ చూపేది. అది తప్పు నాకెవ్వరూ లేరు ఇందిరా. ప్రేమించేవాళ్ళు వుండడం అదృష్టం. తల్లీ తోబుట్టువులూ లేని దరిద్రుడను నేను" అని గదిలోక్కి లోపలికివెళ్ళిపోయాడు.

సుభద్రకి, అతను జవాబేమీ ఇక వ్రాయ లేదు — ఆ తరువాత.

ప్రొద్దు వాటారిపోయింది, అక్కా బావా జాడలేదు.

సాయంత్రపు చీకట్లు క్రమ్ముతున్నాయి. శివరావు లేచి తనగదిలోకి నడిచాడు—పాపని చూడ్డానికి. పాపని లోపల మంచంమీద వేశారు. నిద్రపోతూంది.

అప్రయత్నంగా కిటికీలోనించీ పెరట్లోకి తన దృష్టి ప్రసరించింది. అచిమ్మ చీకటిలో కూడా పెరడు దిశగాకనిపించింది. ఒక్క అంగలో కిటికీదగ్గరగా వెళ్ళి, కళ్ళు నలుపుకుని మళ్ళా చూచాడు. లేదు. ఊహూ: నిజంగానే లేదు: భ్రమగాదు. ఎప్పుడూ ఎదురుగా, నిటారుగా వుండే ఎర్రగులాబీ చెట్టులేదు. లేనేలేదు!

చటుక్కున వెనక్కి తిరిగాడు. అప్పుడే వచ్చింది ఇందిర గదిలోకి.

"గులాబీచెట్టు లేదేం?" అన్నాడు గాబరాగా.



జపాను దేశస్తులు మర్యాదకు పెట్టింది పేరు. ఆ దేశపు ఒక సంపాదకుడు తనకు నచ్చని కథను తిరిగి పంపించేస్తూ వ్రాసినలేఖ: "అయ్యా! తమకథ వంటిది మరి నూరేళ్ళదాకా ఇంకెవరూ వ్రాయలేరు. తమ కథను ప్రచురించి, నూరేళ్ళదాకా మా పత్రికా ప్రచురణ ఆపుకొనడం ఇష్టంలేక ఇది పంపించి వేయడమైనది."

"లేదు. ఆ దిక్కుమాలిన చెట్టు మీద మీకెందుకు మమకారం?" అంది నిర్లక్ష్యంగా.

"ఆఁ." అన్నాడు శివరావు.

"ఆచెట్టు కొట్టించి పెంటకుప్పమీద వేయించాను. నేలంతా చదునుచేసి ఇసక పోయిస్తున్నాను. పాప ఎదిగిన తరువాత ఆడుకుంటుంది.

"నీవా! కొట్టించావా? ఎవర్నడిగి!"

"ఏం, ఆచెట్టువల్ల ఏం లాభం? ఇదిగో ఆఖరిని ఒక్కపువ్వుంటే కోసుకొచ్చాను"

అని ముక్తసరిగా అంటూ, తనవెనక నడుంమీద ముడుచుకున్న చేతులు,ముందుకు తీసి, చేతిలోవున్న పువ్వును చూపించింది.

ఇంతవరకూ మతిబోయిన వాడిలా, ఇందిర ముఖం చూస్తూ నిలబడ్డ శివరావుకి మతి వచ్చింది. ఆఖరుసారి పువ్వుని ఇంతదగ్గరగా చూచింది ఎప్పుడు ? ఈ పరిమళం తన వావరించిందెపుడు ? ఇప్పుడీ చేతుల్లోనా ? అనాడు. అవును అనాడు తన ఆరాధ్య దేవతకి అంతిమ అలంకారంగా, నల్లటి జుట్టులో ఈ రక్తవర్ణపు పువ్వు అమర్చాడు. అదే కడసారి చూపు.

శివరావు పిచ్చివాడిలా బయటికి దూకి వెళ్ళిపోయాడు ఆ గదిలోనించీ.

ఇందిరకి అర్థంలేని ఆవేశం వచ్చింది. అలాగే నిలబడివుంది.

అప్పుడే బండిదిగిన సుభద్ర కాఫ్ళకడుక్కుని గదిలోకి వచ్చింది. వస్తూనే మంచం మీదికి వంగి, నిద్రలో వున్న పాపాయిని తృప్తిగా తల నిమురుతూ, "చిట్టితల్లి ! పేరేం పెట్టారమ్మా మా చిరంజీవికి, మీరు. మీ అమ్మగారిపేరా, మా పిన్నిగారిపేరా ?" అంది ఇందిరకేసి చూస్తూ.

"మమ్మల్ని అడిగారా, ఆయన ? అదీ గాదు, ఇదీ గాదు. మా ఇంటా ఒంటాలేని పేరు. ఏదో కుసుమట. కుసుమ !" అంది ఇందిర.

అప్పుడే గదిలోకి వస్తున్న అంకయ్య గారు "కుసుమా ! కుసుమా ?" అన్నాడు ఆశ్చర్యంగా.

"ఏం అల్లా అన్నారూ ?" అంది ఆశ్చర్యంగా ఇందిర.

"ఏమీ లేదమ్మా. నిన్ను భగవంతుడు ఆశీర్వదిస్తాడు. ఆచిన్నతల్లినీ నిన్నూనూ" అన్నాడు.

"అంటే? చెప్పండి." గట్టిగా అడిగింది. ఇందిర.


"కుసుమ నా కూతురమ్మా. నా ఒకే ఒక కూతురు. అదిగో. ఆ గ్రూపుఫొటోలో మధ్యన ఉన్నది అదే. చాలా చదువరి." అన్నాడు అమాయకపు అంకయ్య పటం చూపిస్తూ.

"ఆఁ ! అదా సంగతీ ! నీ కూతురా ? ఆ ముదనష్టపుపేరు నా కూతురుకి పెట్టాడా ఆయన ? అందుకా అంత మమకార్రం ఆ పేరుమీద :" అంది కళ్ళెర్రచేస్తూ ఇందిర

చేసిన పొరపాటు వెంటనే గ్రహించుకున్నాడు. అంకయ్య. "కోపగించుకోకు అమ్మా. ఏపాపమూ లేదు. నీకే కొరతా వుండదు. నీ సుఖమే మేమంతా కోరేది" అన్నాడు హృదయపూర్వకంగా. "వస్తూంటేనే. ఆపేరు వినపడ్డదమ్మా. నా కడుపులో ఏదో దేవినట్టయింది. పైకి మాట జారానమ్మా. నాది కన్నకడుపు. అర్థం చేసుకోతల్లీ." అన్నాడు ప్రాధేయపడుతూ.

"ఇందిరా! భయపడకు. నా కూతురు లేదు. చనిపోయింది. మాకడుపులో చిచ్చుపెట్టి కాన్వకేషను రోజునే పోయింది. పొరపాటున నిప్పంటుకుంది. మరచిపో. మా అమ్మగదూ ! అంది సుభద్ర.

"ఆఁ ! అయితే అన్నీ ఇప్పుడర్థమయినయి : నా కర్థమయినయి ! నీ కూతురు చిచ్చుపెట్టింది మీక్కాదు, మా కొంపకి. ఇన్నాళ్ళూ ఈ మనిషికి నిప్పంటే భయం, నామీద ప్రేమ అనుకున్నాను. ఏం నంగనాచిలా ప్రవర్తించాడు ఈ ఇంటాయన ఇన్నాళ్లూ. ఈవేళ తేలిపోయింది. ఆఫొటోలో ఉన్నది దయ్యం ! అది చచ్చి దయ్యమై మాకొంపకి చుట్టుకొంది. ఆదయ్యం ఇంకా మమ్మల్ని సాధిస్తూనే ఉందన్నమాట. దాని సంగతీ ఈ ఇంటాయన సంగతీ ఈవేళ ప్రపంచానికి తెలియాలి. నేను బయట పెడతా. ఏమిచేస్తానో చూడు !"



అరుచుకుంటూ పరుగెత్తుకుని ప్రక్కన వున్న దేముడిగదిలోకి వెళ్ళి టకటకగడియ వేసుకుంది.

వెంటనే వెనక పరిగెత్తుకుంటూ, వెళ్ళి సుభద్ర బిగించిన తలుపులు "తలుపు తియ్యమ్మా : తియ్యి !" అని అరుస్తూ కాళ్ళా. చేతులా, గట్టిగా దబ్ దబ్ మని కొడుతూంది.

"ఓశివా ! శివా !" అంటూ వీధివేపూ. పెరటివేపూ గాబరాగా పరిగెట్టాడు అంకయ్య.

శివరావుని పిల్చుకుని లోపలికి పరిగెట్టుకుంటూ వచ్చేసరికల్లా. ఇంట్లోనించీ కేకలూ గోలలూ వినిపించినయి. మనుష్యులు పరిగెట్టుకొస్తున్నారు. ఇంటిపై పెంకుల కప్పు లోనించీ ఇల్లు తగలబడ్డంత పొగ క్రమ్ముతూంది.

అంతే. తలుపులు విరగకొట్టి లోపల ప్రవేశించేటప్పటికల్లాఅంతాఅయిపోయింది. "గదిలో మూలనున్న కిరసనాయిలు, మీద పోసుకుని దేవుడు దీపం అంటించుకుంది.

—ఎంత!అఘాయిత్యం! అయ్యొయ్యో!" అంటూ చుట్టూ జనంలోనించీ కేకలు వినిపించినయి.

"అమ్మో ! అమ్మో !" అంటూ ఇందిర కేసి పరిగెట్టబోయాడు శివరావు.

"బాబూ, అయిపోయింది. అక్కడ వున్నది కట్టె. మతిబోయి వున్నావు. నీవూ గాయపడితే ఎల్లాగ. నీవు చెయ్యగలిగింది. ఏమీ లేదు. నీకు వెనక కదలలేని నాన్నగారు, పాపాయి ఉన్నారు, రా." అంటూ తనవైపు లాగుకుని అదిమి కావిలించుకున్నాడు, అంకయ్య దుఃఖం ఆపుకుంటూ.

చూడలేక శివరావు, అంకయ్య భుజం మీద తలపెట్టి, కళ్ల గట్టిగా మూసుకున్నాడు.

ఆరిపోతూన్న ఆ నిప్పులకు కొంచం దూరంగా, చెదిరివచ్చి పడినట్టూ, కాస్త కూడా కాలకుండా, కమలనైనా కమలకుండా ఏమీ కందకుండా, రాత్రి దీపాల వెలుగులో పడి ఉంది, ఇందిర చేతిలో, ఇందాకట్నించీ వున్న, ఆఖరి ఎర్రగులాబీపువ్వు — అదీ ఒక నిప్పుకణంలా. ○○○

పరాభి పంచాంగము

జనవరి

1. పనీపాటలన్న నాకయిష్టము
పాటలు వ్రాయటం నాపని

2. కులకాంత రంకుల కాంత మధ్య
వర్ణభేదం మటుకేను

3. సత్యాగ్రహం అంటే సర్కారుతో
చెరలాట

4. పూర్వకాలాల్లో మానహాని
ప్రాణహానికి కారణభూతం
• ఈనాడు ప్రాణహానికి హేతువు
విమానహాని

5. రాజాజీసామరస్యానికి మొనగాడు
ఆద్యంతములే అందుకు సాక్షి.

6. చిన్మయానందం కొందరికి
జిన్‌మయానందం అనేకులకు

7. చీనీ ఈనాడు తీపిగాదు
కటువు

8. ఉద్యోగులలో రెండురకాల
వారున్నారు
చేసేవారు కొందరు
కాజేసే వారు కొందరు

9. అపోజిషన్ పార్టీలకు
పడకుండా వుండటమే పతనానికి
కారణం

10. స్వంత సేద్యం వంత అని
సమష్టి సేద్యంలో మాధుర్యమని
కమ్యూనిజం అంటుంది

11. నౌకా వాణిజ్యంలో
మనవంతునకు
కాస్తగాని కోస్తాగాని రావడం
జయంతి ధర్మాన

12. బంగారును స్మగిల్‌చేసేది
చాలామంది హేమాహేమీలు

13. డిటో మాత్రం కాదు
టిటో

14. ఈనాడు అంతా తారుమారు
ఆశలు మన్ను ముట్టినవి
ధరలు మిన్ను ముట్టినవి

15. హిమాలయాల్లో
పోరాడిన మన సేనలకు
చలిలేదు గిలిలేదు

16. తప్పెల్ల నీది అంటే
తప్పెల్ల నీది అంటుంది
చయినా

17. అడుగువారికి గజమిచ్చునట్టి
ఉదారచిత్తుడు
పండిట్‌జీ

పరాభి పంచాంగము

18. మద్యనిషేధమంత విజయవంతము
గాలేదు
రాయలసీమ మట్టుకు
సారాయలసీమ

19. కాల్పువల్ల వేల్పుకాగోరిక
వియత్‌నామ దేశపు
వీరభిక్కులకు

20. వెలయాలు చాలా ప్రియము
ఆలు చాలా సరసము

21. సధవ—తలిరుబోడి
విధవ—తలబోడి

22. సారాయి త్రాగినవాడు
షరాయి వీడిపోతున్నా, తాను
వయ్యారాయి ననుకుంటాడు

23. ద్రవ్యం యావత్తూ పోయింది
ద్రవంలాగా

24. స్త్రీకి శృంగారవంతమ్ము చీర, అని
సుమతి అంటాడు
చీరలేకున్న స్త్రీ మరీ శృంగారవంత
మంటాను నేను

25. పాపంచేయకుండా గర్భందాల్చింది
క్రీస్తుమాత మరియమ్మ
గర్భం దాల్చకుండా పాపం
చేయాలని
కొందరు సుందరీమణుల కోరిక

26. గాంధీమహాత్ములు ఒకే ఒక్కరు
బ్రాందీ మహాత్ములు మటుకు
పెక్కురు

27. సంఘమర్మం:— ఒకని కూతురు
మరొకనికి పెండ్లాము, వేరొకనికి
తల్లి కూడాను

28. జ్ఞానంకన్నా సుఖం ప్రధానం
కన్కనే మనుస్మృతికన్నా
మను చరిత్రకు సార్వజనీనత

29. ఈ కాలం విద్యార్థులలోన
శాస్త్రవిజ్ఞానానికి చాలాప్రాముఖ్యం
అందులో మరిన్నీ కామశాస్త్ర
విజ్ఞానం

30. చాలామంది నీతిమంతులుగా
వుండటం
చాలినంత ధైర్యం లేకపోబట్టి.
అవినీతికి అతి సాహసంకావాలి

31. ఈనాటి దంపతులకు
ఆత్మనిగ్రహముకన్నను
అపత్యనిగ్రహం ఉపయోగకరము

సరసమైన ధరలు

బట్టలకొట్టుముందు "ఇక్కడ బట్టలు సరసమైన ధరలకు అమ్మబడును" అని వ్రాసి వుండేది— నా చిన్నప్పుడు.

అనాటి ఊహాలో :

ఆయన కొట్లోకి వెళ్ళగానే "పెళ్ళి నడక రాకపోతే వొక్కగంతేసి లోపలకి తగలడకూడదటయ్యా!" అని ఆహ్వానిస్తాడు కొట్టువాడు,

"ఇక్కడ కూర్చునేటందుకు బల్లేనా లేదు." అని బిల్లు చెల్లించే గల్లాపెట్టి మీద కెక్కి కూర్చుంటాడు వొచ్చినాయన.

"ఏడిశావ్- లోపలికొచ్చి ఏం కావాలో చూసేడు," అని ఆయన చెవి పట్టుగుని లోపలికి తీసుకెడతాడు కొట్టువాడు. "ఏదీ- ఆ పైవరసలోవుండే, ఆ గళ్ళతాను తియ్" అని కొట్టువాడి చొక్కా బొత్తములు వూడదీస్తాడు.

"నాజెంబట్ట. మొన్ననే వొచ్చింది. ఒక అరతాను చించనా?" అని కొనే ఆయన మొహాన కండ్లజోడు వూడదీస్తాడు.

"గజం ఎంత?" అని కొట్టువాడి బొడ్డునున్న పొడుండబ్బీ లాగేస్తాడు.

"రెండున్నర" అని కొనే ఆయన కణతలమీద తన చేతివేళ్ళు మడుస్తాడు. "ఇచ్చే మాట చెబుదూ" అని కొట్టువాడి చెవి మెలెడతాడు.

"వో పావలా తగ్గిస్తాలే." అని కొనే ఆయన నెత్తిమీద మొట్టికాయ తగిలిస్తాడు.

"ఆ అర్ధా తగ్గించి రెండురూపాయలు చెయ్యరాదూ?" అని ఆ మ్మే వాడి రెండు బుగ్గలూ సాగదీస్తాడు.

"తాను మొత్తంగా కొంటే, మరో అణా తగ్గుతుందేమో. అంతకంటే నావల్ల కాదు" అని కొనేవాడికి తొడపాశం పెడతాడు. "కాతాగాదు, డబ్బిస్తున్నాను. ముప్పావలా తగ్గితే:తానంతా తీసుకుంటాను," అని అమ్మేవాడి కళ్ళల్లో ముక్కుపొడుం చల్లుతాడు. "ఆవెనకటి కాతా అల్లానే వుండిపోయింది. ఆడబ్బు కూడా చెల్లించారంటే, పదణాలు తగ్గిస్తాను," అని కొనేవాడి పొట్టమీద గుద్దుతాడు.

"సరేలే,- ఇదీ చిట్టాలో వేసుకుని అర్ధరూపాయ తగ్గించు." అని అమ్మేవాడి భుజం పైకెక్కుతాడు.

"సరే..ఈతాను వుంచుతాను. సంక్రాంతి నాటికేనా డబ్బుచెల్లిస్తిరా బ్రతికిపోతాం." అని కొనేవాడిని కిందపడేసి- లేపి నిలబెట్టి, ఒక్కతాపు తన్ని బైటకి గెంటుతాడు. కొనేవాడు పోతూ-పోతూ, అరుగుమీద వున్న దిండు, చాప, సిరాబుడ్డి, తీసుకుపోతాడు.

కొట్టువాడు మనిషినిపంపి, వాటిని మళ్ళీ తెచ్చుకుంటాడు.

—బుచ్చిబాబు

వనవాసి



మల్లాది రామకృష్ణశాస్త్రి

(గత సంచిక తరువాయి)

అనగా..అమ్మా!- మళ్ళీ మాడుపూరు రావా.మాగడపత్రొక్కవా? అన్నాను:

అన్నా. ఇక్కడచూడపోతే వీరూపెద్దవారైనారు. ఇంతకాలమూ అంటావా.- అది నాబుద్ధిలోపం!-యిఖనైనా చేసినతప్పుదిద్దుకోవద్దా?- మీ రాపగాని వైఖరి నీకు తెలిసిందే కద- వారు మళ్లీ ఎప్పుడు సంచారం పోతారో.- ఎప్పుడు ఇంటిమొగంచూస్తారో.- అది.- వారికే తెలియవలె.

పెద్దవాళ్ళను, వాళ్ళ మానానికి వాళ్ళను వదిలి, బుద్ధి పుట్టినప్పుడల్లా పుట్టింటికి

రావటం గణ్యతగా ఉంటుందా ?- ఆయన అటుపోగా, చూసి, ఈవిడా బయలుదేరింది! భగవంతుడు, ఒకరి కొకరిని తగినవాళ్ళనే ఒనగూర్చాడు !- అని యిక్కడివాళ్ళు ఆడి పోసుకోరా ?- దైవం రక్షించి,- వారుయింటి పట్టునే ఉన్నారనుకో-యిక ఆ ప్రమేయమే ఉండదుకద !-

యింతకూ,- నాకు రావాలనిలేదు :

ఎన్నటికీ !-

నీమీద కోపం కాదన్నా !-

నా తలిదండ్రులకూ తోడబుట్టిన నీకూ, నామీద అపేక్ష ఎన్నటికీ పోదు : చూడా లని అనుకున్నప్పుడు - రాకపోరు-అందుకు ఏ ఆక్షేపణా లేదు :

కాని, నే నెలా రాను ! ఏ మొగం పెట్టుకుని మాధవస్వామిని చూడను !- నీ నోటి వెంట ఎప్పుడలాటి మాట పుట్టిందో, అప్పుడే నాకు, ప్రాప్తం తీరింది.

యింతవరకే నోచుకున్నాను ! ఆయెపో- అన్నా !- పసివాడికి పదారేళ్ళు రాగానే పంపుతాను ! వెంట ఉండి-స్వామిదర్శనం చేయించు !- వీనికన్నా,- స్వామి వారు నిండు తేజముతో దర్శనమిస్తారో,- లేదా !- మరేతీరున గోచరులౌతారో - వాని ప్రాప్తమేమో !- అది అప్పటిమాట !-

యిప్పటికి, నాకిలా తోస్తుంది- అన్నా !-

మీ యింటపుట్టిన ఆడపిల్లలకు, యిక మీదట,- యిలవేలుపు మాధవస్వామి వారు కారు ; ఆ పుణ్యము నావరకే-

నా కన్నులలో .తళుక్కుమన్న మువ్వ గోపాలమూర్తిని, కన్నవారిపై మక్కువకు, బలిచేసి,- ఆలయ ముఖమంటపంలో, కొలువుదీరమని వదలివచ్చినాను: ఏల,-

మాధవస్వామివారికి- చేతచాపను మిగిలినది.

మీ చిన్ని మేనల్లునికి వెన్న చలువ లోపించినది !

మా తరాన మరి,- మాయింట ఊయేల వేయము :

ఇక,- ఆ మురిపెము మీ యింటనే-!

మాధవన్నా- నట్టింట ఆడపడుచు లేక పోయెనే అనే చింత నావారికి ఉండరాదు ! మన గ్రామం తిరిగి చేరుకోగానే,- మంచి ముహూర్తాన ఒకరింటి అల్లుడివైతే,- మళ్లీ యీ రోజులనాటికి, మన అమ్మా నాన్నా,- మనుమరాలినెత్తేరు: అవునన్నా- నా అనవాయత నీకురాదు: నీకు ఆడపిల్లలే !-

నా మేనగోడలికి నగలూ నాణెములూ అక్కరలేదులే: పారాడే యీడున,- ముఖ మంటపములో వదులు !

అకడ, నేనిల్లడగా నిలిపిన బాల గోపాలుడు, ప్రాకులాడుతూ చేరవచ్చేను ; స్వామి వారితో కలసి ఆడుకొనేనో, ఆరాధించేనో:

అదే,- నామేనగోడలికి, అక్కడ నేను దాచబెట్టిన నిక్షేపము ! సరేనా ? సంతృప్తి యేనా ?-

అన్నా-నీఊహ నాకు తెలుసును—

"నీ కూతురు నా కోడలయేనా- నీతో వియ్యము నాకు సమ్మతమేనా ? సంశయానికి సమాధాన మిదీ-!

నీ మేనల్లుడు-ఎవరిని చేపట్టేనో- ఎందరిని చేపట్టేనో,- ఎప్పుడా గడియవచ్చేనో,- తేల్చేది మనం కాదు, దైవం !-

చిగురుకొక్క మాట !

మనకు యిక పలుకరింపులు లేవు !

బాంధవ్యం త్రుంచివేసుకోవటంకాదు:



మనసు చిక్కబట్టుకుంటున్నాను.

నాకు దూరమైన స్వామివారు, ఏనాటికైన నాచిన్నవానికి- ఏతీరునగానీ,- ఏపేరునగానీ, శంఖచక్రభూషితులై సాక్షాత్కరించేరో.- ఆ నిమేషమున యీ అంకిలి తొలగేను. ఆ దివ్యముహూర్తముకోసర మెదురుచూచేనన్నా!- నందె గోవిందా !- యిక సాగిపో !-

అన్నదిరా - అన్నా ! - యిదీ మనకథ:-

వెన్నేళ్ళకూ,- నీకు పదారేళ్ళ !-

మీ అమ్మ ఆనాడు నిర్ణయించిన సుముహూర్తము:

నాయనా,- నీ అనుభూతి ఏమి ?-

నా అదృష్ట మేతీరయ్యేనురా - అని నాడవ్వా !,

ఇక, నాతీరు ——

మనసున కమ్మిన మబ్బుతొలగినదికాని.- కనులముందు మసక మాయలేదు : నిండు కొలను - ఉన్నట్టుండి ఉద్ధృతముగా కలగబారినట్లు,- వెన్నెల గుభిలుమంది ! వెలుగు కొండకట్టింది ! కొండగట్టిన వెలుగు, గోగుపూవంత కొడిగట్టింది! ఆవెలుగులో,-కొండకొమ్మన వేయి పడగలేసి కదిలింది చీకటి, చీకటి సోకి కొలనులో తామర తపకు మన్నది: తెలివికి మెలకువ వచ్చింది! మా మేనమామకు నాగోడు విన్నవించినాను ! వారు, ఒక్క నిమేషం - మౌనం వహించిన వారై,- మాటకోసం తడుముకుంటున్నట్టుగా, ఆలాపనగా,- యిలా పలికినారు !

మీ అమ్మ దీవెన నిన్ను వెన్నాడుతూన్నది!

అదే వరమై గురుతుపొడసూపింది, కాని గురి కుదరలేదు - వెరవూ,- తెరవూ, చూపించే గురువు దొరకవలెరా !-

ఎక్కడని వెదకేవు. ఎవ్వరనివెదకేవు.

తరుణము రావలెరా-

వారే తమకు తామై దరిశెన మీవలెరా ?

మామ మాటలతో నాకుతపనహెచ్చింది. ఒక్క గడియ అక్కడ ఉండనన్నాను. గురువు రాకకు నిరీక్షించుతూ, పడిగాపులు పడిగాపులు పడి వుండలేనన్నాను. ఎమరేగేనన్నాను ! వాసు ఎవ్వరైనగానీ- దర్శన మనుగ్రహించేందుకు, తారసిలే వరకూ,- తిరుగుతూనే ఉంటానన్నాను :

మామామ నా మొగము వంక చూచినాడు ! వారిపలుకులు వినిపించుకునే స్థితిలో లేనని గ్రహించి నాడు : కొంతసేపటికి గ్రుక్కతిప్పుకుని,-

తల్లి పోలికను పుట్టినా,- తండ్రి దారిక తప్పలేదు - కానీ, నాయనా,- ఎన్ని తరాలుగానో,- సామాన్యంగా,- సంసారపక్షంగా,- మా కుటుంబం, వర్ధిలుతూ వచ్చింది ! మీ నాయన,- మాయింటికి అల్లుడయినాడు ! మాదశ మారింది ! అనిర్వచనీయమైన ఆనందం,- మా లోగిలిలో కాపురం పెట్టింది ! మీరు మీ యింటికివెళ్ళిపోయినా,- ఆదిలో రవంతబాధ అనిపించినా,- ఆపైన యథాప్రకారముగానే ఉన్నాము ! మీరందరూ కళ్ళ ఎదుట ఉన్నట్టే ఉంది :

మీ అమ్మ ఆనాడు అన్నట్టే,- అక్షరాలా,- నేటివరకూ జరిగింది : పదారేళ్ళ వాడవై మాయింటికి వచ్చావు : యింటిల్లిపాదికీ,- పట్టం గట్టుకున్నట్టనిపించింది : ఔనోయీ-

ఇంట, బిడ్డ ఎదిగేసరికి, అల్లుడు వెదుక్కుంటూ వచ్చాడనుకున్నాను ! మీఅమ్మ చెప్పి పంపిందనుకున్నాను ! మా లక్కమ్మ తల్లికి మామీద ఆనాడు అగ్రహంవచ్చినట్టుగానే యీనాటికి అనుగ్రహం వచ్చిందనుకున్నాను ! యివాళ నీ పుట్టిన పండుగలా చేసినట్టుగానే,- మంచిరోజుచూసి కన్యాదానం చేదామనుకున్నాను : మాఆడపడుచు నట్టింటికి యీరూపేణా వచ్చేననుకున్నాను. మా తలిదండ్రులకు మల్లెనే,- మనుమల్ని ఎత్తుకుని ఆడించే భాగ్యము నాకూ లభిస్తుందనుకున్నాను : ఎన్నో అనుకున్నానురా- ఏం లాభం ! నేననుకున్నతీరున జరిగేటట్టు లేదు ! నీకు, మన ధ్యాస లేదు!, తేలిపోయిందికా !-

కానిలే : మరి, నిన్ను ఆపను: నాపిల్లను చేసుకోమనీ, యింటిపట్టునఉండి పొమ్మనీ- బ్రతిమాలనూ, బలవంతమూచేయను :

అవునురా: నీ వాలకం చూడబోదామాఅంటే పర్యాయతీని, నీవు రాగివయ్యేవో, విరాగివయ్యేవో,- ఊహించడం అశక్యం !

కన్నాను కాని, దాని అదృష్టానికి నేను కర్తనా ?- ఊఁ- అన్నింటికీ మాధవుడే ఉన్నాడు :

నీ తరణోపాయం నీవు జూచుకో——

ఏనాటికైనా,- నాకాయోగం ఉంటేమళ్ళి నిన్ను కళ్ళజూస్తాను :

యిలా అని,- నన్నుకౌగలించుకున్నాడు;

మాధవా : అని ఎలుగెత్తి పలికాడు :

యిక యిద్దరమూ, తలోదారీ !-

నేను,- అంతసేపూ ముఖమంటపంలో ఉన్నా, మరల కన్నెత్తి, స్వామివారివంక చూడలేదు- నాకు ఆఊహే కలుగలేదు. మామామ కనుచాటయేదాకా ఆవంకచూసి,- అనాలోచితంగానే అటుమ్రొక్కి,- ఎటుబోయినాను ?.- మాతాతగారింటికి కాదు : కొలను దగ్గిరకి !

అక్కడ కూర్చున్నాను :

ఆనాడు-, మానాన్న, అక్కడే కూర్చున్నాడు కాబోలు :

అలా,- మానాన్న కూర్చునిఉండగా,-

మా అమ్మ- అక్కడకు వచ్చింది- చూసింది - చేయెత్తి మ్రొక్కింది- నేను పుట్టకముందు జరిగిన కథ - నాకళ్ళలో బొమ్మకట్టింది-

మా నాన్న,- హిమగిరిశృంగాన తపశ్చర్యలో ఉన్న సదాశివుడు. మాతల్లి,- వకుళమాల చేబూని,- సపర్యకు సాగివస్తున్న ఉమ :

ఆయన కడలిపొంగుమీద,- శయనించిన నారాయణుడు,- ఆమె కడలిపట్టి-

మాతండ్రి- వేదాలరూపు తొలివేలుపు-కై మోడ్చినది- నాదమయి-

ఏదో కోయిల కోయన్నది.

ఎటనో తుమ్మెద ఝూంకరించినది-

నా తనువు - బంభ్రమించినది-

తంబుర తీగెలు, మందమందముగ, అలసములుగ మ్రోగినట్లు,- ఏ రవమున కా రవము !

మనసున కలయగ్రమ్మిన నాదసందోహము, వినుకలికి దూరదూరమై, మౌనము ఆలకొట్టినట్లు, మాయమైనది: కనులరవిచ్చుకున్నవి :

ఎదుటనున్నది ఎవరు?- మా మామ కూతురు తిమ్మక్క ; తానొక్కతే రాలేదు: చిన్నదీ సరసను ఉన్నది:

న్నా- ఊరు అక్కడికి తరలి వస్తున్నది: యిక్కడ ఉండటం ఊరివారికీ నాకూ మంచిదికాదేమో. దైవము కానరాడాయెనే అని అల్లాడే అకించనుణ్ణి.. నలుగురిలో ఒకణ్ణి.. నాకీ మరియాద లేమిటవ్వా—

నీవూ. - చూస్తూ ఊరుకున్నావు కాని.. నన్నాదుకోవైతివికద! అవ్వా.- ఆ నాడు మాతండ్రి నీకు విన్నవించుకున్న తీరునే.. నీకు మనవు లిచ్చుకుంటున్నా. నీ కొక్కరికే చెప్పి పోతున్నాను: నాసాధన, ఫలించేందుకు.. నీవు తోడుకావాలి!- అవ్వా ఎన్నడు మరల నిన్ను కళ్ళచూసేనో—

అలా.- విన్నపాలు పలికినవాడై,.-

గంగవ్వకు దూరమై, కన్నవారికిదూరమై తనమీద మక్కువలున్నవారికి దూరమై, తరలిన అన్నమయ్య,. తనలో తానుగా,- తనసాధనే మార్గముగా,-ఆనందమే వాపీజలముగా.. అలసటలేనితనమే- వటచ్ఛాయగా, తమకమే తాంబూలముగా,- తానే అన్నమై అన్నాదుడై, గానయోగాన, ఎన్నిపొద్దులు పడచెనో ఎన్ని సీమలు గడచెనో,. గమనికలేక- తన గానమెవ్వరాలకించిరో,- ఎందరు చేతులెత్తి మ్రొక్కిరో,- ఎవ్వరెవ్వరాతని పేరున పిలచిరో, ఎన్నెన్ని తీరుల పెద్దరికము లిచ్చిరో, గురుతించక,- తాను వలదన్ననూ,- కీర్తికాంతతో తగులాటము తనకు తప్పలేదనీ,. తనకన్న ముందుగా,- ఆ వన్నెలాడి పయనించు తున్నదనీ, స్ఫురణలేక - పోగా, పోగా—

ఎదో ఒకనాడు - ఎదో తావున,- తన ధ్యానలో, తన ఆసలోతానుండగా, ఎక్కడో దూరాన,. ఎదో దిక్కున,- భ్రమరనాదము తోచి,. తానా లక్షించగా, తాను ఆకలింపంగా,-" తనకోసమ్మే, ఆ నాదము తరలి వచ్చినట్లనిపించె - మరింత ఆలకించంగా,. తానే పరవశమై, దానికి వశమై,. అదిక్కు ఎంచి సాగిలి మ్రొక్కినవాడాయెను!

పాలకీలోపయనం జేస్తున్నవాడు, సాళువ నరసింహుడు! విచ్చుకత్తులవారు, ముందు పరుగు తీయగా, బల్లెములవారు, వెనుక అంగవేయగా,- బాకుపట్టిన వారు, వెంట తరటుపోవంగా,- బోయల నాదాన రాచ నడకలుగా,- పాలకీ, ఎదురురాగా,—

ముందు పరుగులవారు, అలా సాగిల పడిన వానిని చూసి,- ఎవరో ఆపన్నుడని ఏలికకు మనవులు సేయంగా,- వారు సముఖానికి రప్పించమని తల ఊపగా,- వారు అన్నమయ్యను లేవనెత్తి,- బ్రాహ్మణుడని తెలిసికొన్నవారై,- తబ్బిబ్బై, మాటామన్నా జేసి,- తోడుకొనిరాంగా,- అన్నమయ్యను జూసి,- నరసింగరాయడు,- బోయలను గదిమి పాలకీదిగి,- వినయాన చేతులు జోడించి,-

అయ్యా మీరు బ్రాహ్మణులే- మాకేల మ్రొక్కినారు- యీసేత మాకు సేమము కాదే- అనంగా, అన్నమయ్య-

నీకు మ్రొక్కలేదు- అనంగా, అంతకు మేలాయె- మరి, మీ ఆర్తి ఏమి ?-

అన్నమయ్య, నవ్వు మొగం చేసుకుని-

'అందలాన పోయేవారు, అర్థంలేని ప్రశ్నలు అడిగేవారని ఎరుగనే, నాది.. ఆర్తికాదు - ఆనందం!

ఓంకారము నలుమొగాల నినదించింది: ఓహో, అని, సాహో అని, సాగిలపడినాను: యీ నాదమూర్తులకు నమస్కరించాను: అంతమాత్రమే!- దేవరకు, తెలియ జెప్పినానుగా, ఇకమీ దారిని మీరుపోయేరా?'

ఆ పలుకులు విన్నవాడై, నరసింగ రాయలు,-ఎరుగని ఆనంద మొక్క నిమేష మనుభవించి,- అంతలో,- తాను మహీపతి నని, ఎదుటనున్నవాడు ఎవరో సామాన్యుడనీ,- ఛాందసుడనీ, గురుతుకుతెచ్చుకుని,- ఎక్కుబెట్టిన వింటివలె శివులెత్తి,- రాజసం ఆవహించంగా,- చేరువనున్న లెంకతో,- 'ఓరీ,- ఆ బ్రాహ్మణునిను, మన కొలువుకు దయ చేయమనరా, - పలికినది,, పెనుగొండ రాజధానిగా కనుచూపుమేర - పరిపాలన జేసే సాళువ నరసింహరాయలని మనవి సేయరా - మన ఘనతకూ,- వారి గరిమకూ అనువైన మరియాదలూ మన్ననలూ సేయంగలవారమని ఎరుక సేయరా - వారి అంగీకారము, తృటిలోమాకు విన్నపం జేయరా- వారు,- ఆసీనులు కాంగనే,- తరలిపోయేమురా....' అని సెలవిచ్చినవారు కాగా,-అన్నమయ్య రాయలవంక జూసి,, పకపకనవ్వి—

సాళువ నరసింహ మహీపాలవరులు మీరా?

మేలు!, మీ సిరులు పెంపొంద వలె!.- మీ పడిగాపులవారికి మీరు సోదరులుకావలె- మీ చూపులు మీ సీమకు వెన్నెలలుకావలె- ఏనాటికైన అయేనా?— ఏమో! వానికెరుక!-

అందరూ దొరలలై అందాలెక్కితే మోసేదెవరయ్యా?

సాటివాని మూపెక్క సామంతము వీనికిలేదు,, అది,- మీ వాసటి వ్రాలేలే-

మీమరియాదలూ,మన్ననలూ, నాకొరత తీర్చలేవయా, రాయలూ,- నాకోరిక మన తలకు మించినది. కొనయ్యా, మహీపతివి,- మణులిచ్చేవు,- మాణిక్యాలిచ్చేవు,- పరివారమిచ్చేవు, పదవులిచ్చేవు,- ఊడిగానికి పడుచుల నిచ్చేవు- భళానే భళా!

అప్పుడు వీనిపని ఏమౌను? కాల్సేతులు కదలింపుటకైన నీ కనుసన్నల ముగుదల కావలెనే!- నీ చిరునవ్వులకు చిత్తము-చిత్తమనవలెనే- నీ కనుకెంపులకు గడగడలాడవలెనే! సాగిపో-సాధించుకో-! అని కానరాని గురువులు కట్టడచేసినారు: అది నీకూ గురువాజ్ఞ! సాగిపో- పో—

అని, చనవుగా, మృదువుగా, అన్నమయ్య పలుకంగా,- ఎన్నడూ, విపన్నుల విన్నపము లవధరించెనేకాని,- వినమ్రుల మనవులాలకించెనేకాని, తన సన్నిధిలో మరొక్కడు ఠీవిగా నిలువగా, తన ముఖాన ఒక సామాన్యుడు బింకాన పలుకాడంగా, కనీ వినీ ఎరుగని రాయలు,- తన పుణ్యమంత తామసించి, తన దురితమంత, మోహరించి తన నేరని తనమంత నివ్వటిల్లి,- ఎదుటనున్నవానిని, కనులార కబళించి,- మూరురాయరగండము వేయించి కదలకుండ చేసి,- కన్నులు పొడిపించి గగ్గోలుపరచి,-

---

రచయితలకు మనవి

"జ్యోతి"కి రచనలు పంపేవారు అవి నిరాకరింపబడిన పక్షంలో వాటిని త్రిప్పి పంపగోరితే రచనలతోపాటు తగినన్ని స్టాంపులను జతచేసి పంపించాలని మనవి. రచనలతోపాటు కాక తరువాత స్టాంపులు పంపవద్దని, అట్టివారికి రచనలు త్రిప్పి పంపడం కష్టసాధ్యమని గుర్తించాలనికూడా మా విజ్ఞప్తి.

—మేనేజింగ్ ఎడిటర్.

గొంతు నులిమించి. ఆక్రోశింప జేసి,- ఆ ఆక్రోశమే. తన ఆనందముగా,- ఆ ఆనందాన ఒళ్ళుతెలిసి, తన ఎదుట తన ధ్యానాన తన గానాన తామున్నవానిని, తనివిగా తిలకించి,- తన గొంతు తన వశాననుండక,- ఓహో అనంగా,- తన హస్తములు తన అజ్ఞను నిరీక్షంచక,- తనకు వశంవదములు కాక,- ఎదుటనున్నవానికి జోతలీయగా,- ఒక్కక్షణము తాను తాను గాక, మంచికిపోయి, మనిషై,- అంతలో గానమాగిపోగా, భుజకీర్తులు తడుముకొని, బుసకొట్టి,- ఊసాగనీ- యిది ప్రభువులఅజ్ఞ, పాడవయ్యా బ్రాహ్మణుడా-' యిలా ఏలినవారి మాట దూకుడున పోవగా,- అందుకు, అన్నమయ్య- ఒక చిరునవ్వు !-

రాయల కనుకెంపు- అందుకు మరొక్క చిరునవ్వు-

రాయల హుంకరింపు- అది అన్నమయ్యకు చూడ వేడుక-

రాయలూ,- బ్రాహ్మణుని ఆజ్ఞాపించు కాలము రాలేదు ! రాదు ! అది మీకే సేమము :

నా గానము.- నేను నేర్చినదికాదు : కానరానివారి దెవ్వరిదో,- నా గొంతు నా చెప్పుచేతలలో లేదు : పలుకమని నప్పుడు పలుకదు !

ఇది దర్పముకాదు- తధ్యము.- నీమనసు వీనిని హింసించినది - వీడు, ఘనుడుకాడు, గాయకుడుకాడు ! నీటిని మరగబెడితే,- నేయి అవుతుందా,- కాకిగొంతు నులిమితే కోకిల అవుతుందా,- గోరెంత పెరిగినా గొడ్డలి అవుతుందా,- గోడకు నామం మెత్తితే గోవిందుడౌతుందా ?-కాదుగదూ?- మన స్థితీ అంతే....

నీవు నోచినదానికైనా నేను నోచలేదు ! నా గానం యింతవరకూ నేను వినలేదు జౌను !

వారి ఉపదేశం వినవచ్చింది ! గొంతు విచ్చుకున్నది : గానము సోనలు గట్టినది ! అంతవరకే తెలుసును ! ఆపై ఎరుగను ! కాని, వాడెవ్వడో, ఎక్కడున్నాడో తెలుసుకొనవలెననే తపన,- వేదన,- అందుకు గురువులు చూపిన మార్గమీ గానసాధన ! వినగా వినంగా,- వానికేనాడు దయ కలిగేనో,- నడువగా నడువగా,-ఎన్నటికి, వాని దరిదాపులకు చేరుకునేనో....?

ఏ రూపాన వెలసినవాడో- ఎక్కడ లేవిణీ వేసినాడో- ఏ కళనున్నాడో, నా కన్నుల కేవేళ గోచరుడయేడో, నా సేవ అందు కొన, వానికి ఏ ప్రొద్దుల మనసయేనో తన్నే తీరున పిలిపించుకునేనో, నన్నే గోమున తనవాని జేసికొనేనో, అది,- ఆ లీలా వినోదుని దయ!

ఏమోకాని,- ఉట్టిమీద వెన్న దుత్త పెట్టి, ఊరెల్లా నేతికి త్రిప్పిస్తున్నవాడు ! ఒకచోట నిలువనీయడు మనసెవ్వారి మీదికీ పోనీయడు ! అన్నీ మరపించాడు. కాని ముచ్చటకైనా మురిపించడు: కానరాడు కాని నన్ను వదలడు : యిదీ మావరస !

పాపిట తీసుకున్నాను యింటాయనా అంటే, నాకింకా దొరసాల కాలేదే యిల్లాలా!' అన్నవాడట. వెనుకటికి యిల్లాంటి మహానుభావుడే ! యిదీ మా సరసం ! 'కొత్తగా వచ్చింది కోడలని కోకిలా అని ముద్దుచేస్తే, కూనిరాగందీస్తూ కొమ్మెక్కి కూర్చుని, కోఁ అంటే పోఁ- అన్నదట !' తాను దేవుడైనందుకు నన్ను



దివ్యంగా వేధిస్తున్నాడు ! కానీ,- ఎన్నటికైన నాచేత పడడా,- యిన్ని ఆటలూ నేనూ ఆడించలేనా ?-

ఆఁ- ఆఁ- ఏమి యీవెర్రి !—

ఆడించేది,-వాడా,- నేనా ?-

వీని మాయ మంచిగానూ !-

నా భ్రమత వాని మమతగానూ,

నీవున్న తావున నీవుండి, నన్ను నాకు గాకుండ జేసినా వోరయ్యలూ,- ఇంతలు చేసినానని, నేతకు మురిసేవుగా,- దీని సొగసు నీ కెఱుకలేదు- సొక్కులు ఎక్కబెట్టి చిక్కులబెట్టినా,- నేను నీకు దక్కనో ఎమ్మెకాడ !

దక్కించుకొనేను ! యిక ఎవ్వరుగానీ, ఎవ్వరి తేరకాడనిరో, మారు బలుకువారు, నీ పేరున నిన్ను పేర్కొనరులే ! ఈతడా, తాళ్ళపాక అన్నమయ్యనేలే దైవరాయడ నేరులే ! అవే నీ బింకమునకు బిరుదయ్యేనులే....'

'తాళ్ళపాక అన్నమయ్యా'– అని వినంగానే, నరసింహరాయడు. అయ్యా! అయ్యా! అని ఎలుగునఙోయి. నేటికి నిన్ను జూడగలిగినానా! ఎన్ని సీమల తిరిగినానయ్యా!– అయ్యా!– నీపేరు విన్నాను! నీవు నావాడవే అనుకొన్నాను! అనుకున్నంతలో.. నీవు కాల్నడకను సంచారము చాయగా, నాకు అలసట తోచింది! నీదరి జేరని ఆకలిదప్పికలు. నన్నావరించినది! నీ ఉపవాసము, నాకు ఉపదేశము చేసినది! నీ దీక్ష నన్ను దీవించినది! నీ కదలికతో నేనూ కదలినాను: నిన్నూ నీ గానమునూ ధ్యానించుతూ ఉన్నాను: కోట పెంపొంది నది, కొలువుతీరిక పెంపొందినవి: రాణువ హెచ్చినది: రాజసమూ రెచ్చినవి: కాని. అవేమో ఎందునా తృప్తి ఎసగకనేపోతిని. నేను నాకేవో లోపముజేసికొన్నట్టు అనిపించింది. ఏదో వెలితి కనిపించింది! గురువుల వారికి. విన్నవించుకున్నాను: వారు సెలవిచ్చినారు కదా—

'రాయలూ.. కూర్చున్నచోటికి కోయిల రాదు!

ఏలినవారి సెలవైనదని రాచిలుక వలుకదు.

రాజసాలు కోటలో వదిలపరచి.–
ఏనాటిపుణ్యమో ఎదురయేదనుక

సాగిపో.– నీకోర్కె సాధించుకో....

వారుపలికినట్లుగానే. సాగివచ్చాను. గురువుల కృప నాకు తోడైనది. దారిచూపినది' వెదుకబోయినవారు ఎదురైనారు! మీరు యింతకుముందు సెలవిచ్చినట్లే.– యిక మీరు ఏ తీరున వీని నాదరించేరో.. ఏ ప్రొద్దుల నా సేవలందుకొన మనసయేనో మీ చిత్తము: పాలకీ దిగినాను! బంటునై. మీ వెంట నడచేను:....'

నరసింహరాయలు, యీ తీరున వలుకంగా అన్నమయ్య.వికవిక నవ్వి.- 'తాదూర సందులేదే- మెడకి డోలు ఎందుకు?– రాయలూ.– నీదీ రాచపుట్టువు: పేదరికమునకూ మీకూ సగమెరిక! యిప్పటికిది ముచ్చట అనిపించి.– నా వెంట నాలుగడుగులు పెళ్ళినడకలు నడచేవుపో.– నీ వయారము చూచుటకు కాదు.– నేనింతదూరమూ సాగివచ్చినది? నేను వాని లెంకనయ్యా- నాకు నీబంటు తనమేలనయ్యా!–

'రాయలూ.– ప్రభువులు మీరు!– వీరులు!- రణకర్కశులు!- భక్తి.మీ కొరకు అటవితుపు!– సాటి నరుణ్ణి పెద్దచేయడం, గౌరవించడం.. అదో భ్రమ! వినయం ఉట్టిపడేట్టు పలుకడం- వేడుక!- మంచితనానికి పోవడం తెలిసి చేసుకునే ఆత్మవంచన!

'ఎదుటివాని నెత్తురు కళ్ళజూచి. కలకల్లాడే మీకు, ఓదైవమనీ ఓ గురువనీ ఉన్నాడా?– ఏమో.– మన మెచుగము! విన వేడుకగా పలికింది చాలుగాని.- దిగినట్టే ఆ పాలకి ఎక్కి నీ త్రోవను పో.–'

రాయలు పాలకి ఎక్కినదీలేనిదీ, అన్నమయ్య గమనించలేదు- తాను ముందుకు సాగిపోయినాడు:

రాయల వెంటనున్న పరివారము కనుకెంపు మీద నున్నది! ఆ వీరులు మనసున కత్తులు దూసినారు! ముందుకు ఉరికేందుకు, తమ ఏలినవారి నలా ఈసడించిన వాని సిగ పట్టి నిలిపేందుకు.. ప్రభువులు కనుసైగతో ఆజ్ఞాపించరేల?-

రాయలు ఏ స్థితిలో ఉన్నాడు?

కోపములేదు- తాపములేదు-

మోమున ప్రసన్నత- పెదవిని చిరునవ్వు-

జవరాలి చేతి జపమాలలాగా,- తబ్బిబ్బై నాడు! పాలకిబోయలతో.- 'ఓరీ.. అందలం ఎత్తండి- అడ్డ త్రోవనుపోయి.– వారికి. కానరాకుండా.- దారిపట్టి.- కూతపట్టండి! హుటాహుటి పోయి. కేశవస్వామి వారి సన్నిధిలో, ఆగండి! వెనుదిరిగి చూడరాదు! వెటకారం తలచరాదు! పాలకీలో స్వామివారున్నారనుకుని, పరుగుమాని భక్తిగా నడిచిపొండి: మేమూ వెంటనే ఉన్నాము!-

పాలకీ సాగిపోయింది. రాయలు తలచినది కొనసాగినది! తాను బతిమాలినా, పదము అంటినా, అన్నమయ్య చలించడు: పెనుగొండకు రాడు! అన్నమయ్య లేనిదే, తాను పెనుగొండకు పోడు! కనుక యిదే ఉపాయమని తోచింది! చిలుకను పట్టవలెనంటే చిలుకనే వదలాలి! తన బోయల ఓంకారమాలించి.- అన్నమయ్య వారిదారి పట్టక మానడు కద!

రాయలు అనుకున్నంతా జరిగినది!
విసవిసపోతూన్న అన్నమయ్యకు..

ఓంకారము దారి చూపించినది: దానిని తరుముకొని పోయినాడు: నాదముఆగినది! తానూ అగిపోయినాడు:

కలయజూసినాడు: ఆలయముఖమంటపం!

అటు- కేశవస్వామి!

యిటు- వినమ్రుడై, రాయలు!

అయ్యా! అన్నమయ్యా! మరే సాధన లేక, యీ రవంత అపచారము చేసినానని నేననుకొనుచున్నాను! కాదని అభయమిచ్చి నన్ను చరితార్థుని సేయవలె:

మాకోటలోనికి దయచేయమని, కోరను: పరిచర్యలకు పరివారమును నియోగించను: పదవులివ్వను! ఊడిగానికి పసుచులనివ్వను!

యిది.స్వామి సన్నిధి. మీకు నిత్య ఏకాంతము! మీ సాధనలకు ఆటంకమూ, అంతరాయమూ ఉండదు.

ప్రాతః సమయమున మీదర్శనభాగ్యము మాత్రము నాకు అనుగ్రహించండి: అదొక్కటే నా కోరిక!-

ఎల్లకాలమూ - దైవకృప యీతీరున మాపైన ఉన్నంతకాలమూ - మీరిచ్చటనే నివసించవలె! యింతకాలమూ. కానరాని ఆ దివ్యరూపము.. మీకు. మా సీమలో. కనుల కందవలె - మీతోదాటూ మేమూ తరించవలె - యిదొక్కటే నా మనవి—

రాయల మనవి ఆలించి.. అన్నమయ్య- సాగిపో - సాధించుకో అన్నది ఆవాణి - అని మననం చేసుకుని,- రాయలవంక చూడనైనా చూడక.- అడుగు ముందుకు వేయగా, రాయలు,

'మీరు కదలిపోవడం, కేశవస్వామిని.- మా దైవాన్ని తృణీకరించినటు లౌను–!'

అన్నమయ్య వినిపించుకొనలేదు!

మా గురువులు, నిన్ను సందర్శించేందుకు విచ్చేస్తున్నారు! ఆగకపోయిన పెద్దలను నిరసించినటు లౌను!'

అచ్చుతప్పు

గత సంచికలో "పంచపదులు" శీర్షిక క్రింద అయిదవ పద్యానికి హెడ్డింగ్ "ఇక్కడంతా క్షేమం" అని చదువుకొన ప్రార్థన.

అన్నమయ్య, ఆగలేదు.

'పట్టి బంధించండి !' అని రాయలు కేక వేశాడు : కేకవేసింది - అతడు కాదు - అతని రాజసం ! ఆ పెదవులు మెదలలేదు- ఆ ఆజ్ఞ లెంకలకు వినిపించలేదు —

కాని, అన్నమయ్య అడుగు ముందుకు వేయలేదు - పచ్చని మేనివాడు,- పలపలని



నవ్వులవాడు - వెన్నెల కన్నులవాడు - వెడద ఉరమువాడు ! - తనముందు తోచి, చేజాపి, అందుకొని, గ్రుచ్చి కౌఁగలించు కొనె - అతడెవ్వరు ?- మెడనున్న తులసి మాల నీ గురువులు రా,- అని జపము చేసి నది - ఆ కనులు - సాగిపో-: సాధించుకో, అనీ తళుకు చూపుల దీవించినది —

నాయనా - అన్నారు వారు

స్వామీ - అన్నాడు అన్నమయ్య - నిన్ను వెదకికొనుచూ వచ్చానురా-అప్పుడు- నీది ఒక్క అడుగు ముందైనది !- నిన్ను కనులచూడలేదు - తరుణ మురాలేదు ! దానికేం !-

నీకు కావలసినవారిని, జూసినానులే !-

మీ మేనమామ, మాధవయ్య - నేనూ, ఒక తల్లి కడుపున పుట్టలేదు కాని,- మా అనుబంధం అలాటిది !

నన్ను కందాడవారి కృష్ణుడనేరులే—

యీ తులసి పూసలూ, యీ వాలకమూ ఏమనేవో,- యిది మన వెర్రిలే-!-

అది ముదిరి వేదాంతమైతే,- అదేందుకు పాడేందుకు ఒప్పవంగదని,- లేతగానే అట్టే పెట్టాను :

ఆ, దానికేంగాని,-

యింతకూ నే జెప్పవచ్చింది—

ఆవేళ,- మీ మేనమామలోగిలి కలకల లాడుతూండగా,- వచ్చాను- ఏమిటి విశేష మన్నాను !

ఫలానా అన్నారు !

ఏడీ ఆ ఘనుడన్నాను !

కొలనిగట్టున తీరి కూర్చుని, కొండ కొమ్మున గోగుపూసిందేమా అనే మథనలో ఉన్నవాడు- అన్నారు !

ఆహా-అదెంత పుణ్యంకాదు! అన్నాను:

పిలుచుకుని రమ్మని పిల్లలనిద్దరినీ పంపించినారు : అక్కడ ఏమి జరిగినదో,— నీవు అటురాక- ఎటోసాగిపోయినావట!-

ఎవరో ఉపదేశము చేసినట్టు!- ఏదో సాధించబోతున్నట్టు- ఆఁ యిది వారి ఊహాలే !-

మీవాళ్ళందరూ,- సామాన్యులుకారురా!-

'నాన్నా - నాన్నా - తాళ్ళపాకనుంచి వచ్చిన అత్తకొడుకు,- రాగాలు దీస్తూ,- ఎటో పోతున్నాడు -!' అని మీ చిన్నమరదలున్నదే,- ఆ చిలక, ఎగిరి గంతేసి చెప్పింది !

పెద్దపిల్ల - పండు ముత్తైదువ నుదుటి కుంకుమల్లే,- సిరులోడే మొగంతో,- నిదురలో పసిపాప నవ్వినట్లు నవ్విందయ్యా ! మా మాధవయ్య వీళ్ళను మించినవాడు !-

వినీ వినడంతోనే - ఆహాఁ- అనుకుని,- మెప్పుగా - మేలుగా, తల ఊఁగించి,- సిగపాయ ఝాడించి గుత్తగా ముడివేసుకుంటూ తపస్సు తాత తండ్రులదీ,- ఫలితం వీడిదీ :- అంతేకాదురా -? ఒరే కృష్ణమ్మా !- మన ప్రబుద్ధుడు,- ఎక్కడ సంచారం చేస్తున్నాడో,- నీవో ద్రిమ్మరివి - తారసిల్లితే,- గట్టిగా కౌగలించుకోరా !- అన్నాడు—

రావయ్యా అల్లుడా యిలా కూర్చుందాం దారినబోయే బాటసారి తనకు అలసట లేకపోయినా, వటవృక్షం కనిపించెనో,- దానికి మన్ననగా, ఆ నీడను నిలవాలి,- అని పెద్దలంటారు !- ఎందుకు ?- ఓవిశేషం లేకపోలేదు !-

మన మనస్సుందే- ఎండలో ఉంటే ఎదుటివాడిమీదికి పోతుంది- నీడనుంటే నిన్నంటి పట్టుకునే ఉంటుంది-

కనుకనే- ఒకచోట కాల్నిలుపనివానికి చేత యిలాటి ఓ జపమాల వంటిదివుంటే చిత్తము చిత్తమువచ్చినట్లు మెలగదు- అందుకో.... కోరిన ఆనందమనుభవించుకో !....

కృష్ణగురుడు.... అన్నమయ్యకు తులసి మాల అందించినాడు! అంతవరకూ బ్రమాన్పడి మూగవోయిన అన్నమయ్య అందుకున్నాడు: అందుకొనంగనే,- కనులు అరమోడ్పులైనవి : మనసు, వేయిందాల మెరిసే వెన్నెల :

వెన్నెల మడుగు కట్టినది:
మడుగులో తామర రవతళుకుతేరినది :
ఆ వెలుగులో,- తానో నిలువుపీడ....

కనులలో సూర్య బింబము- మనసు తన కనులకందని చంద్రబింబము :

వన్నె వన్నెల మారుతము, అలలుకట్టి,- కానరాని సోపాన పాళికాగా,- తాను సరినడకల గమగమగా,- పదపదసీదని, ఏనాదమో హెచ్చరికలు సేయంగా,- ఎగసి ఎగసి,- ఎదురైన మదవతులు,- చేయూతల సాయం కాగా, ఐదుగురు పైదలుల సరస నెగసి,- పికరవ భృంగరవములు ఏకీకృతములై ఆత్మరవముకాగా,- ఆరవళిని,- కొండశిఖరి గమకముగా,- తన చేరువకాగా,- నాదమోదమే నీలమేఘమై,- పరవశమే, ప్రథంజనమై,- గురి కుదిరి,- గురుతు తెలిసి, జయ్ గోవిందా - అని ఎలుగెత్తి....జయ జయ ధ్వనుల కనులు తెరచి,- వాడే,-వాడే:- వాడే నావాడు !- అని నవ్వుకోగా,-

కృష్ణగురుడు,-ఔనురా- వాడికనీవాడే!

ఏడుకొండలమీద ఎదురు చూసేవాడు !

నీలి నిగ నిగవాడు, నిండైనవాడు !- తన వారి మ్రొక్కులకే తనివి జెందేవాడు ! తన్న కన్న ఘనుడు లేడనిపించువాడు ! అల

కావరివాడు అల్లరివాడు: ఐశ్వర్యముల వాడూ అరి పేదవాడు!

వాడు.- నీవాడే!

నాయనా.- వాడు దేవుడే- కాని ఎత్తు వారి చేతిబిడ్డ: కంటపడంగనే చాల పాపను చేసి చంకనేసుకొని ఆడించక పోతివో వాడు. నిన్నాడించేనురా: వెనుకటికి అన్నలమ్మ అని.- అరిపేద.- తల్లిగర్భములో కాలుసేతులు విడిచిపెట్టి.- వెనుకటిజన్మల్లో నోటిమాట భద్రపరచి.- మొండిగా. మూగగా పుట్టింది:

ఆబిడ్డ తలిదండ్రులకే వెక్కసమైంది: ఏడుకొండలవాని సన్నిధిలో వదిలిపెట్టి పోయినారు: ఎవరుపెంచారు? వాడా! ఉహుం.- ఆ అవ్వ జేసుకున్న పుణ్యం ఏ జన్మలోనో నోచిన నోము:

వాడు పెంచలేదు: తానే వాడిని ఆడించింది: ఆ పావకంటిముందు వాడో చాల పాపడైనాడు: ఆ మూగతనమే వాడిని ముద్దుచేసింది.- ఆమనసు ఊగూగై జో కొట్టింది:

కాళ్ళేతులు లేని పుట్టువు వానికి పారాడ నేర్పింది: అలా పసితనాలు పోయి.- తాను అన్నలమ్మలో కలిసిపోయినాడు: అదొక కథ!-

కృష్ణమాచార్యుడని.- కాకతి గణపతి సేవలందినవాడు! ఆ కృష్ణుడు.- తంబుర చిరతలు పట్టి ఆడి పాడి అలసినవేళ.- ప్రభువే పదములొత్తే వాడట - అంతగా సపర్యలు చేసినా.- ఆ సిరి సంపదల నడుమ నుండలేక.- తరలిపోయి.- ఘనవాని సన్నిధి కేగి.- స్వామి.- నీవు సిరి కలవాడవు! కావి.- పేనికోసము సిరులకు దూరముగా!- నీవు నీవై నిలచి నా సేవ లందుకో. అని మ్రొక్కుకోగా. కృష్ణమాచార్యుని సంకీర్తనము విన వేడుకపడి.- వారు కోరిన వరమనుగ్రహించినాడట! అన్నలమ్మ. చాలుని జేసినది—

కృష్ణమాచార్యుడు - విరాగిని చేసినాడు!

ఇక నీచేత బడినాడు. వాని నేమిచేసేవో! జయ్ గోవింద!-

వాడు.- లయకాడురా!- పాటలన్న వానికి పరమ ప్రీతి.- నీచేత పాడింపక మానకు: ఔనురా.- కోతి మూక వాని కొలువు కూటము! కోతి చేష్టలు వానికి చేతనౌను! చిత్తము వచ్చినట్లు నిన్నాడించ కలడు! అది గురుతుంచుకో! అన్నిటా మేలౌను! జయ రమా రమణ!-

కృష్ణగురుడు, మరి పలుకలేదు: అన్నమయ్యవంక చూడలేదు! లేచి నిలుచుని.- యిటు నడచి, కేశవస్వామికి మ్రొక్కి.- తన దారిని తాను పోయినాడు:

అప్పటికిఅన్నమయ్యకు-తెలిసివచ్చింది- ఉవ్వెత్తున లేచినాడు: అది గమనించి నరసింహరాయలు సమీపించినాడు:

అన్నమయ్య ప్రసన్నంగా.- రాయలూ. నీవలన గురుని దర్శనమైనది! గురువుల కటాక్షమున. నాదైవము కనులకు కట్టినాడు: నాలేమి తీరినది: యీనిరుపేదకు నవ నిధు లబ్బినవి: నా మనసు నీ సుకృతమునకు కేల్మోడ్చుచున్నది: నా సేవా ఫలమిక.- సాళ్వవంశమునకు ధారాదత్తము: నీతీరున నీవు సుఖముగా, వాని తలచుకొని, వాని మేలు నమ్ముకొని.- ప్రజాపాలనము చేయ గలవు!'

రాయలు అన్నమయ్యకు నమస్కరించి పోగా. వారించి.- రాయలూ.- యీ పేద బ్రాహ్మణుడు నిన్నొకటి యాచించేను: కాదనరాదు: నారాయణుని మ్రొక్కిన చేతుల నరునికి మ్రొక్కరాదు: మనుజుడు ఎంతటిఘనుడైననూ మాధవుడు కాడు: గురుతుంచుకో! ఎదుటివారి పెద్దరికము మన్నించేవా.- వారి సన్నిధిని.- శిరసు వంచిన చాలును: కైమోడ్పునీయరాదు:....

రాయలు శిరసువంచినాడు: అన్నమయ్య పకపక నవ్వి.- నరసింహుని కౌగలించుకుని.- వీడు ఘనుడుకాడు.- వానిదాసుడు! నీవనుమతించిన నేను సాగిపోయేనయా -!

పాలకీ పరివారమూ అక్కరలేదులే - వాడనుగ్రహించిన గానమే పాలకీ - కాళ్ళేతులే పరివారము!

వాని వాదనను కొనుతే వైభవము - జయ్ - గోవింద!-

రాయలకంట నీరు తిరిగినది! ఆవీరుడు దుఃఖమాపుకొనలేక పోయినాడు! పరుగున పోయి కేశవుని సన్నిధిని కూలబడి.- పసివానివలె రోదనముచేసినాడు! రాయలు-!

అన్నమయ్య వెంగటనున్నాడు! రాయలు వంచిన తలఎత్తలేక బిడియ పడినాడు!

రాయలూ, కన్నీట వాని పదములు కడిగినావు! చాలు! ఒకటి రెండు చిరు నవ్వులు నావెంట పంపవయ్యా - వానిసన్నిధికి జేరుకొనేను!

రాయలు ప్రసన్నవదనుడు కాగా.- అన్నమయ్య పదచలనం జేసినాడు!

—కొండలపెట్టువ గోవింద - గోవింద కోలాహలము! అన్నమయ్య.- 'ఎన్నడూ లేనిదీ అలసట ఏమో?- అడుగుల తడబాటేమో?- ఆకలి దప్పితలేమో?-' అనుకుని వింతబోయినాడు! ఎదుట సోపాన పాళి:- కాని తాను కదలేస్థితిలో లేడు!- అన్నలమ్మను గురుతుకు తెచ్చుకుని.- పారాడుతూ, పది బారలు ఎగువకెక్కినాడు! అలసట తనవెంటనే ఉన్నది! విదిలించుకున్నాడు: వదలలేదు! నిదురగా కౌగలించుకున్నది.

ఎవరో పండుతల్లి - దారినపోతూ తన్ను చూసింది! దగ్గిరకు వచ్చి కూచుంది! 'నాయనా!' అని వెన్ను నిమిరింది! తన అలసట మాయమై.- సత్తువ వచ్చింది! లేచి కూర్చున్నాడు!

అమ్మా!- ఎవరమ్మా మీరు!-

'ఏం కావాలమ్మా!- అన్నాడు: ఆ మాట కా తల్లి నవ్వింది! నీకేం కావలెనో చెప్పక.- నాకేం కావాలని అడుగుతున్నావా. చిన్నవాడా!- నిదురవదలినదా?-'

'నీచేతి చలువను -!'

'ఆకలీ దప్పికా -'

'మాతల్లి చలువను-'

'మీతల్లి అంత చల్లనిదా?-'

'ఎంత చల్లనిదో.- ఆమెకే తెలియాలి!'

'ఆమె పేరు?-'

'అమ్మను. అమ్మా!- అనడమేకాని.- మరేపేరున పిలుస్తాడమ్మా - ఆమే కన్నవాడు!'

'ఆమె యిప్పుడు ఎక్కడ -?'

'నా కనుల ఎదుట. బిడ్డను విడిచి తల్లి ఉంటుందా - ఎప్పుడైనా ఉండగలదా అమ్మా!-'

ఆ తల్లి నవ్వింది_

'నీమాటలు విన వేడుక ! మాయింటి పట్టున యీ ప్రొద్దుండి,- ప్రాశన చేదువు గాని, రా- :'

'అంతకన్ననా!- కోనేటిరాయనిదర్శనం చేసి,- తప్పనిసరిగా, వచ్చేనమ్మా !-అమ్మా మీరూ స్వామి దర్శనానికే తరలి పోతున్నారా !'

'ఎక్కడికీ పోవడం లేదు;

చేకొన్న స్వామిని తనివిగా సేవించుకుంటే చాలును !

నాయనా- యిదో చూడు,- నా కంటి ముందు పండిన పండు : చేతికి అందినది. చెంగున కట్టుకున్నాను : ఆరగించు !-'

'కనుల కద్దు కుంటానమ్మా !—'

'ఇంతేనా,-!'

'ఈ సుకృతము చాలదా- అమ్మా-!

అమ్మా !- వారి దర్శనమునకు పోవలె- అనుమతించరమ్మా !-'

'మరల ఎప్పుడు నిన్ను కనులజూచేనో-'

'నిన్ను వెదకి కొనుచూరానా !-'

అన్నమయ్య కనులు తెరచినాడు :

ఎదుట ఆతల్లిలేదు- చేత మామిడిపండున్నది- కనులకు మరియొకసారి అద్దుకున్నాడు, తనలో తాను నవ్వుకున్నాడు- 'అమ్మా- ఎంత దయ ! నిన్ను చేకొన్న స్వామితో, విన్నవించేనమ్మా- !' అనుకొని లేదివలె సాగినాడు :

అన్నమయ్య ఆలా చెంగలించుకుంటూ పోతూండగా,- కొమ్మలమీద, గుట్టలమీదా ఉన్న కోతులు,- ముందు వింతగా చూసినవి ! ఒకకోతి పండ్లికిలించినది ; మరొకటి తోక ఆడించినది. వేరొకటి వాని నడక నడచినది ! కోతి పిల్లలు కిచకిచమంటూ వెంటాడినవి. ఒకకోతి పండు ఒడుసుకునేందుకు మీది కెగిరినది. అన్నమయ్య,- ఆ మూకకు మ్రొక్కి,- 'స్వామివారికి నివేదించి,- ప్రసాదం స్వీకరించండి !-' ఆ ఫలము అక్కడ ఉంచినాడు ! ఒకకోతి అందుకుని,- నెత్తిన పెట్టుకుని, అన్నమయ్య వంకజూచి కిచకిచలాడి - కొమ్మ కెగిరినది ! కోతిమూక,- ఓ గుట్టమలుపుకు మాయమైనది—

అన్నమయ్య ఎక్కిపోతున్నాడు !

జైనులు గుంపుగా ఎదురైనారు:

అన్నమయ్య, ఆగి,- వారికి మ్రొక్కినాడు ! వారిలో ఒక వృద్ధుడు, చేరవచ్చి,-

'తెలిసి మ్రొక్కినావా !- తెలియక మ్రొక్కినావా ?-'

'తెలిసీ తెలియక- మ్రొక్కించుకొను అర్హతమీకు లేదా- పోనిండు !-

ఈ తావు వానిది- ఎటు మ్రొక్కినా, ఏ వంక మ్రొక్కినా చెందునది వానికే-'

'ఎవరు నేర్పిన దీవిద్దె-?'

'విద్దెలు తానైనవాడే-!'

'ఆ నామధారియేనా ?-'

'అది,- నామమో,- మన నేమానికైన, వాని నీమమో,- అవైనం నాకు వాడు చెప్ప లేదు ! మీకు తెలిసిన సెలవీయండి :-'

'సెలవిచ్చేము : వాడోకల్ల- ఆఉనికికల్ల- నీపలుకు కల్ల- ఏమనేవు,?'

'ఏమనేను ?-పలికినది వాడే అనేను :



జయ్- గోవిందా ! నా కనుల నున్నది నీ రూపు నేను విన్నది నీపలుకు !- అడుగడుగునా నన్ను ఆడించదలచినావా?- ఆడుటకు నీను సిద్ధమే !-....'

ఆ వృద్ధాచార్యుడు,- అన్నమయ్యను సందిట చేర్చుకుని,- చేతచెక్కిలిపట్టి,- వత్సా ! పో- ఎగువకు పో- మనవాని జేరుకో-

ఆ గుంపుముందుకు సాగిపోయినది—

అన్నమయ్య - అటు పోవువానికి,- మరోసారి మ్రొక్కి,- 'కోనేరప్పా !- మా అన్నలను నా కెదురుపంపినావా !-' అనుకుంటూ ఆనందిస్తూ మరో పది అడుగులెక్కినాడు, గోవింద - గోవిందగా—

—'ఓరీ,- నిలువరా-' అని ఉరిమినాడు ఎదురైనవాడు ! ముంజేతికి నాగకంకణము,- మెడలో మందారమాల ! ముంతకొప్పు,- కొప్పున క్రౌండగోగు,- కనుల దట్టముగా కజ్జలమూ, ఉరమున అరుణచందనము,- కట్టినది కోక,- ఉత్తరీయము పయ్యెద - అన్నమయ్య వాని,- నిలువు నిలువూ జూచినాడు,- చేయెత్తి మ్రొక్కినాడు !

'ఎక్కడికిరా ?-'

'వాని సన్నిధికే—

'వా డె వ డు రా - అవివేకి - అక్కడ ఉన్నది అంబరా - ఆదిలక్ష్మిరా !- కాద నేవా ?-'

'అయ్యా, నేను అజ్ఞానిని ! కాదనే విద్య నేరువలేదు ! మిమ్ములను అయ్యా అన వలెనో అమ్మా అనవలెనో, అవగతము కాలేదు !'

'అమ్మా అని ఎలుగెత్తరా- కొలువైఉన్న అంబను కొలుచుకోరా ! గిరిపై అనాదిగా వెలసిన ప్రత్యక్షదైవము పరాంబికరా— గురుతుంచుకో.-'

'గురుతించినాను :'

'అంబా అనరా !- అనవేమిరా !-'

—అంబా !- అని- దిశలు మార్మోగే ఎలుగు-

పలికినది ఒక గొంతు కాదు- పదిపదుల కెక్కువ - !

'ఆలకించినావుగా,- గోగణమునకున్న వివేకము గోవిందలుకొట్టి- పొర్లు దణ్ణములు పెట్టు- యీ నరజాతికిలేదు -!'

'నరజాతికే లేదా ?- యీగిరిని నమ్ము కున్న వానరజాతికీ లేదా ?-'

'లేదా?- ఓరి అపసద ! వారు వానరులా? వైశ్వానరులురా - యీ కొండ చిదగ్ని కుండమురా- అవి కిచకిచ కాదురా-శివశివ! పలికి భజించరా, నమ్మి తరించరా-'

'స్వామీ !- యీగిరిని చేరి తరించని వారెవరు ? నేను నరజాతివాడను : వానరుడ నయే యోగము నాకు లేదు: ఫాలమున కుంకుమరేఖ తీర్చినంతలో వాలముపెరిగేనా? కోక కట్టించినారే అనుకొందము : లేని కొమిరె ప్రాయమబ్బేనా, గుబ్బెత నయేనా,- అయ్యా,- ఆడవేషము కట్టి,- ఆ పరమే శ్వరునంత వానిచేత హంవో.- అనిపిం చుట- ఒక్క- ఆదివిష్ణువునకే చెల్లినది: మనము కనుల కాటుక దిద్ది- వలెవాటుగా, పయ్యెద సవరించుకున్నా,- పరమశివునికి తనువేదురు కలిగేనా, మగవాడైపుట్టి,- పాపము మనసేవలకై- మగువ తనాలకు బోయినాడే, అని మహేశ్వరి కరు ణించేనా- తెలియ కడిగేను కనులురుమ వద్దు-


ఎవరికేరూపున దోచినా,- ఎవరే తీరున భావన జేసినా,- కొండకొమ్మున ఉన్న దొక్కడే-! కనులు రెండు కాని,- చూపొక్కడే !- అంబా అన్ననూ గోవిందా అన్ననూ పలికెడి దొక్కడే!- గురుతుంచ కొనండి-'

'ఓరి భ్రష్టా !-'

'యీ భ్రష్టుడు,—వాని అనుగ్రహమున్న అదృష్టవంతుడు : మీదారి మీరైనా- నాదారి నాదైనా- చేరుకునే దొక్క తావునకే- తాము,ఎటు నడచినా, మరల కలియక మానము : ఎక్కడ ? అకడ !- జయ గోవిందా !'

ఆడుపోడిమి వలెవాటుజేసికొన్న ఆ కొప్పువాడు, చురచురజూసి,- యీవంక, ఆవంక మెడత్రిప్పి హుంకరించి,- తన దారిని బోయినాడు !

అన్నమయ్య యింత ముందుకు సాగి నాడు ! వెనుకనుండి సమ్మర్దము ముంచుకు వచ్చినది. ఆ కోలాహలములో వానిగొంతు కలసిపోయినది ! జోడించిన చేతులు ఆ తీరుననే ఉన్నవి! అందరూ ఎటు మ్రొక్కిన తానటు మ్రొక్కి,- ఎటసాగిలపడిన అట సాగిలపడి,- ఎట మోకరిల్లిన అట మోక



రిల్లి,- కొంతతడవు నలుగురిలో కలసి నడచి,- క్రమముగా వెనుకబడి,- మరల తనకు తానై,- అడుగుతీసి అడుగువేస్తూ ఉండంగా,—

గోధూళి వేళ - ఏనెత్తమ్మునుండియో గరుడపక్షి - గురో - అన్నది: సంజెగాలి మెలమెల్లన బుసగొట్టినది ! ఎదుట మసక క్రమ్ముకుని, రోదసిని కారుపట్టి,- పైన కమ్మిన మొయిలు ఆదిశేషువంత విప్పారి,- పుంజె పుంజె పడగవిప్పి,- వేయి జిహ్వలు తొణికినటుల,- వేయికివేయి కన్నులు మెరుకు మన్నటుల చుక్కల తళుకు! తన కనుల కాతళుకుకట్టినది: తన మెడనున్న తులసిమాలకు, వెన్నెల సోకినది.! జయ గోవిందా !-

ఎదుట ఆలమంద ! మందవెంటనుండి ఆలగాచే మందయానలు,- కిలకిలలు పోయే పోయేవారు,- ఒకరిమీదకు ఒకరొరిగే సర సాలవారు,- పలుకాడి చక్కిలిగింతలయే వారు,- పరవశాన నడచేవారు !- వారిచేత సాలదు తలుతేవు ! ఆ దుత్తలు మోసికొని వచ్చేవి - కోతులు!-:

అన్నమయ్య,చూసి ఓహో.- .అని నాడు - అయ్యా,- నన్ని సేవలకు నియో గించవయ్యా,- నాకీ పుణ్యము చాలునయ్యా!- అనుకొన్నాడు.!

[సశేషం]



మీరు మరీ లావుగా వున్నారా?

* సుకుమారి

గతుక్కుమన్నాను—ఒక పత్రికలోని యీచిన్న శీర్షిక చూసి. హతోస్మి !! నేనూ లావేగామరి. అదీగాక నా మనస్సు ఒక్కసారి వెనక్కి తిరిగిచూసింది

"సుకుమారీ ! నీకు చలెయ్యదనుకుంటానూ" అర్థోక్తిలో ఆగిపోయిందినా క్లాస్‌మేట్ డిశెంబర్లో ఒక సుప్రభాతాన పరీక్షలరోజుల్లో. "ఎందుకనిట" అన్నాను నేను అర్థంకాక ఆమెతోపాటు నడుస్తూ.

"లావుగా వున్నవాళ్ళకు చలెయ్యదట" అన్నది. ఇదెక్కడి విడ్డూరం: ఉలిక్కిపడి భయం, భయంగా చుట్టూ చూశాను-కాలేజి కాంపౌండ్‌లో ఎవరన్నా నన్ను గమనించారేమోనని. బ్రతికాను, ఎవరిగోలలో వాళ్లున్నారు.

"లావుగా వున్నంతలో మనుషులుకారా ఏవిటీ ?" అన్నాను యింకేమీ అనలేకా, సభ్యత అడ్డొచ్చి. వుక్రోషం దిగమింగలేకా. ఏదో సామెతచెప్తారే "మొగుడు కొట్టినందుక్కాదు. తోడికోడలు నవ్వినందుకుట" అని. ఇంతాచేసి ఆమెచెప్పిన సమాచారం : "చలిరోజులుగదూ తెల్లవారుజామున లేవలేకపోయాను. బొత్తిగా వీకయిపోతున్నానంటున్నారు మా ఫాదరూ" అని. ఏడవలేక నవ్వేశాను. మామూలుగా ఐదుగురు కూర్చునే బెంచీలో ఏడుగురు కూర్చోవాలి అనేవారు. అదీ ఫస్టు బెంచీలో. ఖర్మం చాలక యిరుగ్గా ఫీలవుతే, అదేదో మహా త్యాగం చేసినట్లు మొహంపెట్టి, ప్చ్. మేం సర్దుకోలేదూ ! అనేవారు.

"నీకీ వొళ్ళు ఎవర్నిబట్టి వచ్చిందోయ్ ? మీ అమ్మగార్నిబట్టా, మీ నాన్నగార్నిబట్టా" అంది ఒక క్లాస్‌మేట్. ఏంచేస్తాపూ వూరుకున్నాను.

ఈ వూరుకోటం కూడా పెద్ద పొరపాటయింది.

"లావుగా వున్నవాళ్ళకి కోపం తక్కువట, ఏ దెబ్బలాటలోకో దిగితే, శరీరాన్ని తేలిగ్గా కదపలేరుట." ఇదో రూలు. దీనికి తలవంచి వూరుకున్నాను. మా జూనియరొకామె వుండేది. చాలా లావే. కాని మహారాణీలా ముందు నడిచి పోతుంటే వెనక నోరెత్తేవాళ్ళని ఉగ్రకాళిలా నోరు ఝాడించేది. దాంతో కిక్కురుమంటే ఒట్టు : భేష్. లావుగా వున్నవాళ్ళకి కోపం తక్కువన్నవాళ్ళకిదొక చెంపపెట్టు. ఏమంటారు ?

"ఛ, ఛ, నీ సుకుమారి అన్నపేరులో "సుకు" తీసేసి, "మారీ" అని పెట్టాలోయ్." అంది మరొక మహిళ - మారీ అన్న పదాన్ని వికృతంగా పలికిస్తూ. ఆ క్షణంలో నా కనిపించిందేమిటంటే నేనే ఏ విలియమ్ బ్లేక్‌గానో పుడితే, లిటిల్ బ్లాక్ బోయ్ వైట్ సోల్‌ని గురించి కాక స్థూలశరీరుల సుకుమార హృదయాన్ని గురించి రాసి ఏ నోబెల్ ప్రైజో పొందేదాన్ని. ఆ మధ్య ఏదో పత్రికలో లావాటి భార్యాభర్తల గురించికథ "ఒత్తు థ"కాబోలు చదివాను. లావుగా వున్నారూ అనకుండా "ఒత్తు థ" అనడం - యిదీ కొంతవరకూ బాగానే వుందనిపించింది. నాకు తటస్థపడ్డ ప్రతివారూ, ఏదో విధంగా "నువ్వు లావు" అనే మాటను డైరెక్టుగానో ఇన్‌డైరెక్టుగానో నాకు తెలిసేట్లు చెబుతూనే వున్నారు కనీసం లావుగా వున్నానన్న బెంగతోనన్నా చిక్కిపోతే బావుండుననిపించేది. ఊహూం లాభంలేదు. చిట్కాల్లో చెప్పినట్లు బెంగతో మరికాస్త లావెక్కుతారట.

నాబాధను గురించి ఓపిగ్గా వినే అన్నయ్యతో మొరపెట్టుకునేదాన్ని. అన్నయ్య నవ్వుతూ "నువ్వు మాకన్నా కాస్తవలంగా వున్నావు. అంతే" అనేవాడు. "ఈమాత్రం ఆ వుండాల్లెద్దూ. కొంచెం పొడుగెదుగు. పోనీ బొంబాయి వెళ్ళి ఏరెండు, మూడు




వేలో పెట్టి ప్లాస్టిక్ సర్జరీ చేయించుకుంటావా" అనేవాడు సీరియస్‌గా. ఏ రెండు మూడువేలో అనే మాటను అతి తేలిగ్గా ఉచ్చరిస్తూ. "వీళ్ళనే మాటల్ని విట్గీగా తీసుకుంటే నీకే బాధావుండదుకదా!" అనేవాడు. తమ్ముడయితే మరీను. "భానుమతి కథలో చెప్పినట్లు (ఆకథ నే చదవలేదు లెండి) ఏరోడ్డు రోలరో రాత్రిపూట లాగుతూ వుండు. నీ వెనకే నేను ఫ్లాస్కునిండా ఓవల్‌టీన్, ప్లాస్టిక్ బుట్టనిండా పళ్ళు పెట్టుకుని నిలబడతా. కొంచెంసేపు లాగటం, కొంచెం ఓవల్‌టీన్ త్రాగటం, ఒకపండు తినటం. ఏం అలా చేద్దామా" అనేవాడు. దాంతో నాకూ నవ్వొచ్చేది.

ఎప్పుడన్నా అరుదుగా కనిపించేవారు "సన్నబడ్డట్టున్నావే" అనే వారనుకోండి. మొహం చిట్లించి చెవులురెండూ మూసుకుని "రామ, రామ, అలాటి మాటలు నా దగ్గిరెత్తకండి. నా డిక్షనరీలో అలాటి మాటకు అర్థంలేదు" అనేదాన్ని. దీంతో ఎదటివాళ్ళు నవ్వేసేవాళ్ళు. "గుంజీలు, బసీ్కలు తియ్యి. సన్నబడి పోవచ్చు" అన్నది నా ఫ్రెండ్ ఒకామె. భేష్. బాగుందని గుంజీలు తియ్యటం మొదలెట్టాను. అబ్బ! కాళ్ళల్లో ఇంతలావు బిళ్లలుకట్టి నడవలేనంత బాధ. ఈపద్ధతి లాభంలేదని వదిలేశాను. నిమ్మరసం ప్రొద్దుటే నీళ్ళల్లో పిండుకు త్రాగితే సన్నబడవచ్చన్నారు. ఇది శ్రమలేని పద్ధతి. ఏం లాభం. నాకు పనిచెయ్యలేదు. వరసగా పదిరోజులు త్రాగితే, పడకొండోనాడు, విపరీతమైన దగ్గూ, రొంప, పదిశం సినిమాలో ఎడ్వర్ట్ ఫైజ్‌మెంటులాగా. ఇహ అక్కణ్నుంచీ బ్లడ్ టెస్టులూ డాక్టరు మందులూ పెద్ద వాళ్ళ కేకలూ, వగైరా, వగైరా. ఏది ఏమైనా నా యీ లావుపాటి శరీరం వయసుకి మించిన అనుభవాల్ని ప్రసాదించింది.


అసలు, యింతకూ చెప్పొచ్చే దేమిటంటే, "మీరు మరీ లావుగా వున్నారా?" అన్న శీర్షికలో చెప్పినట్లు. అందమైన నాజూకు బొమ్మల్ని చూసి సంతోషించటం. యిది మొదటి చిట్కా. కత్తిరించి పెట్టుకున్న "బాపూ" బొమ్మలపూజ రోజూ ఒక గంట తీరిగ్గా చేస్తూనేవుంటా. నాజూకు నారీమణుల వర్ణనలు సాధ్యమైనంత వరకూ బట్టీ పడుతూనేఉంటా. తీపిజోలికి మాత్రం పోకండి అన్నది రెండవచిట్కా. కాఫీలో పంచదార వేస్తారని, కాఫీకూడా మానేశా. రెండుపూటలా భోజనం, టిఫిన్లూ తగ్గించేశా. అందంగా భోజనాలు అమర్చడంలో నిమగ్నమయిపోవటం మూడవ చిట్కా. కాబోలు. అదీ తు.చ. తప్పకుండా ఆచరిస్తాను. రచయిత్రిగారు చెప్పినట్లు, కాలమే తేవచ్చు నేననుకున్న మార్పు. నా అనుభవాల నిలా రాసుకుంటూ పోతే ఇంతలావు గ్రంథమయ్యే అవకాశం వుంది. అందుకే నాకు భయం. ఇహ వుంటా. ఏది ఏమైనా లావుగా వున్నంతబాధ మరొకటి లేదనుకోండి.

□□□





నిత్యానందంగారి సాంసారిక విజయాలు



"పొద్దెక్కినా తలుపు తీసి పూడిపడరేం? అమ్మాయ్ సుబ్బమ్మా, వాడికి లేకపోతే మానె, నీకైనా బుద్ధిలేదే? ఎంతసేపు గడియ బిడాయించుకు పడుకుంటారు" అని అమ్మ సాధింపు ప్రారంభించింది.

అమ్మకి నాలుగున్నరనించీ నిద్దరపట్టదు. నాయనమ్మలాగ గజేంద్ర మోక్షంలో పద్యాలూ భజగోవింద శ్లోకాలూ చదువుకుంటూ మంచంమీదే నడుంవాల్చి వుండిపోదు. లేచి యిల్లంతా సవరిస్తుంది. ఒంట్లో బాగాలేకపోయినా, చచ్చేదాకా వెట్టిచాకిరీ తప్పదని గొణుక్కుంటుంది. విసుక్కుంటుంది.

"లేవరా నిత్యానందం. యెండెక్కిపోయిందిరా"

కళ్లు నులుముకుంటూ లేవబోయాను.

'ఇంకా బద్ధకం తీరలేదు. పడుకోండి' అంది మా ఆవిడ.

"యెండెక్కిపోయిందట" అన్నాను.

"మరేం పరవాలేదు. ఇంకా అరున్నర కాలేదు. ఈ వెధవ్వూళ్లో తెల్లారకుండానే యెండొస్తుంది. మీనాన్న ఆఫీసుకి టైముని బట్టి వెళతారా. యెండనిబట్టా! పడుకోండి. పడుకోండి"

"నే లేస్తాను. నువ్వు పడుకో"

"మీరుమాత్రం లేచి వెలగబెట్టే రాచ కార్యాలేమున్నాయి. మొగుడు లేచినా యింకా పడుకుందని నన్ను ఆడిపోసుకోడానికా. మీరూ పడుకోండి" అని దదాయించేసింది.

"లేవరా"

"పడుకోండీ"

"నిన్నేరా"

"మిమ్మల్నేనండీ"

"లెమ్మంటే"

"పడుకోమంటే"

అవతల తల్లి. గదిలో భార్య. ఎవరు గెలిచారా? ఏమిట్రా. చొప్పదంటుప్రశ్న? ఇలాటి విషయాల్లో ఎవరు గెలుస్తార్రా?

"వొరేయ్. ఎంతసేపురా మొద్దునిద్దర లే" అని మానాన్న అందుకున్నాడు. ఉలిక్కిపడి లేచి కూచున్నాను. నాన్న అందుకుంటే రంధోలువాయించినట్టే. ఇహ లాభంలేదు. లేచి బయటికి పోతేనేమంచిది.

"అనవసరమయిన విషయాల్లో జోక్యం కలగజేసుకుంటున్నారు మీ నాన్న" అంది మా ఆవిడ. తనేదో మహాసత్యం మొట్టమొదటి మాటుగా కనిపెట్టినట్టు. నాకెప్పుడో తెలుసునయ్యో ఆ సంగతి. లేకపోతే ఈపెళ్ళి మాత్రం జరిగుండేదీ! మొదట ఇష్టంలేదన్నానే. ఆ అమ్మాయే. ఇప్పుడిష్టమే. ఎలా మారిపోయానా? ఒరే. పిచ్చిప్రశ్న వెయ్యకు. పెళ్ళామంటే అందరికీ ఎలా ప్రేమపుట్టుకొస్తుందో, నా కూ అలానే. వొరేయ్ కాస్సేపు నీ కుళ్ళుంకలు కట్టేసి. విను. ఏం చెబుతున్నానూ. మా నాన్న అనవసర విషయాల్లో జోక్యం చేసుకుంటున్నాడని మా ఆవిడ అందికాదూ.

"అవును. ఆ సంగతి నాకెప్పుడో తెలుసు" అన్నాను.

"అనవసర జోక్యం కలగజేసుకోవద్దని చెప్పండి" అంది.

"నేనే? మానాన్నతోటే? కరుస్తాడు."

"కరవడానికి కుక్కా యేమిటండీ. మనిషేగా?"

"నీకేం నువ్వేమైనా చెబుతావు. ఎదట పడేది నువ్వా నేనా?"

"ఏమిట్రాగదిలో గుసగుసలు. లేచి రమ్మంటేను" గుండెలుఅదిరిపోయేలాగ నాన్న కేక. ఎదిగి, పెళ్లాంతో కాపురంచేస్తున్న కొడుకుతో అనవలసిన మాటే? 'నాన్నగారూ, ఇలా నాతో మాట్లాడ్డానికి వీల్లేదు. మా ఆవిడ వింటూంటే నామీద అధారిటీ చెలాయించడానికి వీల్లేదు' అని లేచి చెప్పేద్దామనుకున్నాను. కాని నేను వూరికే లేచిపోతున్నాననుకుంది కాబోలు మా ఆవిడ. నే లేవకుండా అదిమిపెట్టి "ఆయనకి తలనెప్పిగా వుందండీ. లేవలేకుండా వున్నారు" అని జవాబు చెప్పింది.

"అజీర్తి తిళ్ళు తింటే తలనొప్పి రాకేం జేస్తుంది!"


"నిన్నరాత్రి తిన్నగా భోంచెయ్యనే లేదు."

"సాయంకాలం టిఫిను మస్తుగా తింటే రాత్రి భోజనమెందుకు!"

"ఏతలనొప్పయినా. లేచి వొళ్ళువొంచి పనిచేస్తే అదే పోతుంది"

"అదిపోతేగాని లేవడానికి ఓపికరాదు. లేస్తే తల తిరుగుతుంది."

మానాన్న వెనక్కి తగ్గాడు.



"తలతిరుగుతోందీ? జ్వరమొచ్చిందేమో చూడనీ" అని మా అమ్మ కేకెట్టింది.

"జ్వరం లేదులెండి"

"అన్నీ తెలిసినట్టు మాట్లాడతావేమిటి? వొళ్ళు చూడనీ"

"నే చూసే చెబుతున్నాను. చల్లగానే వుంది".

"మా అబ్బాయి సంగతి నీకు తెలీదు. పైకి చల్లగా వున్నా ఒక్కొక్కప్పుడు ఉష్ణం వుంటుంది."

"దానికి ముసుగెట్టుకు పడుకోడమే మందు."

"శొంఠికొమ్ము అరగదీసిపెడితే రెండు నిమిషాల్లో తలనొప్పి పోతుంది".

"ఆనాటు వైద్యపు రోజులు పోయాయి. ఇప్పుడు అంజనాలకి, ఆస్పిరిన్‌లకి గాని లొంగడంలేదు ఈ తలనొప్పులు."

మాటకిమాట జవాబు చెబుతూ పావుగంట దాకా మా ఆవిడ తను కదల్లేదు, నన్ను కదలనివ్వలేదు. కొంత అయిన తరవాత "బద్ధకం బలిస్తే. తలనొప్పేగాదు. ఒళ్లంతా నెప్పులు పుట్టుకొస్తాయి. లేచి మందన్నా మింగమను" అని నసుక్కుంటూ నాన్న జారుకున్నాడు.

"అన్నిటికీ అదే జవాబు చెబుతుంది కాని వీడినోరు పెగలదేం?" అని గొణుక్కుంటూ చివరికి అమ్మ జారుకుంది. మరో పావుగంట విశ్రాంతి తీసుకునిగాని మేం బయటపడలేదు. తరవాత ఒకటి రెండు మాట్లు మళ్ళీ మమ్మల్ని పెందరాళే లేపడానికి ప్రయత్నంచేశారు కాని. మనం కొరకబడలేదు. ఏమిటనుకున్నావురా. నిత్యానందమంటే? మనకి కొంత మాట సాయం. వెనకదమ్ము వుండాలిగాని. నే లేస్తేమనిషిని గాను. మా నాయనమ్మ బతికివున్నరోజుల్లో. నీకు జ్ఞాపకం లేమూ. అప్పడాలపిండి మాస్టారుకూడా నేనంటే హడలుపుట్టింది. అప్పడాలపిండి మాస్టారెవ్వరగవురా. గవర్రాజుగారిబడిలో రెండో మాస్టారు. చిన్నప్పు

డెప్పుడో వాళ్ళమ్మ అప్పడాలపిండి కలిపి పెట్టుకుంటే దబ్బకాయంత ముద్ద ఎవరూ చూడకుండా యెత్తుకుపోయి. స్వయంగా అంతా భక్షించేశాడుట. దాంతో నాలుగు రోజులు వి రో చ నా లు పట్టుకున్నాయట. కలరా వొచ్చిందేమోనని రెండు రోజులు మందు లిప్పించిం తరవాత యీ సంగతి బయటపెట్టాడుట: అంచేత వాళ్ళింట్లోవాళ్ళే అప్పడాలపిండి అని ముద్దుపేరెట్టుకున్నారుట. వాళ్ళ వాళ్ల పెట్టుగున్న పేరేగదా. సంతోషంతో స్వీకరించగూడదూ! ఆమాట ఏ రూపంలో వినిపించినావుడుక్కునేవాడు. తిట్టేవాడు. కొట్టేవాడు. పేబెత్తంతోకాదురా. రూళ్ళకర్రతో కొట్టేవాడు. ఎక్కాలువల్లించమనడం తప్ప క్లాసులో చెప్పేపాఠం లేదు.. దానికి తోడు వా డి కి న త్తికూడాను. బకాసురుడు ఆదేదో వూరిమీదపడి అందర్నీ పీడించుకు తిన్నట్టుస్కూల్లో పిల్లల్నందర్నీ పీడించుకుతినేవాడు. కాని బకాసురుడు ప్రాణానికి భీముడు తటస్థపడ్డాడు. అప్పడాలపిండి మా స్టా రు కి ఏకు మేకై గుచ్చుకున్నాడు నిత్యానందం. ఎలా గంటావా? ఓనాడు మా నాయనమ్మంది "ఔరే నిత్యానందం. అప్పడాలు యెండబెట్టాను. కాకులు రాకుండా కాయరా" అంది.

"కాకుల్నయితేకాస్తానుగాని. పిచ్చికల్ని పిలుస్తాను నాయనమ్మా" అన్నాను.

"వీపుచిట్లగొడితే బావురుమని యేడుస్తావు కూడాను" అన్నాడు మానాన్న. మా నాన్నకి 'జోకులు' తెలిసేవికావు. మా నాయనమ్మ మాత్రం నిత్తిగాడికి కవిత్వం చెప్పడ మొస్తుంది.' అని సంతోషించింది. ఉష్ ఉష్ అని కాకుల్ని కాసి అలిసిపోయి. ఆలిశ్యంగా స్కూలుకెళితే మాస్టారు పట్టుకున్నాడు.

"ఏ ఎందుకింత ఆలశ్యమయింది"

"మాస్టారండీ మరేమోనండీ...."

"ని ని నీఋ్ళ ననసమలకు"

"మా నాయనమ్మంది అప్పడాలు ఎండబెట్టి కాకుల్ని కాయమందండి. అంచేత ఆలశ్యమయి పోయిందండి".

"భ భ భడవా బె బ్బెంచెక్కు"

"నేనేం చెయ్యలేదండి మాస్టారూ. మా నాయనమ్మే అప్పడాలు ఎండబెట్టి కావలా వుండమందండి. మాయింట్లో కాకులు చాలా యెక్కువ. కాపలాకాయకపోతే అప్పడాలు బతకనివ్వవు."

"పు పుండాకోర్ గొగ్గోడ కుర్చీవెయ్యి."

"తప్పంతా కాకుల్దండి. నాది కాదండి."

"వీపు చిచీరేస్తాను వా వాళ్లవుతికేస్తాను" మాట వినిపించుకోడు. ఒకటే ధుమధుమ. "చెచెయ్యిపట్టు" అరిచెయ్యి వెనక్కి తిప్పి రూళ్ళకర్రతో ముడికలమీద వాయించాడు. "మా నాయనమ్మతో చెబుతానుండండి" అని ఏడుచుకుంటూనే స్కూల్లోంచి పారిపోయాను. నాయనమ్మ రెట్టింపు పటికబెల్లం పెడితేనేగాని. ఏడుపు మానలేక పోయాను.

"నే నింక ఆ స్కూల్లో చదువుకోను నాయనమ్మా. మరోస్కూల్లోచేర్చేసెయ్యి!"

"వెర్రినాన్నా. అర్ధాంతరంగా యింకో స్కూల్లో యెలా చేర్చుకుంటార్రా"

"నువ్వు చెబితే చేర్చుకుంటారు"

"ఏడాది మధ్యలో నేచెప్పినా చేర్చుకోరురా"



"అయితే ఈ యేడు చదువుమానేస్తాను. అప్పడాల పిండిగాడు కొట్టిచంపుతున్నాడు. వాడిదగ్గర నే చదువుకోను."

"కొట్టొద్దని నే చెబుతానులే"

"వాడూరికే వుడుక్కుంటాడు. అనవసరంగా దంచుతాడు. చెప్పే పాఠాలుతక్కువ. కొట్టే దెబ్బలెక్కువ."

"వీజోలికి రావొద్దని నే చెబుతాగా"

"మెల్లిగా చెబితే లాభంలేదు."

"గట్టిగానే చెబుతాలే. వెళ్ళు"

"నువ్వొచ్చి దిగబెడితేనేగాని వెళ్ళను"

పదినిమిషాలు బేరమాడిన తరవాత. మళ్ళీ కసింత పటికబెల్లంపెట్టి నాయనమ్మ కర్ర పొడుచుకుంటూ నాతో స్కూలుకొచ్చింది. నాయనమ్మ యింట్లో నడవడానికి కర్రసాయం అక్కర్లేదుగాని. రోడ్డుమీద నడవాలంటే కర్ర చేతులోవుండాలి కుక్కల్నీ పందుల్నీ ఝడిపించడానికి. తిన్నగా క్లాసులోకే వెళ్లిపోయాం. "నాలుగుమూళ్ళ పన్నెండు. నాలుగునాళ్ళ పదహారు" అని క్లాసంతా అరుస్తున్నారు. అప్పడాలపిండి వెంకన్న బుగ్గలు నులుముతున్నాడు. నన్నూ. మా నాయనమ్మనీ చూ డ గా నే క్లాసంతా నిశ్శబ్దమయిపోయింది. అప్పడాలపిండి నాకేసి గుడ్లురిమి చూశాడు. నాయనమ్మ వెనకాలుంటే నాకేం లెక్క. పోపో, చూచుకో అనుకున్నా.

"ఏమయ్యా. ఎందుకయ్యా పిల్లల్ని అలాకొట్టి చంపుతావు" అంది నాయనమ్మ. "రూళ్ళకర్రతో వేళ్ళమీద కొట్టావట. మా వెర్రినాగమ్మని"!

"అల్లరి చెచేస్తే పనిష్మెంటు ఇఇవ్వొద్దా".

"పిర్రమీదకొట్టే దెబ్బకి ఫిర్యాదులేదుగాని, వీళ్ళమీదకొడితే వూరుకుంటారుటయ్యా. అయినా మావాడిప్పుడు ఏం అల్లరిచేశాడని కొట్టినట్టు" దానికి జవాబు చెప్పగలిగితేనా. గుడ్లు మిటకరించి చూశాడు మాష్టరు.

"నాయనమ్మా, నువ్వు అప్పడాలెండబెట్టి నన్ను కాకుల్ని కాయమన్నావా. ఎందుకాలక్షేపంగా వొచ్చావని అడిగితే మాస్టారూ, మా నాయనమ్మ అప్పడాలు యెండబెట్టి కాకులెత్తుకుపోకుండా కాయమంది అన్నాను. అంతే. అప్పడాలు అనగానే ఆయనకి కోపమొచ్చింది. నువ్వే చెప్పు అప్పడాలు అన్నాను గాని అప్పడాలపిండి అన్లేదుగా. ఇందులో తప్పేమన్నా వుందా ?"

"అయ్యో, అప్పడాలపిండీ. ఇన్నేళ్ళొచ్చినా ఇంకా వుడుక్కుంటూనే వున్నావుటయ్యా"

"ఏమండోయ్ బామ్మగారూ, పెద్దవారని మర్యాదగా వూరుకుంటే" అప్పడాలపిండి గుడ్లెర్రజేశాడు, నాయనమ్మ ఝడుస్తుందా !

"ఉడుకుడుకు బోలె" అంది. క్లాసంతా గొల్లుమన్నారు. ఏం జేస్తాడు ఆయన, చేతులో రూళ్ళకర్రయితే, మా నాయనమ్మ చేతులో పెద్దకర్ర. మా నాయనమ్మతో చాల్లేదుగా.

"మావాడిజోలికి ఇంకెప్పుడూ రాకు. వాడివల్లేమన్నా తప్పువుంటే నాతో చెప్పు. నే కూకలేస్తాను ! అని కట్టడిచేసి వెళ్ళిపోయింది. ఆ తరవాత వయా నాయనమ్మ, మనమంటే హడల్. ఇప్పుడు వయా మా ఆవిడ మన అథారిటీ మళ్ళీ లేచిపోయింది. మొదటి విజయం నిత్యానందంగారు యిష్టమొచ్చినంతసేపూ, విశ్రాంతి తీసుకోవొచ్చును. వారిని లెమ్మని వొత్తిడి చెయ్యడానికి ఎవరికీ అధికారం లేదు. ఎవరైనా ఆ విషయం గుర్తించక ఒత్తిడి చేసినా, నిత్యానందంగారు, ఖాతరుచెయ్యరు. హాయిగా నిద్రపోతారు, నిద్రపట్టకపోతే, కళ్ళుతెరిచే నడుం వాలుస్తారు. లేదా, పక్కమీద పడుకుని, అటూ యిటూ దొర్లుతారు. కాని, లేవరు. ఆదేవిధంగా నక్షత్రకుడి బాధ వదిలిపోయింది, మా పెళ్లయింతరవాత వాడిపోరు భరించడం మరీదుర్భరమయింది. నాకేకాదు, మా ఆవిడకి కూడా సలహాలివ్వడం ప్రారంభించాడు....బోడిసలహాలు. మా పెళ్ళి తనవల్లే జరిగిందిట. వెయ్యి అబద్ధాలాడి యిల్లు నిలబెట్టాలన్న సామెత పట్టుకుని ఎంతో కష్టపడి, ఈ సంబంధం కుదిర్చాడుట. అంచేత మా సంసారం దిద్దడానికి తనేదో బోలెడు హక్కులు దాచిపెట్టుకున్నట్టు అన్నివిషయాల్లోనూ, ఐడుంగున జొరబడి, చెప్పొచ్చేవాడు.

"ఏమిటోయ్ నిత్యానందం, మీ అమ్మగారు గోలెట్టిపోతున్నారు. అవిడొచ్చిందగ్గిర్నుంచీ అమ్మగారిమాట అసలే వినడం లేదుట. మీ అమ్మ నీమీద ఎన్నో ఆశలు పెట్టుకుంది, ఎప్పుడు కోడలొస్తుందా, ఎప్పుడు సుఖపెడుతుందా అని ఎదురుచూసింది, కాని చిన్న మెత్తు సాయం చెయ్యదుట నీపెళ్లాం. ఎక్కడ కందిపోతుందో అని అన్నిటికి వెనకేసుకొస్తావుట. మా అందరికీ పెళ్ళిళ్లవలేదా? పెళ్లాలు కాపరానికి రాలేదా ? తప్పుసుమా. పెళ్లాన్ని అదుపులోవుంచుకోవాలి. అతి చనువిచ్చి ముద్దుచేస్తే ముక్కట్టుకుంటాడు. 'తల్లివిషమాయె, పెళ్లాము బెల్లమాయె' అవకూడదు"



మనవాడి ఉపన్యాసాలు వినే రోజులు పోయాయి. 'ఈ గోడలకీ ఆ స్తంభాలకీ చెప్పుకో' అని వాడు ప్రారంభించగానే చల్లగాజారి పోయేవాడిని.

"చూడు సుబ్బమ్మా" అని మా ఆవిడ దగ్గిర ప్రవేశించేవాడు, "నీపెళ్ళి చేయించిన వాడిని కనక, నీ మంచి కోరిన వాడిని కనక, చెబుతున్నాను" అని ప్రతిమాటూఉపోద్ఘాతం. "మా పెళ్ళిచేయించింది పురోహితుడయ్యా, నువ్వుకాదు" అందామనుకునే వాడిని "అత్తగారికి అణకువగావుండాలి. గుట్టుగాసంసారం దిద్దుకోవాలి."

"అవునండి అబద్ధాలాడ కూడదు. దైవభక్తి కలిగివుండాలి. పెద్దలమాట ధిక్కరించరాదు. ఇంకా చాలానీతులు స్కూల్లోనే నేర్చుకున్నానండి." అని మాఆవిడజవాబు. ఏ మాత్రం బుద్ధున్నవాడయినా ! దాంతో వెనక్కి తగ్గవలసిందేనా....కాని వాడికి సున్నితంగా చెబితే అర్థం కాదుగా. అలా నీతులు చెబుతూనే వున్నాడు. సలహాలు యిస్తూనే వున్నాడు.

"నీకే ఓకొడుకున్నాడనుకో. వాడు పెద్దవాడయినాక పెళ్ళి చేశావనుకో. కోడలు యింటికి కాపరానికొచ్చి నువ్వు చెప్పిన మాట సుతరామూ వినలేదనుకో. అప్పుడు నీకెలా వుంటుంది. ఆలోచించుకో". మా ఆవిడకింకా నెలలన్నా తప్పలేదు. వాడు అనుకోమన్నవన్నీ ఆలోచించుకుంటే బుర్ర గిరగిర తిరిగిపోదూ. మా ఆవిడ విసిగిపోయిందంటే తప్పా. విని విని చివరికి ఓనాడు మా ఆవిడంది.

"నక్షత్రకుడుగారూ, నాదోచిన్నకోరిక" ఆ పేరు వినగానే వాడు బిక్కచచ్చిపోయా

దనుకో. ఇన్ని రోజుల్నించీ వాడికిపేరంటే పెట్టాముగాని. ఎదటబడి ఆపేరెట్టి ఎప్పుడూ వాణ్ణి పిలవలేదు.

"నక్షత్రకుడుగారూ, మాయింటినించి పీకేదు జీడిపప్పుపాకం తెప్పించిపెడతాను గాని. మాకు సలహా లివ్వడం మానుకుంటారూ?" దాంతో వాడి ప్రైప్రాణంపైన పోయింది. మొహంపాలిపోయింది. నిజమే. నలుపుమనిషి కనక ఎంత పాలిపోయినా, మొహంలో కనిపించదనుకో. కాని వాడి వాలకం చూస్తే పాలిపోయినట్టు తెలిసిపోయింది. వుండరా చొప్పదంటు ప్రశ్న వేసి చంపొద్దని చెబితే వినిపించుకోవేమిట్రా? మా ఆవిడ యింతగట్టిదని తెలిసుంటే. ఈపెళ్ళిరికమెండు చేసేవుండనని. అమ్మతోటో, ఇంకా యెవరెవరితోటో చెప్పుకు యేడ్చాడుట.

"ఏడవకు ఏడవకు వెర్రినాగమ్మ. ఏడిస్తే నీ కళ్ళు నీలాలుగారు" అని ఓదారుద్దామనుకున్నాగాని. మన వేళాకోళం అర్థంగాక. తిరిగి తగులుకుంటాడేమోనని కిక్కురుమనకుండా వూరుకున్నా. పర్యవసానం. మా జోలికి రావడం మానుకున్నాడు.

నక్షత్రకుడి నోరు మూయిస్తే బాగానే వుందిగాని. నా స్నేహితుల్ని కూడా యుడిపించి నే వాళ్ళని కలుసుకోనివ్వకుండా చేస్తోందిరా! ముఖ్యంగా బండరాముణ్ణి. బండరాముడు నీకు తెలుసుగా. ఒకటో క్లాసునించి నేనూ వాడూ స్నేహితులం. నేను స్కూలుకెళ్ళనని మారాము పెడుతూ వుంటే వాణ్ణి మచ్చికచేసి, సాయమిచ్చి స్కూలుకి పంపించింది. నాయనమ్మ. నేనంటే వాడికి తగని ఇష్టం. నామీద ఈగవాలనిచ్చేవాడుకాడు. అప్పుడప్పుడు నే చేసిన అల్లరికి, వాడు కిక్కురుమనకుండా దెబ్బలుతిన్నాడుకూడాను. బండ వెధవైనా, బుద్ధిమంతుడని నాయనమ్మే సర్టిఫికెట్ యిచ్చింది. మాట మోట అనుకో. మా ఆవిడదగ్గర జాగర్తగా వుండాలని వాడికి తెలియొద్దూ. ఓనాడేం చేశాడంటే. రోడ్డుమీద నించుని. "ఒరే నిత్యానందం పెళ్ళయిందగ్గర్నించీ నీ దర్శనమే మాకు కరువయిపోయింది. పడకగది వొదలడమే లేదు. ఈపద్ధతిని పీనుగయిపోతావు జాగర్త. సరసాలు చాలించి. బయటకిరా" అని యింటికప్పెగిరి పోయేలా అరిచాడు.

"ఎవరండోయ్ ఈ స్నేహితుడు"

"వాడా బండరాముడు"

"పోకిరీరాముడులా వున్నాడు"

"శబాష్. ఆ టైటిల్‌తో మరో సినిమా తీసి పారెయ్యొచ్చు. మాటలు నువ్వూ. పాటలు నేనూ రాసేద్దాం" అన్నాను. మా ఆవిడ మెత్తబడబోయింది కాని యింతలోనే "ఒరేయ్ బయటికొస్తావా. ఇంట్లో దూరబడి యీడ్చుకు రమ్మంటావా" అని వాడు మళ్ళీ అరిచాడు. వాడికి ఆవేశమొస్తే వొళ్ళు పైతెలీదు. అన్నంతపనీ చేసేస్తాడు. ఎవడో సవాలుచేశాడని యీత రాకుండానే కాలవలో వురికాడు. వుషారిస్తే. తాటిచెట్టు మీదకి పాకిపోయాడు. చచ్చేనంతపని అయ్యేదనుకో. అందుకే బండరాముడని బిరుదొచ్చింది. వాణ్ణికవ్వించడం కొరివితో తలగోక్కోడం.

"క్యా బాత్ హై. ఆడంగులంటే మనకేం భయంలేదురోయ్. రమ్మంటావా లోపలికి".

"వొద్దు నేనే వొస్తున్నారా. నువ్వులోపలికి దూరబడకు" అని ఆపేశాను. "ఇలాటి వెధవల్తో మీకు స్నేహమేమిటండీ" అంది మా ఆవిడ. మా స్నేహంయొక్క హిస్టరీ. జాగర్తలుచెప్పాను. చివరికి ఈ మాటుకి మాత్రం వెళ్ళనిస్తున్నాని వొదిలిపెట్టింది.



"పోకిరీ వెధవల్తో స్నేహం కూడదు చెడిపోతారంటుంది. ఇదివరకు రోజూ కలుసుకునే వాళ్ళం. ఇన్నాళ్లూ చెడిపోనిది. ఇహముందు మాత్రం ఎందుకు చెడిపోతాను అంటే వినదు. ఇప్పటికే చెడిపోలేదని గ్యారంటీ యేమి టంటుంది! ఒకొ్కక్కప్పుడు మహ మూర్ఖపు పట్టుబడుతుంది. ఆడవాళ్లంతా. ముఖ్యంగా పెళ్లాలంతా అంతేనా. అలాటప్పుడేం చెయ్యాలిరా. దంచాలా: ఏడిశావులే. పిచ్చి సలహాలు చెప్పకు. మా ఆవిడంటే ఇప్పుడు నాకు చాలాయిష్టంరా! ఆవిడొచ్చిన తరవాత మనకింట్లో చాలా సౌకర్యాలు ఏర్పడ్డాయి. అంచేత అప్పుడప్పుడు నాకు వొళ్లు రవరవమండిపోయి. డొక్క వాలికలు చేద్దామన్నంత కోపమొచ్చినా కొట్టడానికి చేతులు లేవవు. మనకే యెదురు తగులుతాయేమో నన్న భయమేమోనంటావా. పోరా. అలాటప్పుడు ఏం చెయ్యమంటావురా....అయితే బతిమాలుకోమంటావా! వొరేయ్ నే అదే చేస్తున్నారా! ఎలాగో అలాగ నామాట నెగ్గుకొస్తూనేవుంది. భయాన సాధించినా, నయాన సాధించినా విజయం విజయమే కదురా! ఎందుకురా ఆ నవ్వు. పో నీ పొరపళ్లే బయట పడతాయి. నాకేం!

□□□

సోమంచి యజ్ఞన్న శాస్త్రి

మానసోల్లాసము

వి.ఎ.కె. రంగారావు

కల

కలలో కన్య

కన్యకాదు దేవత.

ఎవరా దేవత? దైవదత్తమైన వరాలను మానవులు సక్రమంగా, సార్థకంగా, లోక కల్యాణార్థం వినియోగిస్తున్నారో లేక అయాచితంగా వచ్చినవని చులకన చేస్తున్నారో గణించి, అమరజ్యోతికి నివేదించే దేవత

సంబోధించింది. ఏ విధంగా?

'మానవుడా!' అని

పల్కాగా ప్రశ్నించింది. ఏమని?

'నీకు దేవుడిచ్చిన వరాలేవో తెలుసునా?' అని.

అన్నీ తెలియవుగాని, తెలిసినవివి.

సుఖజీవనానికి, కళాసృష్టికి కావలసిన హంగులు, ఉపాంగాలు, అంతస్థు, మేదస్సు అన్నీ ఉన్నాయనే సంతృప్తి. ఇవన్నీ వున్నా సృజిస్తున్న కళాఖండాల్లో ప్రాణప్రతిష్ఠ చేయగలమనే పరిపాకం యింకా కలగలేదనే అసంతృప్తి.

ఇతరులను, పై మెరుగులుచూసి మైమరచేవారిని మురిపించే బాహ్యసౌందర్యంతో వారిని మాట, మేనుతోనేకాదు మనస్సుతోను మమతతోను ఆకర్షించాలి, రంజింపచేయాలి, చివరకు జయించివశపరచుకోవాలనే మనో వికారం.

ఇతరులలో నామంచితనమే ప్రతిఫలిస్తుంది, నా సుహృద్భావమే ప్రతిబింబిస్తుంది, నామనోఘోషయే ప్రతిధ్వనిస్తుంది. అనే విశాల భావం. పరులలోకనబడిన మదమాత్సర్యాది మాలిన్యాలు కేవలం నాఊహాజనితాలే అనుకొనే సంకుచితదృష్టి.

ప్రపంచంలో ప్రతివ్యక్తికీ యేదో ఒక విషయం నేర్పగలను అనే తీపి, దర్పమూ, అతిశయమూ. ఆ ప్రతివ్యక్తివలే యేదో ఒక మహత్తర సత్యం తెలుసుకోగలననే ధైర్యమూ, వినయమూ, అణకువ.

ప్రయత్నలోపం కించిత్తైనాలేక నాలోని శక్తులను పూర్తిగా వినియోగపరుస్తున్నానని శాంతి. మరిన్ని దారుల, మరెన్నోవిధాలను ప్రయత్నాలను వయనింప జేయగలశక్తి లేదే అని అశాంతి.

'నీ అదృష్టమేమిటి?'

నా పరిధిలోనున్న ప్రతివ్యక్తికీ మంచిని మనస్ఫూర్తిగా కాంక్షించటం. వారి వారి జయనాదాలనుండి పొందతగని ఆనందం, ఆవిజయం నాదైనంత ఆనందం, పొందగలగటం నా దురదృష్టం.

'నీభాగ్యమేమిటి?'

అసంఖ్యాకమైన ప్రజాళిని, పశుపక్ష్యాదులను, వస్తువాహనాలను, ప్రదేశాలనూ, అనుభూతులనూ వాటి వాటి అనురూపాలనూ విశేషమైన వ్యామోహంతో ప్రేమించగలగటం నా కలిమి. నా లేమి కూడా అదే.

'నీ అభీష్ట మేమిటి?

వేలాది జన్మలు. ప్రతి జన్మలోకూడ యీ విధంగానే తీయని కలలు కనడం వాటి చేదుటంచులను రుచిచూడడం. పరుల ప్రేమంటే యేమిటో తెలియక వారిచేతనే [illegible]హితుడనై అసిధారావ్రతం ఆచరిం[illegible] సుఖాన్ని విషతుల్యంగా, దుఃఖాన్ని అ[illegible]తప్రాయంగా భావించి రెండిటినీ సమానంగా కామించటం. నీ బాహువంజరంలో, నీ నిట్టూర్పుల సవ్వడిలో, నీ కోర్కెల క్రూరత్వంలో నాజీవితం చాలించాలనిపించేటంత ఆనందం నీ సాన్నిధ్యంకలిగిస్తుందని ప్రేమించేవారూ, నాజీవన చంద్రికకు నీ నిరాదరణే, నీ నిరపేక్షణీయతే వదలని రాహువని ప్రేమిస్తున్నామనుకునేవారూ చెప్పగావిని ఆభ్రాంతిలోని ఏకత్వాన్ని గమనించగలగటం. ఎంతకఠిన శోధనకు గురవుతున్నా, యెంతటినిర్భరానంద డోలికల్లో ఊగులాడుతున్నా, అంతా ఆదివ్యజ్యోతి లీలలని, ఆపద సేవే ఆపదలను ఆనందాలను సమానం చేయగల సాధనం అని, అప్రకాశమే చీకటిలో వెలుగై, వెలుగులో మార్గమై, మార్గానికి గమ్యమై, గమ్యానికి చేరాలనే ధ్యేయమై నాలోనే ఉన్నదని తెలుసుకొనటం.


'ఇవన్నీ అనుగ్రహింప బడటానికి నీ అర్హతేమిటి?'

సాధారణతలో అసాధారణతను, నలుపులో నాలుగువర్ణాలను చూడగలిగిన శక్తి, మానవ సంప్రదాయాలను, సామాజిక నిబంధనలను అంతస్సాక్షిగా ఉల్లంఘించగల యుక్తి, సృష్టి సున్నయినా, జగతి తలక్రిందులైనా నా ఆత్మ ప్రగతికి నిత్యం దోహదంచేసే కాంతిపైవుండే అచంచల భక్తి. ఇవి అర్హతలు కావా? ముమ్మాటికి అవును. కావున దీవించు. నీ దీవనలకు తగినవాడిని. అభీష్టసిద్ధిరస్తు అని ఆశీర్వదించు, నీ ఆశీస్సులకు అన్నివిధాల అనువైన వాడిని.

'అర్హతలే అని అంగీకరిస్తున్నాను. కాని నీ కోరికలు తీరాలని ఆశించను. దీనికి కార్యకారణాలు తెలియవలసిన సమయం కాదిది. నా దీవనే వేరు. నా కామనే వేరు.

ఏమది?

'మానసోల్లాసప్రాప్తిరస్తు!!



స్వరలహరి

పి. బి. శ్రీనివాస్

స్వరసప్తాచలపతి శ్రీ తాతినేని చలపతి


సాధారణంగా పహిల్వాను గిరికీ సంగీతదర్శకత్వానికీ చాలాదూరం. ఈ రెంటికీ సామరస్యం కుదిరింది వీరిలో. మనిషిని చూస్తే బుల్లిమల్లుడులా కనిపిస్తారీయన. ఆ శిపీ ఆ ఛాతీ విరుచుకు నడవడం అదీ అంతా అదే పర్సనాలిటీ. కళ్ళజోడూ, గళ్ళలుంగీ, గ్లాస్కోజుబ్బా; చేతి చూపుడు వేలు చుట్టూ గిరగిరా తిప్పబడుతూ వుండే కారు తాళాలగుత్తి ఆవిధరించిమనిషికత్తిలా ఉంటారు. కత్తిలాగే పదునుగా కోసేరీతిగా మాటాడతారు.

పహిల్వానులా వుంటారు గాని. స్వరాలతో కుస్తీపట్టే పద్ధతికాదువీరిది. ట్యూనులు వాటంతటవి తేలికగా, నోటికివచ్చేటట్టు కట్టడమే వీరి ధ్యేయం. అందుకనే జనసామాన్యానికిట్టేవచ్చేస్తాయి. వచ్చేస్తాయి.

ఈయన క్యారంస్, ఛెస్, బ్యాడ్మింటన్ ఛాంపియన్. కనుకనే, ఆటల పోటీలో లాగే, జీవితం చవిచూపే జయాపజయాల్ని రెండింటినీ చిరునవ్వుతో ఆహ్వానించగలిగే అరుదైన ఆత్మశక్తి. స్పోర్ట్స్‌మన్‌స్పిరిటూకలవ్యక్తి. ఎవరైనా కష్టంలో వున్నప్పుడు ఆదుకోటానికి వీరితరవాతే ఎవరైనా.

అల్పసంతోషి. ఎక్కువ టేకులు (రికార్డింగులో) అనవసరంగా తీసుకోరు. ఒక అరవ చిత్రంలో "తేడిడుదే" అనేపాట. నేను మరోసారి పాడతానన్నా, వద్దన్నారు. మొదటిటేకే ఓకే చేసేశారు.

'అంతకంటె ఎక్కువగా బాగా పాడేస్తే దృష్టి తగలొచ్చు' అన్నారు. తన కిష్టం లేని పని చేస్తున్నా, చేస్తున్నట్టుకనిపించినా, తనకి కష్టం కలగని విధాన తప్పుకోగలిగే చతురులీ చలపతిరావుగారు. ఈయన టెక్నిక్కులన్నీ ఎరిగిన గొప్ప టెక్నిషియన్. మంచి పొలిటీషియన్. పర్యాప్తమైన సాంకేతిక పరిజ్ఞానం కల్గ విశిష్టులు. రికార్డిస్టు పరాకు చిత్తగించో, లేక అసలు మరిచేపోయో, ఏదైనా ముఖ్యమైన ప్లగ్గు తగిలించడం వదిలేసినా, మరో మీట తిప్పడం



చలపతిరావుతో శ్రీనివాస్ ఇష్టాగోష్ఠి

తప్పినా, కనిపెట్టేసి.. తెలిసో తెలియకో పూరుకోక.., "ఫలానాది మీ రెండుకు ఇన్సర్ట్ చేయలేదూ?" అని ధీమాగా అడిగి జ్ఞాపకం చేయగలిగే జ్ఞానం కలవారు పెద్ద మెకానిక్కు. చీలకిచీలా, నట్టుకి నట్టూ విడగొట్టి, ఊడగొట్టి, విరగ్గొట్టినంతపని చేసి, మళ్ళీమామూలుగానో, అంతకన్న అధికోపయోగకరంగానో తయారుచేసేయ గలిగే యాంత్రిక పరిజ్ఞానంగల మాంత్రికులు.

ఈ సంగీతకారుని జన్మస్థలం కృష్ణా జిల్లాలోని నందమూరు గ్రామం. 30 డిసెంబరు, 1920 వీరి జననదినం. శ్రీద్రోణవల్లి వెంకటరత్నంగారు వీరికన్నతండ్రి. అనంతరం. శ్రీ తాతినేని కోటయ్య గారికి దత్తపుత్రులయారు. వీరు మచిలీపట్నంలో ఇంటర్మీడియెట్ దాకా చదివారు. నాటకాల్లోనూ, ప్రసంగాల్లోనూ పాల్గొని అందరికన్నా మిన్నయన్న ఘనత దక్కించుకొనేవారు. కాని చదువుకోవలసిన రోజుల్లో చదువుల్లో కన్న ఆటపాటల్లోనూ, అల్లరిచిల్లరిచేష్టల్లోనూ, ఆకతాయితనంలోనూ అధికశ్రద్ధవహించేవారు. తన అనుయాయులనేకుల సిబ్బందికి వీరు 'రింగ్ లీడర్'గా వ్యవహరిస్తూ, తను ఏడిపించదలచుకున్న వాళ్ళందర్నీ సరదాకోసం ఇబ్బందిపెడుతూ వుండేవారు. మేష్టర్లకి మారుపేర్లూ, ముద్దుపేర్లూ, తగిలించడంలో మంచి తెలివితేటలు ప్రదర్శించేవారు. "పీత", "సున్నప్పిడత", "బొబ్బాయి" లాటి అద్భుత కల్పనలూ, అపూర్వనామధేయాలూ వీరి మేధాజనితాలు.

కంమ్మగాకుదిరింది. యుగళ శ్రీ (కాదు. యుకలశ్రీ) శ్రీ శ్రీ శ్రీ విరచించిన "ఎక్కడిదొంగ లక్కడె గప్‌చిప్"పాట ప్రజల పెదవులకి వేడివేడి కాఫీ కప్‌లా అందింది. ఆహ్లాదం కలిగించింది.

'మాబాబు' చిత్రంలో సత్యంపాడిన 'శ్రీమతిగారూ చాల్ చాలూ", జానకీ ఘంటసాలలు ఆలపించిన "ఓహో దారిన పోయే చినదానా.". జూనియర్ రత్నాకరుని (సముద్రాల) రతనాల రచన "ఎంతకాలం ఎంత దూరం" వగైరా గీతాలన్నీ స్వరపారిజాతాలు.

"తండ్రులూ కొడుకులూ" చిత్రంలో జానకీ శ్రీనివాస్‌ల యుగళగీతం "ఉన్నమాట అన్నానని ఉలుకెందుకునీకు" (శ్రీశ్రీ విరచితం) విన్నవీనులనిండా మెండుగా మకరందం నింపింది. జానకిగారి సోలో "ఒకటి రెండు మూడూ', శ్రీనివాస్‌సోలో "ఓహోహోసుందరీ" గీతాలసంగీతలాస్యం. జానకీ శ్రీనివాసులు ఆలపించిన. కాలేజీ కాంపిటీషన్ పద్యాలహాస్యం. అనన్యసామాన్యం.

వీరు 'ఆమధ్య' తెలుగుచిత్ర సంగీత సారథ్యం సాగించకపోయినా. 'ఈమధ్య' మళ్ళీ పుంజుకున్నారు 'లక్షాధికారి;' పునర్జన్మ"లతో. "లక్షాధికారి"లో "అద్దాలమేడ వుంది అందాలభామవుంది" "అందమైన చినదానా"అన్న కొసరాజు కలం చిందించిన పసందైన విందులు విపరీతంగా సంతృప్తి పరచాయి రసిక మహాజనుల్ని. అదే సినీమాలో సిద్ధహస్తులైన సి. నారాయణరెడ్డిగారి గేయాలు "నాచెంపతాకగానే." "మబ్బులో ఏముంది". విన్న ఉల్లం ఝల్లు మంటుంది. ఒళ్ళు పులకరిస్తుంది. ఆరుద్ర గేయం "ఎలాగో ఎలాగో వున్నది. ఇలాగే వుంటుందా తొలి ప్రేమ" అన్నది విన్నారంటే చాలు. తెలియనివారికి కూడా తెలిసిపోతుంది తొలిప్రేమ కలగగానే ఎలా వుంటుందన్నది.

"పునర్జన్మ" చిత్రంలో వీరి సంగీతం వినూతన జనన మందినదని అనిపిస్తుంది. ఈ చిత్రానికి. "రీ రికార్డింగు" అనగా సన్నివేశాలకి సమకూర్చిన నేపథ్య సంగీతం ప్రజలదృష్టిని ప్రత్యేకంగా ఆకర్షించి మెప్పొందిందని మనకందరికీ తెలుసున్న విషయమే. "నీకోసం నీకోసం" అని సుశీలగారు వినిపించిన గీతం వింటూన్న ప్రతిహృదయం. ఆ గానం తనకోసమే అని తలుచుకుంటూ తన్మయమైంది. "ఎవరివో నీ వెవరివో" అనే ఘంటసాల గేయం. శాస్త్రీయంగా సాగి. శ్రోతలందర్నీ ఆపి. తమ పనులుకూడా మరిచి నిలబడి వినేలా చేసింది.

"పూలు విరిసెను, తేనెకురిసెను,
అందగాడా నన్ను నీలో దాచుకో"

అనీ. "దీపాలువెలిగె. పరదాలు తొలగె" అనీ. నవ్యంగా భవ్యంగా. కవితా సారథి శ్రీ దాశరథి వ్రాయంగా. కమనీయంగా. మనోమోహనంగా ఆలపించారు శ్రీమతి సుశీల. చలపతిగారు భావయుక్తంగా. సందర్భోచితంగా సమకూర్చిన రాగాల త్రోవలో.

శ్రీ చలపతిగారు ప్రస్తుతంచాలాతెలుగు. తమిళ. కన్నడ చిత్రాలకి సంగీతం యిస్తున్నారు. ప్రజలందరూ వీరి సంగీత రసాల రసాలను గ్రోలి. ఏవో తీయని భావాలలో మునిగి తేలబోతున్నారు. ఆ తిరపతికొండ మీది వెంకటాచలపతి అనుగ్రహం. మన సంగీతా చలపతికి సంతతం లభిస్తూ వుండుగాక !!!

□□□

చిత్రరంగుని చైత్రయాత్ర

జనవరి నె... లనచిత్ర ప్రేక్షకులకు భలేవిందు జ... న్నది; వీనులకు విందు; సంగీతపు విందు.

జనవరి మొదటితేదీకే మీ యెదుట వుండేది శంభూవారి 'పూజాఫలం'. ఈ చిత్రంలో ముఖ్యాకర్షణ సావిత్రి నాగేశ్వరరావు. గుమ్మడివంటి నటమేధావులు ప్రప్రథమంగా కలసి శ్రీ బి. ఎన్. రెడ్డిగారి దర్శకత్వాన నటించడమే. అదీగాక అద్వితీయ గ్లామర్ తార జమున. నాట్యరంభ ఎల్విజయలక్ష్మి యిందులో ఉన్నారు. సంగీత ప్రియులకు వీటన్నిటికీ మించిన ఆకర్షణలు వేరే వున్నవి. వీటిలో ఎస్. రాజేశ్వరరావు సంగీత రచన మొదటిది. పైగా దేవులపల్లి కృష్ణశాస్త్రి. సి. నారాయణరెడ్డి రసమయం చేసిన వరసలు. దానికిపైన ఎస్. జానకి అమోఘంగా పాడిన ఘనం శివయ్యపదం "శివదీక్షాపరురాలనురా". దీనికి అంగవిన్యాసం లాస్యం. చూపేది విజయలక్ష్మి. వసుమర్తి ఆధ్వర్యాన. వసుమర్తి నృత్యం అతి శాస్త్రీయంగా వుండటానికని అత్యంత శ్రద్ధ తీసుకున్నట్లు అభిజ్ఞవర్గాల ద్వారా తెలుస్తున్నది. ఇందులో పగటి వెన్నెలా అన్న సింధుభైరవి గీతం. సుశీలపాడిన దేవులపల్లి సాహిత్యం. ఆనాటి 'మల్లీశ్వరి' కీడైన పాటలని యిక్కడ ప్రచారంలో వున్న వార్త.

సంక్రాంతికి ఒకటి .రెండు రోజులు ముందుగా మీముందు దూకబోయే చిత్రం జగపతి వారు అధిక వ్యయానికీ. అత్యధిక ప్రయాసకీ ఒడిగట్టి తయారుచేసిన చిత్రం "ఆత్మబలం". ఇదికూడా సంగీత ప్రధాన చిత్రమే అని చెప్పుకోవచ్చు. ఆత్రేయ పాటల. కె. వి. మహాదేవన్ వరుసల అందాన్ని గమనిస్తే. ఇందులో కొన్ని కొన్ని పాటలు ఒకో తరహా శ్రోతలకు యెంతో సన్నిహితమవుతాయి. దానికేం సందేహంలేదు. కాని అన్ని తరగతుల ప్రేక్షకులను అంతో యింతో మురిపించేది జమునారాణి. ఘంటసాల పాడిన రేలంగి. గిరిజల యుగళగీతం"ఎన్నాళకెన్నాళ్ళకు". ఘంటసాల సుశీల యుగళ గీతాలు నాలుగో. అయిదో ఉన్న ఈ చిత్రంలో అతిసొంపుగా వున్నవి "వరుగులు తీసే" ఒకటి. చిటపట చినుకులు" రెండు. "ఎన్నాళ్ళకెన్నాళ్ళకు" ఒకసారి వినగానే పట్టుకాని వారెవరైనా వుంటే. వారినీ రెండు పాటలు నిర్మొగమాటంగా జయించి వేస్తాయి. ఒక స్వప్న సన్నివేశానికి ఆత్రేయ వ్రాసిన సాహిత్యం అమర:దీప్తిలా వెలుగొందుతున్నది.

ఈ చిత్రంలో నటించినవారు నాగేశ్వరరావు. బి.సరోజాదేవి. జగ్గయ్య. కన్నాంబ. నాగయ్య. గుమ్మడి. రమణారెడ్డి మొదలగువారు. వి. మధుసూదనరావు. రాజేంద్రప్రసాద్ దర్శక. నిర్మాతలు.



రాజలక్ష్మివారి ''గుడిగంటలు''లో
కృష్ణకుమారి


మరొక చిన్నవిషయం. పై చిత్రంలోనే ఒక సన్నివేశంలో కన్నాంబ, నాగయ్య ప్రేమవాక్కులు పలకడం జరుగుతుంది. మనో నేపథ్యంలో "ఆహా ప్రేమపూజారీ" పాట వినిపిస్తుంది. ఈ పాటా, "పోవోయి పిడిపోవోయీ దరి చేరరాకు గిరిధారీ" అన్నది కన్నాంబ, నాగయ్య హెచ్. ఎమ్. వి. కంపెనీ వారికి పాడిన యుగళగీతాలు. ఇరవై అయిదేళ్ళ నాటివి. వారిరువురుకలసి సుమారు యిరవై చిత్రాలలో నటించి వుంటారు కాని వాటిలో భార్యాభర్తలుగా నటించినవి బహు స్వల్పం. తెలుగులో "నాగులచవితి," తమిళంలో "అశోక్ కుమార్", "నవజీవనం" మొదలైనవి. కాని పాటలుకూడా వీరు ప్రేమగీతాలు పాడటం జరగలేదు. ఆనాటి గ్రామఫోను కంపెనీ అధిపతులెవరో ప్రైవేటు రికార్డులలో పాడించి పుణ్యంగట్టుకున్నారు. కాని ఈనాటి జబ్బు ఆనాడూ వుంది. అవి జూతికారాయ్ పాడిన హిందీ భావగీతాల వరుసలు.

మూగమనసులు

సంగీతానందులకు వీనుల విందుగావించే మరొక చిత్రం బాబూమువీస్‌వారి "మూగమనసులు." ఇది జనవరి యిరవైఅయిదున విడుదలవుతుందని యిప్పటి అంచనా. వీనికి ఆంధ్ర జానపదమే స్వరపథముగా సంగీతం సమకూర్చినది కె. వి. మహదేవన్.

"గోదారి గట్టుందీ" పాట వ్రాసింది దాశరథి. 'గౌరమ్మా నీమొగుడెవరమ్మా' వ్రాసినది కొసరాజు. "ముక్కుమీద కోపం" మొదలైనవి వ్రాసినది ఆత్రేయ. సుశీల, సుశీల–ఘంటసాల, జమునారాణి పాడిన ఈ మూడుపాటలు ఈ చిత్రానికి మణిమకుటాలు. నాగేశ్వరరావు, జమునచేసిన గౌరమ్మ జాతర ప్రత్యేకం.

సంగీతం యింత అపూర్వంగా వున్న ఈ చిత్రంలో నాగేశ్వరరావు, సావిత్రి.



''గుడిగంటలు''లో ఒక సన్నివేశం

గుమ్మడి చూపిన నటనకు ఈడురాదు. వస్తే జమున ఒలకబోసిన పల్లెటూరి ఒయ్యారాలకు తోడు నిలుస్తుందేమోనని తెలిసినవారు యిక్కడ అనుకోనడం, అంటూ వుండటం జరుగుతున్నది.

మూగమనసులు చిత్రానికి కథ– రచన ఆత్రేయ, ముళ్ళపూడి వెంకటరమణ. దర్శకత్వం ఆదుర్తి సుబ్బారావు.

సంక్రాంతి సమయానే రాజలక్ష్మి వారి "గుడిగంటలు"కూడా మ్రోగుతాయి. రామారావు, కృష్ణకుమారి, జగ్గయ్య, వాసంతి, రేలంగి, గిరిజ, రమణారెడ్డి, శాంతకుమారి, మిక్కిలినేని మొదలైన నటీనటులు నక్షత్రగణంలో మెరుస్తారు. సంగీతం ఘంటసాల. పాటల రచన నార్ల చిరంజీవి, అనిసెట్టి, ఆరుద్ర, దాశరథి, సి. నారాయణరెడ్డి. వి. మధుసూదనరావు దర్శకుడు. సుందర్‌లాల్ నహతా, డూండీ నిర్మాతలు.

ఇందులో వున్నవి ఆరు పాటలే.విన్నవి రెండు. ఒకటి జానకి పాడిన నార్ల చిరంజీవి రచన "నీ కనుదోయిని." రెండవది దాశరథి రచన "నీలోన నన్నే" ఘంట



''ర_క్తతిలకం''లో శివాజి గణేశన్

సాల పాడినది. ఈ రెండిటి సాహిత్యం సినిమాల కౌమారదశలో వినపడుతూ, యీనాడు అరుదైన భావగీతాల్లా అపురూపంగా వున్నాయి. ఇటువంటి రచనలను చర్విత చర్వణంచేసి ప్రేక్షకులు గౌరవిస్తే "కోయిలా, చంద్రుడా, తారకా, మబ్బులా, ప్రేయసీ" వంటి రచనలు తగ్గుతాయని విజ్ఞుల ఆశయం.

● ● ●

ఆనాడు విజయభేరి మ్రోగించిన "పాండురంగ మాహాత్మ్యం" చిత్రానికి సహాయ దర్శకునిగా వర్తించిన సోమశేఖరరావు నెలకొల్పిన శేఖర్‌ఫిలిమ్స్‌వారు "గొల్లభామ" చిత్రంతో జనవరి నెలాఖరునకు సెట్స్‌పైకి వెళ్ళనున్నారు. నాయకునిగా రామారావు, యువరాణి స్వయంప్రభాదేవిగా సావిత్రి, మోహినిగా ఎస్. విజయలక్ష్మితదితర నట సందోహంగా రేలంగిగిరిజ, రాజనాల, మిక్కిలినేని, ముక్కామల, బాలకృష్ణ, పుష్పవల్లి ఉన్నారు. మొదటి దృశ్యంలోనే కనబడి అడవిలో తిరుగుతుండే అమాయకురాలిని బలవంతం చేసి ఆమె కోపానికి అదృశ్యంలోనే ఆహుతయిన కామవర్ధనరాజుగా ప్రభాకరరెడ్డి నటిస్తున్నాడు. (ఈ యువనటుడే "బంగారు తిమ్మరాజు", "వేములవాడ భీమకవి" చిత్రాలలో నాయకుని తండ్రిగా, "వివాహబంధం"లో భానుమతి అన్నగా, "కలవారి కోడల్లో" ఎన్. టి. రామారావు స్నేహితునిగా, వైణికునిగా "ప్రభావతిప్రద్యుమ్నం"లో ఒక పాత్రధారిగా, నటిస్తున్నాడు.)

"గొల్లభామ" చిత్రానికి సంగీతం టి.వి. రాజు నిర్వహిస్తారు. ఉండే పన్నెండు పాటలు, రెండు శ్లోకాలు, రెండు పద్యాలలో, ఒకపాట, ఒక పద్యం రికార్డు చేశారు. తక్కినవన్నీ రచనలనీ, వరుసలనీ ఆయత్తపరచుకొని వుంచారు. పాటల రచన సి. నారాయణరెడ్డి. పాటలు పాడినది, పాడబోయేది సుశీల, ఘంటసాల. సంభాషణలు సముద్రాల. దర్శకత్వం సోమశేఖర్. ఛాయ రవికాంత్ నగాయిచ్. కళ: కె.నాగేశ్వరావ్.

ఇటీవల శేఖర్ ఫిలిమ్స్ కార్యాలయానికి వెడితే నిర్మాత, దర్శకులూ అయిన సోమశేఖరరావు అక్కడ వుండటం యీ చిత్రంలో మోహిని సంభాషణలు, కొన్ని పాటలు, యుక్తరసయుక్తంగా అనుభవిస్తూ, అనుభవింపజేస్తూ చదవటం, పాడటం,



డి. బి. ఎన్. వారి ''దాగుడు మూతలు''లో ఎన్. టి. రామారావు

విన్నవారు ముగ్ధులు కావటం జరిగింది. ఈ సోమశేఖరరావు యింతకుముందు సహాయ దర్శకుడేకాక ఒకింతకాలం సంగీత దర్శకుడు ఎస్. రాజేశ్వరరావు సహాయకులుగా వుండటం, ఆమధ్యనే ఒక ఎన్. ఎ. టి. చిత్రంలో చిన్న వేషం వేయటం జరిగింది. వారు వినిపించిన పాటలలో, సంభాషణలలో అంత మాధుర్యం తొణికిసలాడటానికి పైవన్ని ఒక యెత్తు, వారు రసికప్రవృత్తి గలవారైయుండటం ఒకయెత్తు. వారూహించినంతగా ఆ మోహిని నటించాలేగాని, ఈ చిత్రం కళాఖండమవటానికి సంశయమే వుండదు. తథాస్తు!

● ● ●

ఛాయాచిత్ర అనే ఒక కొత్త సంస్థ తమ మొదటి చిత్రం దర్శకత్వ భారం వహించటానికి ప్రత్యగాత్మను యెన్నుకున్నారు. నటవర్గంలో స్థిరపడింది ఎన్టి. రామారావు, జనవరి మాసాంతంలోగాని ఫిబ్రవరి మాసారంభంలో గాని షూటింగ్ మొదలుపెట్టాలని సంకల్పము.

ప్రత్యగాత్మ సూచన ప్రాయంగా తెల్పిన కథారేఖకు దర్శకత్వం నెరపబోయే ప్రత్యగాత్మ, సంభాషణలు వ్రాయబోయే పినిశెట్టి, రంగులు వేస్తున్నారు. ఈ చిత్రానికి ముఖ్యనిర్మాత కె. సుబ్బరాజు. ఒక భాగస్తుడైన సంగీత దర్శకుడు టి. చలపతిరావు కొన్ని పాటలకు, ఎస్. రాజేశ్వరరావు కొన్ని పాటలకు సంగీతం సమకూరుస్తారు.

రాజేశ్వరరావుని గురుభావంతోగౌరవించే చలపతిరావు, వారిని మూడుపాటలకు వరస చేయమని కోరగా, వారు అంగీకరించటం జరిగిందని విశ్వసనీయంగా తెలిసినవార్త.




పరుగులు తీసే నీ వయసునకు
పగ్గం వేసెను నా మనసు
ఉరకలు వేసే నా మనసునకు
ఉసి గొలిపెనులే నీ సొగసు ॥పరు॥

జగపతివారి "ఆత్మబలం"లో సంగీత సన్నివేశం



కోయని పిలిచే
నా పిలుపునకు
ఓయని పలికెను
నీ వలపు
ఓహోయని పలికెను
నీ వలపు

ఓయని పలికే
నీ వలపునకు
తీయగ మారెను
నా తలపు
తియతీయగ
మారెను నాతలపు





తొణకని బెణకని నీ బిగువులతో
దోబూచాడెను నా నగవు
అహ దోబూచాడెను నా నగవు



దోబూచాడే
నా నగవులలో
దొరగ పండెను
నీ మరులు
దొర దొరగ
పండెను నీ మరులు



లేదనిపించే నీ
నడుము
నాదనిపించెను
ఈ క్షణము
ఉందో లేదో
ఈ జగము
వుందువు నీవు
నాలో సగము —

ఇది నిజము
కాదనుము — ॥ప॥



అనురూపావారి కొత్తచిత్రం

తమ మొదటిచిత్రం భానుమతితో తీసి ఆంధ్రుల అనురాగాన్ని చూరగొన్న అనురూపాసంస్థవారు దర్శకుడు రామినీడు సారథ్యాన భానుమతిని నాయకురాలు నాగమ్మగా నిలిపి "పల్నాటి వీరకథ"ను నిర్మించాలను కుంటున్నారు. కథనం సంభాషణలు సదాశివ బ్రహ్మవి. నిర్మాతలు టి. హనుమంతరావు. డి. సూర్యనారాయణ.

ఇందులో భారీ తారాగణాన్నే పొందుపరుస్తారని వార్తలు. మొదటి చిత్రంలోనే భానుమతి. గుమ్మడి. జి. వరలక్ష్మి. జానకి ప్రభృతులతో నెగ్గుకు వచ్చిన రామినీడుకు అందని తారలుండరనుకోవటం సమంజసం.

"బొబ్బిలి యుద్ధం" లో మల్లమ్మ. "పల్నాటి వీరకథ"లో నాగమ్మ. మరి రాణి రుద్రమగా ఆంధ్రుల కళా కల్పవల్లి ఎప్పుడు అవతరించనున్నదో!

● ● ●

తమిళంలో విజయపతాక యెగురవేసిన "శారద" చిత్రాన్ని అదే పేరుతో అశోక్ మువీస్ నిర్మించగా వీనస్‌వారు సమర్పిస్తారు. నిర్మాత టి. గోవిందరాజన్ సహాయ నిర్మాత టి. వి ఎస్. శాస్త్రి. దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు సంగీతం కె.వి. మహాదేవన్. కళ సుబ్బారావు. పాటలు మాటలు ఆత్రేయ. నిర్మాణం సారథి స్టూడియోస్, హైదరాబాద్.

నటీ నటులు: నాగేశ్వరరావు. సావిత్రి. యస్. వి. రంగారావు. జగ్గయ్య. జి. వరలక్ష్మి. రేలంగి. వాసంతి. నాగయ్య. ఒక చిన్నతరహా హాస్యజంట కూడా జోడింపబడుతుంది. మీ రిదిచదివే నాటికి మొదటి సెట్టుకు కావలసిన నాలుగుపాటల రికార్డింగ్ పూర్తయివుంటుంది. సెట్టారోహణ ఈనెల చివరన.


ఈ చిత్రానికి సహ నిర్మాత టి.వి.ఎస్. శాస్త్రి అంటే చాలమందికి తెలియదు. కాని ప్రతిభాశాస్త్రి అంటే ఓహో అంటారు. ఒకప్పుడు ఈ ప్రతిభకు కారణం 'ప్రతిభా' వారితో పని చేయడమే అయినా ఈనాడు అది నిలవటానికి కారణం మాత్రం తన ప్రతిభా విశేషమే.

సాహిత్యమంటే ఆసక్తి అభిరుచి ఉన్న కొద్దిమంది నిర్మాతలలో ఈ ప్రతిభాశాలి ఒకడంటే అతనంటే కానివాయ కూడ కాదనరు. "జయభేరి" అంతటి కళాసంపదగా అవతరించటానికి కొంతకారణమైన ఈ ప్రతిభా శాస్త్రి ప్రతిభకు మరింత దోహదం చేసింది మల్లాది రామకృష్ణశాస్త్రి గారంటే ఉన్నభక్తి గౌరవం. అభిమానం. ప్రతిభావంతుల ప్రతిభకు ఒక సాక్ష్యం యితరుల ప్రతిభకు వారు దాసోహమ్మనటం అని విజ్ఞులకు తెలిసినదే.

ఇటువంటి సాహిత్యారాధకుల చేతిలో పడితే "క్షేత్రయ్య" వంటి వస్తువు కెంతటి ఘనత కల్గునో కదా!

● ● ●

రఘురాంవారి "తలవారికోడలు" కొత్తపెళ్ళికూతురులా యింకా తుది సింగారాలలో వుంది. రామారావు "గుడిగంటల" పనిలో కేరళలో వుండటం వలన రెండు పాటల్లో ఒకటిన్నర కాల్షీట్లు పని మిగిలిపోయింది. తిరిగి రాగానే బలేబలే ముస్తాబు ముగించుకొని మీ ముందుంటుంది.



శంభు ఫిలిమ్స్‌వారి "పూజాఫలం"లో గుమ్మడి, సావిత్రి

ఈ చిత్రంలో ప్రత్యేక ఆకర్షణలు సుశీలపాడిన సి. నారాయణరెడ్డి రచన "విరిసిన పూవును నేను" నార్ల చిరంజీవి వ్రాసిన జానకిపాట "మంచిమనసు తెలిపేదీ స్నేహము".

ఈ సంస్థ తదుపరి చిత్రం "బ్రహ్మచారి". రామారావు కృష్ణకుమారి తారాగణంలో. కె. హేమాంబరధరరావు. అట్లూరి పూర్ణచంద్రరావు నిర్మాత-దర్శక. సహాయ నిర్మాత బాధ్యతలకు మామూలే. కథ ప్రత్యగాత్మ.

పూర్వం "వినాయక చవితి" "దీపావళి" వంటి పౌరాణిక కళా ఖండాలను నిర్మించిన కె. గోపాలరావు ఆధ్వర్యాన అశ్వరాజా పిక్చర్స్ పేరిట పి. సత్యనారాయణ "శ్రీ సత్యనారాయణ మహాత్మ్యం" అనేచిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో రామారావు. కృష్ణకుమారి. రేలంగి. కాంతారావు ప్రముఖ పాత్రలుధరిస్తారు. రేలంగి. ధరించబోయేది ఒక విలక్షణమైనదని దర్శకభారం వహించబోతున్న ఎస్. రజనీకాంత్ తెలిపారు.



''రక్తతిలకం''లో సావిత్రి

రచన, సంగీతం సముద్రాల సీనియర్ ఘంటసాల మామూలే. ఛాయ సి. నాగేశ్వ్రరావు తదితర తారాగణం. సాంకేతికబలం ఈనెలాఖరునకు సెట్‌పైకి వెళ్ళేముందు తెలియజేస్తారు. పాట రికార్డింగ్ కూడ ఈ నెలలోనే జరుగుతుంది.

ఈచిత్రం వాణీవారిద్వారా విడుదల చేయబడుతుంది.

సాధారణ పౌరాణిక చిత్రాల యితివృత్తాలకూ, ఈ చిత్రం కథనానికికూడా తేడా కొంత కనబడుతుంది. దీనికి కారణం కథ చెప్పడానికి మేము యెన్నుకున్న వినూత్నపద్ధతి అని దర్శకుడు రజనీకాంత్ అన్నారు. ఈకథనంలో వ్రతమాహాత్మ్యంలో ఉన్న అయిదుకథలు,దానిని ఒకసూత్రంలో గుచ్చే ఆరవ కథా వుంటాయనీ వారే అన్నారు.

పెద్దతరహా ప్రయత్నం కాబట్టి వచ్చే సంక్రాంతికి విడుదలకావచ్చని మాఅంచనా. వీరి తరువాత చిత్రం "శ్రీకృష్ణసత్యభామ" ఎన్. టి. రామారావు కృష్ణుడు.

● ● ●

ప్రతిమారు యెంచిన కథలో, చెప్పే విధానంలో కొత్తదనం తప్పకుండా చూపే ఒకే సంస్థ అనుపమా సంస్థ. ఇటువంటిసదుద్దేశాలున్న సంస్థ వెలుగులోకి రావటమేకాక మూడుపువ్వులు ఆరు కాయలుగా వుండంటే చిత్రసీమకే పండుగ, అభ్యుదయ కాములకు వేడుక.

ఈసంస్థ తిలక్‌ది. వీరికొత్త చిత్రంపేరు "ఉయ్యాల జొంపాల", జగ్గయ్య, జమున, గుమ్మడి ఆ చిత్రంలోని పాత్రలకు ప్రాణదాతలు. సంగీతం చిట్టితమ్ముడు పెండ్యాల. పాటలు ఆరుద్ర. కథ సంభాషణలు పినిసెట్టి. ఛాయ "ఈడూ-జోడూ"లో ఈడూ జోడూ లేనట్టి నిపుణత చూపిన చౌదరి చేతిలో ఉంది. జనవరిలో షూటింగ్ మొదలవుతుంది. ఇప్పటికి పాటలన్నీ రికార్డింగ్‌కి సిద్ధంగా ఉన్నవి.

వీరి తదుపరి చిత్రంలో ఎన్టీ ఆర్ వుంటారు. జగ్గయ్య, జమున, గుమ్మడి, పెండ్యాల, ఆరుద్ర, చౌదరులతో బాటు ఒక కథ తీసుకుంటే ఆరుద్రదవుతుంది. మరొకటిచేబడితే పినిశెట్టిదవుతుంది. □□

కళాఖండాలు

నండూరి పార్థసారథి

ఈమధ్య మన దేశంలోకూడా 'కళాఖండాల' పిచ్చి వెర్రితలలు వేస్తోంది. ఈ పిచ్చి ఆనవాయితీ ప్రకారం ముందు హాలీవుడ్‌లో పుట్టి, అక్కణ్ణుంచి మన దేశానికీ, మన రాష్ట్రానికి దిగుమతి అయింది. 'కళాఖండాలు' అంటే ఉత్తమ చలన చిత్రాలకు మన మేధావులు పెట్టుకున్న ముద్దుపేరన్న మాట. (అంటే "కళను నరికి పోగులు పెట్టిన ముక్కలు" అని అర్థం.)

హాలీవుడ్ నిర్వచనాలు

'కళా ఖండం' అనేదానికి హాలీవుడ్‌లో చాలా అర్థాలు చెబుతారు. "జీవితమును అత్యంత వాస్తవికముగా చిత్రించునది" అని కొందరు చెబుతారు. (ఉదా: హీరో భోంచేస్తున్నాడనుకోండి. అతని ఎదురుగ్గా కెమేరాని పావుగంటసేపు పాతేస్తారన్నమాట). "తక్కువ ఖర్చుతో ఔట్‌డోర్‌లో నిర్మించునది" అని మరికొందరు అంటారు. (ఉదా: వీటిల్లో, పడిపోయిన గోడలు, దుబ్బుజుట్టు బిచ్చగాళ్ళు, హృదయసౌందర్యముగలమెల్ల కన్ను హీరో, రొమ్ముదగ్గర చిరిగిపోయిన జాకెట్ ధరించిన పేద హీరోయిను మొదలయినవి వుంటాయి, "అత్యంత మేధావంతముగా నిర్మించినవి" అని మరొక నిర్వచనం. (సింబాలిజం గట్రా నింపి అర్థం కాకుండా తీయడం అన్నమాట. ఎంత అర్థం కాకపోతే అంత గొప్ప కళా ఖండం. ఈ చిత్రాల్లో అన్నీ సింబల్సే వుంటాయి. హీరోకి బదులు అతని వీపుమాత్రం కనిపిస్తుంది.)

అసలు హాలీవుడ్డేతర చిత్రాలన్నింటినీ కళాఖండాలుగా భావించేవారుకూడావున్నారు. అంతేకాదు- వాళ్ళదృష్టిలో ఎంత దూరదేశంనుంచి దిగుమతి అయితే అంత కళాఖండం. ఈ అభిప్రాయాన్ని మన్నించే హాలీవుడ్ నిర్మాత ఎవరైనా కళాఖండం నిర్మించదలచుకుంటే కెమేరా బుజాన వేసుకుని దేశాంతరం పోవాలి.

అసలీ నకలీ

కళాఖండాలు అసలు ముందు ఇటలీలోనూ, జపాన్‌లోనూ పుట్టాయి. ఈమధ్య ఫ్రాన్స్, జర్మనీ, ఇండియా (బెంగాల్), రష్యాలలో కూడా తయారవుతున్నాయి. ఈ దేశాల్లో తయారైన చిత్రాలకే అంతర్జాతీయ చలనచిత్రోత్సవాల్లో బహుమతులు వస్తున్నాయి. ఈ చిత్రాలను మిగతావాళ్లంతా బరితెగించి కాపీకొట్టేస్తున్నారు. కళాఖండం అంటే (1) హాలీవుడ్డేతర (2) చౌక (3) వాస్తవిక చిత్రమని అభిప్రాయపడే అమెరికన్ యువదర్శకులు కొందరు ఈ మధ్య న్యూయార్క్ వీధుల్లో సినిమాలు తీయడం ప్రారంభించారు. మొత్తానికి కళాఖండాల నిర్మాణానికి తగిన వాతావరణం హాలీవుడ్‌లో లేదన్న నమ్మకం మాత్రం అందరిలోనూ పాతుకుపోయింది.

ఎక్కడైనా కొత్తదనం కనిపిస్తే వేలం వెర్రిగా అందరూ దాన్నే గుడ్డిగా అనుక

రిస్తూ, చివరికి దానిమీద అసహ్యం పుట్టేటట్లు చేయడం అన్నిరంగాల్లోనూ జరుగుతూనే వుంది. మోడరన్ ఆర్టు, మోడరన్ పొయిట్రీ ఇలాగే వెర్రితలలు వేశాయి. శ్రీశ్రీగారు మహాప్రస్థానం రాసింతర్వాత యువకవులంతా పొలోమని ఆయన వెంట పడ్డారు. జుట్టుపీక్కుని, చొక్కాలు చింపుకుని, గుండెలుబాదుకుంటూ ఆకలి కవిత్వం రాశారు. చివరికి ఆకలి కవిత్వం మీద అందరికీ డోకుపుట్టింది. ముళ్ళపూడి రమణగారు హాస్యంలో కొత్తశైలిని సృష్టించేసరికి ఓ వందమంది రచయితలు ఆయన చొక్కా పట్టుకుని నడవటం మొదలు పెట్టారు. హాస్యంపేరు చెప్పుకుని వాళ్లంతా సింపుల్ సెంటెన్సులు రాయడం మానేశారు. అలాగే అబ్‌స్ట్రాక్ట్ ఆర్ట్ పేరిట సిరామరకలు, పిచ్చిగీతలుకూడా చిత్రకళగా చెలామణీ అవుతున్నాయి.

సుమారు పన్నెండేళ్ళ క్రితం బొంబాయిలో అంతర్జాతీయ చలన చిత్రోత్సవం జరిగింది. అప్పట్నించే కళాఖండాల మోజు ప్రారంభమయింది. దరిమిలా మోజు ముదిరి పిచ్చి అయింది. 'బైసికిల్ థీఫ్', 'రషమాన్', 'యూకీవారీసూ' వంటి గొప్ప చిత్రాలను, ఆ ఉత్సవంలో ప్రదర్శించారు. 'బైసికిల్ థీఫ్'ను చూసిన మర్నాడే బిమల్‌రాయ్‌గారు 'దోబీఘా జమీన్' తీయడం ప్రారంభించారు. 'యూకీవారీసు' చిత్రాన్ని చూసి మన వాళ్ళంతా కథలో దాగా లేకపోయినా ఎలాగో ఒకలాగు ఒక అరటికెక్కెట్టును ఇరికించడం, చివరికి ఆ పిల్లాణ్ణి రైలు పట్టాలమీద పరుగెత్తించడం ప్రారంభించారు. 'యూకీవారీసు' లో పిల్లాణ్ణి రైలు పట్టాలమీద పరుగెత్తించడంకేవలం 'త్రిల్' కోపం కాదు. దానికి వేరే చాలా ప్రయోజనం వుంది. అది సూక్ష్మరహస్యం. అదేమిటో చిత్రం చూసినవాళ్ళలో నూటికి 90 మందికి అర్థంకాదు. మన ప్రొడ్యూసర్లు నూటికి 90 మంది కోవకే చెందుతారు.

తర్వాత సత్యజిత్‌రాయ్‌గారు వచ్చి మొదటి చిత్రంతోనే దిగ్విజయయాత్ర చేసేసరికి, మర్నాటికల్లా ఓ డజను నకిలీ సత్యజిత్ రాళ్ళు వెలిశాయి. వీళ్ళలో ఎక్కువ మంది బెంగాలీలే. సత్యజిత్‌రాయ్‌ని అనుకరింప జూస్తున్న వాళ్ళలో చాలామంది - చిత్రం యెంత నెమ్మదిగా నడిస్తే అంత కళాఖండం అని మాత్రమే అర్థం చేసుకున్నారు. వీళ్ళు ఎలాంటి చిత్రాలు తీసినా 'అయ్యబాబోయ్ కళా ఖండం' అని గుండెలు బాదుకునే పత్రికలు చాలా వున్నాయి.

ఆంధ్రా 'ఇంటలెక్చువల్స్'

కళాఖండాలపిచ్చి మన ఆంధ్రా 'ఇంటలెక్చువల్స్' కి కూడా పుట్టింది. అసలు ఈ ఇంటలెక్చువల్స్ (మేధావులు) ఎవరో ముందు తేల్చుకుందాం. వీళ్ళుసాధారణంగా 20 ఏళ్ళుదాటినవారు, 55 ఏళ్ళలోపువాళ్లూ అయివుంటారు. వీళ్ళు ఎక్కువగా రచయితలు, జర్నలిస్టులు, కళాకారులు, లాయర్లు కాలేజీవిద్యార్థులు అయివుంటారు. చేతులో ఏదైనా ఇంగ్లీషుపత్రికగానీ, మాగజైనుగానీ పట్టుకుని, లావుపాటికళ్ళజోడు పెట్టుకున్న పెద్దమనిషి ఎక్కడైనా కనిపిస్తే నిస్సందేహంగా అతను ఇంటలెక్చువల్. కళాఖండం అంటే మీ ఉద్దేశం ఏమిటి అని నిగ్గదీసి అడిగితే వీళ్ళలో ఒక్కరూ చెప్పలేరు. అసలు చెప్పుకోడానికి నామోషీగా వుంటుంది కూడాను. కాని వీళ్ళకి కొన్ని బండగుర్తులున్నాయి. ఆ గుర్తులున్న వాటిని వీళ్ళు కళాఖండాలంటూ వుంటారు. ఇంటలెక్చువల్స్ లిస్టులో చేరాలని మోజుపడేవాళ్ళు వాటిని పొగుడుతూ వుంటారు. పాపం కొందరు ఈ గుర్తులు తెలియక మామూలు చిత్రాన్నికూడా కళాఖండమనుకుని పొగిడేసి, తర్వాతకాదని తెలుసుకుని నాలిక్కరుచుకుంటూవుంటారు. అలాంటివారు కళాఖండాలను గుర్తించడానికి ఈక్రింది బండగుర్తులను బట్టీపట్టడం మంచిది.

బండగుర్తులు

1. ఇతరచోట్ల 'కళా ఖండం' అనే మాటని కేవలం సాంఘిక చిత్రాలకే ఉద్దేశించి మాట్లాడుతున్నారు. కాని మన తెలుగులో ఈమాట సాంఘికాలకు, చరిత్రాత్మకాలకు కూడా వర్తిస్తుంది. పౌరాణికాలు, జానపదాలు ఎంత గొప్పగా వున్నాసరే కళాఖండాలు కావు. డైరెక్టర్ ఎన్ని ఐడియాలు గుప్పించి, మొర్రోమని మొత్తుకున్నాసరే వాటిని కళాఖండాలని గుర్తించడానికి మన ఇంటలెక్చువల్స్ ఒప్పుకోరు. మరీ బ్రహ్మాండంగా వుంటే డైరెక్టర్ ఆత్మశాంతికోసం 'బాక్సాఫీస్ చిత్రం' అని మాత్రం అంటారు. ఎందుకంటే - జానపదాలు "వుట్టి కట్టుకథలు. అర్థం పర్థం వుండదు. అన్నీ మాయలు, మంత్రాలు, కత్తియుద్ధాలు. గుర్రపు స్వారీలు. ఇవి ఆడవాళ్ళకీ, పిల్లలకీగానీ మనవాళ్ళకి కాదు." ఇహ పౌరాణిక చిత్రాలయితే - పాపం డైరెక్టర్ ఎంత చిత్తశుద్ధితో తీసినా సరే - ఈక ఈక పీకి మహాకవి తిక్కనగారి వర్ణనలతోనూ, పూర్వం ఇదే చిత్రంలో గగ్గయ్యగారు చేసిన యాక్షన్‌తోనూ పోల్చి లక్ష ఎత్తిపొడుపులు పొడుస్తారు. అసలు పౌరాణిక చిత్రాలను మెచ్చుకోవడం నాగరీకం కాదు. మహా అయితే "ఏదో కాలక్షేపానికి ఫరవాలేదనుకోండి" అంటారు. కె. వి. రెడ్డిగారు 'పాతాళభైరవి' చిత్రాన్ని అద్భుతంగా నిర్మించారు. నిజానికి ఇంతవరకు తెలుగుసినిమాల్లో దానికి సాటి వచ్చే జానపద చిత్రంలేదు. అయినా మేధావులు దాన్ని 'కళాఖండం' అనలేదు. 'బాక్సాఫీస్ చిత్రం' అని మాత్రమే సర్టిఫికేట్ ఇచ్చారు. ఎందుకు? అది జానపదం గనుక. అందులో మాయలు, మంత్రాలు వున్నాయి గనుక. వాస్తవికత లోపించింది గనుక. కానీ ఈమేధావులే కె. వి. రెడ్డిగారు అంతకు పూర్వం తీసిన 'పోతన' ను కళాఖండంగా లెక్కవేశారు. ఎందుకు? అది చరిత్రాత్మక చిత్రం కనుక. కానీ మరి ఆ చిత్రంలోనూ వాస్తవికత లేదు. పోతన సుమారు 500 ఏళ్ళ క్రిందటివాడే. అయినా అందులో దేవుడు ప్రత్యక్షంకావడం, చెంబులు, తప్పేలలూ నడిచిరావడం, గిన్నెలన్నీ లడ్డూలతో నిండిపోవడం, చివరికి హనుమంతులవారు ప్రత్యక్షమై దుష్టుణ్ణి శిక్షించటం లాంటి 'అసందర్భాలు' ఎన్నో చూపించారు. 'వేమన'లో కూడా ఇంతే. అయినా మనవాళ్ళకవి కళాఖండాలే అయినాయి.

2. ఇక సాంఘిక చిత్రాలలో కళాఖండాలను గుర్తించడానికి కొన్నికిటుకులున్నాయి. పడిపోయిన గోడలు, మాసిపోయినగడ్డాలు, చిరిగిపోయిన చొక్కాలు ఎక్కువగా కనిపిస్తే అది కళాఖండమే. ఇవన్నీ వాస్తవిక

తకు సంకేతాలు. ఈ చిత్రాలలో హాస్యం బొత్తిగా వుండదు. నర్తనడకతో మోరోజుగా వుంటాయి.

3. భాష తెలిసినా మీకు సినిమా ఏమీ అంతుపట్టలేదనుకోండి– అది కళాఖండ అన్నమాట. అర్థంకాలేదని ఆక్షేపించకండి. పక్కన ఎవరైనా మేధావివుంటే నవ్వేస్తాడు. మనం ఇంకా డైరెక్టర్‌స్థాయికి ఎదగలేదని సరిపెట్టుకోండి. ఇంకో గుర్తు– ఈ చిత్రాలు సాధారణంగా గొడ్డలితో నరికేసినట్లు సగంలో ఎక్కడో అర్థంతరంగా ఆగిపోతాయి. 'సమాప్తం' అని తెరమీద చూపితేనే గాని మనకు ఆవిషయం తెలియదు. 'సుపర్బ్' అంటూ దర్జాగా జేబుల్లోచేతులు పెట్టుకులేచి నుంచోండి.

4. చిత్రంలో మతిభ్రమణం, వైద్యం సైకో ఎనాలసిస్సు వున్నాయంటే నిస్సందేహంగాఅది కళాఖండమే. ఇటువంటివాటిల్లోనే సింబాలిజంగట్రా వుంటాయి. చాలా జాగ్రత్తగా చూడాలి. తెరమీద కనిపించే ప్రతి వస్తువు ఏదో మహత్తరమైనదానికి సంకేతమన్నమాట. విరిగిన కుర్చీవుంటే అది చితికిన ఆశకి చిహ్నమన్న మాట. గతుకుల రోడ్డు చూపిస్తే అది కష్టాలతో నిండిన జీవితపథం అన్నమాట. ఇలా మీ వూహాశక్తిని బట్టి, మీమేధను బట్టి, లాగినకొద్దీ, పీకినకొద్దీ అనంతంగా అర్థాలు పుట్టుకొస్తూవుంటాయి. డైరెక్టర్‌ని అడిగితే "అంతా మీవూహకే వదిలాను" అంటాడు. అందుకని మీకుతోచిన అర్థాలు మీరుచెప్పుకుని ఇంతే మనస్తోమతు అని వూరుకోండి.

5. పావలాప్రేక్షకులచేచెప్పులువిసిరించుకుని రెండోవారమే నిష్క్రమించిన చిత్రాలన్నీ

"ఈమధ్య బెజవాడలో ప్రతిరోజూ ఒకమనిషి లారీకింద పడుతూనే వున్నాడు."

"వాడికెంత ఓపికో ?"

' –బ్' కి అర్థంకాని మహత్తర కళాఖండాలు. మళ్ళీ వచ్చినప్పుడు మరచిపోకుండా చూడండి. వాటిలో తప్పనిసరిగా 'యాంటీ సెంటిమెంటు' వుండి వుంటుంది. దర్శక నిర్మాతల సాహసాన్ని మెచ్చుకోండి.

6. ఇక చరిత్రాత్మక చిత్రాల్లో కళాఖండాలను గుర్తించడానికి కొన్ని బండగుర్తులున్నాయి. చిత్రం ఆరంభంలో టైటిల్ మ్యూజిక్‌కి ఏదైనా వర్ణంగానీ, త్యాగరాజ కీర్తనగానీ ఉపయోగిస్తే అది కళాఖండం. ఇటువంటి చిత్రాల్లో కత్తిలేని శుద్ధకషాయం లాంటి శాస్త్రీయ సంగీతాన్ని వుపయోగిస్తారు.

7. ఇతర భాషలలో కళాఖండాలను గుర్తించడం కష్టం. ఎందుకంటే భాష తెలీదు కనుక, అయినా వాటికీ కొన్ని బండగుర్తులు జ్ఞాపకం పెట్టుకోండి కత్తియుద్ధాలు, అద్భుతాలు, అపరాధ పరిశోధనలు, సాహసాలు లేని ఇంగ్లీషు చిత్రాలన్నీ కళాఖండాలే. ఫ్రెంచి, ఇటాలియన్, జాపనీస్, జర్మన్, రష్యన్ చిత్రాలన్నీ కళాఖండాలే. (ఎంత భ్రష్టాండమైనవి కాకపోతే అంత దూరంనుంచి దిగుమతి చేస్తారు). మీ పట్టణంలో మంచి సెంటరులోవున్న అందమైన పెద్ద థియేటరులో ఆదివారంనాడు, పండుగనాడు మార్నింగ్ షోగా వేసే ప్రతి విదేశీ చిత్రం కళాఖండమేనని జ్ఞాపకం వుంచుకోండి.

ఈ బండగుర్తులను జ్ఞాపకం పెట్టుకుని, తదనుగుణంగా మీరు వ్యాఖ్యానాలు చేస్తుంటే మిమ్మల్ని ఇంటిలెక్చువల్స్ కాదని అనగల దమ్ము ఎవరికీ వుండదు. □□□




వాణీ రిలీజ్
జగపతి పిక్చర్స్
ఆత్మబలం
వి. మధుసూదనరావు
రాజేంద్ర ప్రసాద్
స్టూడియో శ్రీ సారథి హైదరాబాద్